thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 164 కరీంనగర్ శుక్రవారం, 22 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.




## యూరియాతో రాజకీయాలు చేస్తున్నారు..

హైదరాబాద్: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపు తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆరోపించా రు. రాష్ట్రంలో యూరియా కొరతకు, రైతులు ఇబ్బందులు పడటానికి కేంద్రామే ప్రధాన కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గత కొన్ని నెలలుగా కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడం లేదని తెలిపారు. యూరియా విషయమై రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోరితే.. ప్రధాని మోదీ దాని అడ్డుకున్నారని విమర్శించారు. దేశవ్యాప్తం గా యూరియా ఉత్పత్తి ఆగిపోయిందని పేర్కొన్నారు. కావాలనే.. కాంగ్రె స్ ప్రభుత్వాన్ని బీజేపీ బద్నాం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఇవాళ(గురువారం) మీడియాతో మాట్లాడారు..

**కేంద్రం చేతకానితనంతోనే కష్టాలు..** బీజేపీ నేతల మూర?పు మాటలతో బీజేపీ బలపడదని తుమ్మల నాగేశ్వర రావు హితవు పలికారు. నెలాఖరులోపు తెలంగాణకు కేటాయించాల్సిన యూరియా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం చేతకానితనంతోనే తెలంగాణకు యూరియా కష్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వాస్తవాలు అంగీకరించాలని తెలిపారు. యూరియా కోసం కేంద్రానికి ఎన్నిసార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల పదవిలో ఉన్న రామ్‌చందర్‌రావు సోయిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని తమ్మల వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేతకానితనాన్ని ఒప్పుకోలేక బీజేపీ నేతల అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొంతమంది రైతులను అడ్డుపెట్టుకుని చచ్చిన పార్టీని బతికించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల కోసం అవాస్తవాలు మాట్లాడి మీ పార్టీల పరువు తీసుకోవద్దని తుమ్మల స్పష్టం చేశారు. యూరియా సమస్యను కొందరు రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపట్ల రాష్ట్ర ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తుమ్మల సూచించారు.

# జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?: హైకోర్టు




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టుకు వివరించారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదని చెప్పారు. కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయంగా భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విలేకరుల సమావేశంలో సీఎం కమిషన్ నివేదిక వివరాలను తెలిపారని అన్నారు. వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారని, కేసీఆర్‌కు మాత్రం నివేదిక కాపీలు ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని కేసీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానానికి వివరించారు. ఇద్దరు పిటిషనర్లు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయటపెట్టారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి విలేకరికి 60 పేజీల నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించడం లేదని సీజే అన్నారు. ప్రాధాన్యం దృష్ట్యా విచారణ ఇవాళే కొనసాగించాలని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాత చర్యలు తీసుకుంటారా? అని హైకోర్టు ధర్మాసనం.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి సమయం కావాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.



## ఆందోళనలో అగ్రరాజ్యం.. తన తలపైన తానే మట్టి పోసుకున్న అమెరికా..!

# ఇకపై అమెరికా వద్దు..

## కొత్త మార్గాన్ని వెతుక్కుంటున్న 7 దేశాలు..


అమెరికా వాణిజ్య విధానాలు అస్థిరంగా ఉన్నాయని, కెనడా విధానాలు చాలా స్థిరంగా మరియు నమ్మదగినవిగా ఉన్నాయని భారతదేశంతో సహా ప్రపంచ దేశాలు ఇప్పుడు గ్రహించడం మొదలుపెట్టాయి. దీని ఫలితంగా, ప్రపంచంలోని కొన్ని ముఖ్యమైన దేశాలు కెనడాతో బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఇది ఉత్తర అమెరికాలోని సరఫరా గొలుసులో ముఖ్యమైన మార్పులను తీసుకొచ్చింది. ఈ మార్పుల వల్ల అమెరికాలో వస్తువుల ధరల పెరుగుదల, సరుకుల కొరత మరియు పరిశ్రమలలో వెనుకబాటుతనం వంటివి ఏర్పడ్డాయని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఏడు దేశాలు అమెరికాతో వాణిజ్యాన్ని పక్కనపెట్టి ఒక కొత్త ఆర్థిక మార్కెట్‌ను సృష్టించుకున్నాయి. ఆ 7 దేశాలు ఇక్కడ ఉన్నాయి: **చైనా:** $1.2 బిలియన్ల విలువైన అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్ ఒప్పందం, ఇది అమెరికాను కాదని కొత్త సరఫరా గొలుసును సృష్టిస్తుంది. భారతదేశం: $1.8 బిలియన్ల విలువైన వస్త్రాలు, మందులు మరియు ఇతర వస్తువుల ఒప్పందం, ఇది ఒక పెద్ద ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థను అమెరికా మార్కెట్ నుండి దూరం చేస్తుంది. మలేషియా: $900 మిలియన్ల విలువైన ఎలక్ట్రానిక్స్ మరియు పామాయిల్ వాణిజ్య ఒప్పందం, ఇది ఆసియా ఎలక్ట్రానిక్స్ మరియు ఇతర వస్తువులను కెనడా పోర్టుల గుండా పంపిస్తుంది. బ్రెజిల్: $1.5 బిలియన్ల విలువైన వ్యవసాయ ఒప్పందం, ఇది ఉత్తర అమెరికాలో కాఫీ, సోయాబీన్స్ మరియు ఇతర వస్తువుల సరఫరాను పునర్వ్యవస్థీకరిస్తుంది. థాయిలాండ్: $1.1 బిలియన్ల విలువైన ఉత్పత్తి మరియు వ్యవసాయ ఒప్పందం, ఇది ఆగ్నేయ ఆసియా ఉత్పత్తిని కెనడా వైపు మళ్లిస్తుంది. దక్షిణ ఆఫ్రికా: $800 మిలియన్ల విలువైన వాహన విడిభాగాలు మరియు విలువైన లోహాల ఉత్పత్తి మరియు మైనింగ్ ఒప్పందం. స్విట్జర్లాండ్: $1.3 బిలియన్ల విలువైన టెక్నాలజీ మరియు విలాసవంతమైన వస్తువుల ఒప్పందం, ఇది ఖచ్చితమైన స్విస్ ఉత్పత్తి వస్తువులను కెనడాకు మళ్లిస్తుంది. ఈ మార్పులు, అమెరికా వాణిజ్య విధానాలు మరియు పన్నుల కారణంగా వచ్చిన ప్రతిచర్యగా కనిపిస్తున్నాయి. ఈ ధోరణి అమెరికా యొక్క పారిశ్రామిక నాయకత్వానికి ఒక పెద్ద సవాలుగా ఉందని చెబుతున్నారు.




భద్రాచలం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు బుధవారం రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. రాత్రి 10 గంటల సమయంలో గోదావరి నీటి మట్టం 48 అడుగులు కాగా.. గురువారం ఉదయానికి 50.8 అడుగుల మేర ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరి పలు మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద కల్యాణ కట్ట ప్రాంతం వరకు వరద నీరు చేరింది. స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు, విద్యుత్ స్తంభాలు నీటిలో మునిగిపోయాయి. గోదావరి నీరు పట్టణంలోకి రాకుండా అధికారులు గోదావరి కరకట్టకు ఉన్న స్లూయిజ్‌లను మూసివేశారు. దీంతో పట్టణం నుంచి మురుగునీరు బయటకు వెళ్లకపోవడంతో అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి.. నీటిని తోడివేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల ఇంకా నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ధవళేశ్వరం వద్ద 9.88 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా .. అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఆనకట్ట వద్ద 11.9 అడుగుల నీటిమట్టం నమోదైంది. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# గట్టి పోరు!

## ఎన్డీయే 422...ఇండియా బ్లాక్ 300!!




# హీటెక్కిన నేషనల్ పాలి'ట్రిక్స్'

భారత రాజ్యాంగ పదవుల ఎంపిక గతంలో కొంత రాజకీయానికి దూరంగా ఉండేది. రాను రానూ ఇది రాజకీయ పోటీగా మారుతోంది. రాజ్యాంగ పదవులు అయిన రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి వంటి వాటిని నిజానికి ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి. అలా అందరూ కూర్చుని ఆమోదయోగ్యమైన వారికి ఆ అత్యున్నత పీఠం అందించాలి. కానీ వర్తమాన రాజకీయాలు చూస్తే కనుక ఆ విధంగా జరిగే అవకాశాలు ఎంతమాత్రం లేదు అన్నది స్పష్టం. అందుకే పోటీ జరుగుతోంది ఇది సిద్ధాంతాల మధ్య పోటీగా చెబుతున్నా వెనక రాజకీయ రాద్ధాంతాలు కూడా కలగలసి ఉన్నాయన్నది వాస్తవం.

**ఉప రాష్ట్రపతి ఎన్నిక అలా :** భారత రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి రెండూ పరోక్ష ఎన్నికలే. అంటే ప్రజలు తాము గెలిపించిన ప్రజా ప్రతినిధులు వారిని ఎన్నుకుంటారు అన్న మాట. ఉప రాష్ట్రపతి విషయానికి వస్తే లోక్ సభ రాజ్యసభ ఎంపీలు ఎన్నుకుంటారు. ఇందులో నామినేటెడ్ ఎంపీలకు కూడా ఓటు చాన్స్ ఉంటుంది. అలా చూస్తే కనుక లోక్ సభలో 542 మంది రాజ్యసభలో 240 మంది ఎంపీలు కలిపితే మొత్తం 782 మంది ఎంపీలు ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. సగానికి కంటే ఎక్కువ ఓట్లు సంపాదించుకున్న వారు ఉప రాష్ట్రపతిగా నెగ్గినట్లు. అంతే కాదు ఆ రోజు ఓటింగుకు హాజరై ఓట్లు వేసిన వారిలో సగం పైగా ఏ అభ్యర్థికి వస్తాయో వారికే పీఠం దక్కుతుంది

**ఎన్డీయేదే పైచేయి :** ఈ లెక్కలు అన్నీ చూసుకున్నపుడు ఎన్డీయేదే పైచేయిగా ఉంటుంది అన్నది వాస్తవం. ఎన్డీయేకు లోక్ సభలో 293 మంది, రాజ్యసభలో 129 మంది ఎంపీల మద్దతు ఉంది. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 394 ఉంది. అంటే ఈ లెక్కన ఎన్డీయేకు 422 మంది ఎంపీల సాలిడ్ మద్దతు ఉన్నట్లే. ఇక ఇండియా కూటమికి లోక్ సభ ప్లస్ రాజ్యసభ కలిపితే దాదాపుగా మూడు వందల మంది దాకా ఎంపీల మద్దతు ఉంది. ఈ రెండు పార్టీలు కాకుండా మిగిలిన వారు న్యూట్రల్ ఎంపీలు వారు అరవై మంది దాకా ఉంటారు. ఇక వారి ఓట్లు ప్లస్ ప్రత్యర్థి శిబిరం నుంచి ఓట్లు కనుక దక్కితే ఫలితం సంచలనం అవుతుందని ఇండియా కూటమి ఆశ.

**విప్ జారీ ఉండదు :** ఇక ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విప్ జారీ చేయడం ఉండదు. అంటే ఎంపీలను ఆయా పార్టీలు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయమని విప్ ద్వారా శాసించలేవు.

ఎవరికి నచ్చినట్లుగా వారు వేసుకునే వీలు ఉంది. అయితే అధికారికంగా విప్ జారీ చేయకపోయినా అనధికారికంగా ఆయా పార్టీలు తన ఎంపీల ఓట్లు జారీ పోకుండా చర్యలు తీసుకుంటాయి. దాంతో పార్టీ గీత దాటి ఓటు వేసే వారు బహు తక్కువ. మరో వైపు చూస్తే ఇది సిద్ధాంతపరమైన పోరుగా ఇండియా కూటమి అభివర్ణిస్తోంది. రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకుంటామని చెబుతోంది.

**ఉత్కంఠ ఎందుకంటే :** ఒక వైపు రాజ్యాంగ వ్యవస్థల మీద దాడులు అని ఇండియా కూటమి ప్రచారం చేస్తోంది. విపక్షాలు రాజకీయం అని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే అంటోంది దాంతో ఈ ఎన్నిక ఉత్కంఠతో కూడుకున్నదిగా మారుతోంది. ఇంకో వైపు చూస్తే ఈ ఎన్నికల్లో గెలిచి రాజ్యసభలో తమ ఆధిపత్యం చూపించాలని ఇండియా కూటమి భావిస్తోంది. తమ పోరాటానికి ఎన్డీయే కూటమి నుంచి సైతం మద్దతు దక్కుతుందని ఆశిస్తోంది.

**న్యూట్రల్ పార్టీలే కీలకం :** ఇక ఈ ఎన్నికల్లో న్యూట్రల్ పార్టీలే కీలకంగా మారబోతున్నాయి. ఏపీ నుంచి వైసీపీ తెలంగాణా నుంచి బీఆర్ఎస్ ఒడిషా నుంచి బీజేడీ, యూపీ నుంచి బీఎస్పీ, ఢిల్లీ నుంచి ఆప్ లాంటి పార్టీలు ఏ కూటమిలో లేవు. వీటి ఓట్లే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో అత్యంత కీలకం అవుతాయని అంటున్నారు. ఇలా హోరాహోరీ పోటీ ఎవరికి వారుగా వ్యూహాలతో ముందుకు సాగుతున్న నేపథ్యం ఉంది. మొత్తం మీద చూస్తే ఎండీయే కూటమికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సులువుగా విజయం దక్కించకూడదు అన్న ఇండియా కూటమి వ్యూహాలు అయితే పూర్తి స్థాయిలో సక్సెస్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో కొత్త ఉప రాష్ట్రపతిగా ఎవరు కొలువు తీరుతారు.



# మాదాపూర్‌లో రూ.400 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 కబ్జా(దాదాపు 8,500 గజాలు)కు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు.. 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఇలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

**జైహింద్‌రెడ్డిపై ఫిర్యాదులు..** హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. దీంతో హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది.




# ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఈ రహదారులకు వర్తించదు!

వాహనదారుల కోసం స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. రూ.3 వేలు చెల్లించి కొనుగోలు చేస్తే ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుంది. సగటున రూ.15తో టోల్ ప్లాజాను దాటేందుకు ఈ పాస్ ఉపయోగపడుతుంది. వాహనదారుల నుంచి కూడా ఈ పాస్‌కు అద్భుత స్పందన లభిస్తోంది. కేవలం 24 గంటల్లోనే 1.4 లక్షల మంది ఈ పాస్‌ను కొనుగోలు చేశారు. అయితే ఈ ఫాస్టాగ్‌ను ఎవరెవరు తీసుకోవచ్చు? ఏయే రహదారులకు వర్తిస్తుంది?

**అన్ని వాహనాలకూ కాదు...** వ్యక్తిగత వాహనదారులకు ఊరట కల్పించే లక్ష్యంతో ఈ పాస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. అయితే, వ్యక్తిగత కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ ఫాస్టాగ్ వర్తిస్తుంది. వాణిజ్య వాహనాలకు చెల్లుబాటు కాదు. వాహన్ డేటాబేస్ ఆధారంగా వాహన రకాన్ని గుర్తిస్తారు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు మళ్లీ కొత్త ఫాస్టాగ్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌తోనే టోల్‌పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు.

**ఈ రహదారులకు వర్తించదు...** ఈ ఫాస్టాగ్ కేవలం జాతీయ రహదారులకు మాత్రమే వర్తిస్తుంది. జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేల మీద ఉండే టోల్ ప్లాజాల వద్ద మాత్రమే ఉపయోగపడుతుంది. సరళంగా చెప్పాలంటే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, జాతీయ రోడ్లు, రహదారులు మంత్రిత్వశాఖ నిర్వహించే టోల్‌ప్లాజాల వద్ద మాత్రమే ఈ పాస్ చెల్లుబాటు అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1159 టోల్ ప్లాజాల వద్ద పాస్ చెల్లుతుంది.

అయితే, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ వేలు, రహదారులపై ఉండే టోల్ ప్లాజాల వద్ద పాస్ చెల్లదు. ఉదాహరణకు హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్. దీన్ని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ ప్రస్తుతం నిర్వహిస్తోంది. ఇక్కడ వార్షిక పాస్ వర్తించదు. అలాగే, ఏపీలో తిరుమల కొండపైకి వెళ్లేటప్పుడు సప్తగిరి టోల్ ప్లాజా వద్ద కూడా ఈ వార్షిక పాస్ చెల్లదు. ఆయా టోల్‌ప్లాజాలు దాటినప్పుడు సాధారణ ఛార్జీలు వర్తిస్తాయి. కాబట్టి ఫాస్టాగ్ తీసుకునేటప్పుడు మీరు దాటబోయే టోల్ ప్లాజాలు ఎవరి పరిధిలోకి వస్తాయో తెలుసుకోవడం కూడా ముఖ్యం.

**ఎలా యాక్టివేట్ చేసుకోవాలి?...** ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. NHAI, morth వెబ్‌సైట్లలో కూడా లింక్ అందుబాటులో ఉంటుంది. మొబైల్ నంబర్, వాహన నంబర్, ఫాస్టాగ్ వివరాలు ఎంటర్ చేసి లాగిన్ కావాలి. పేమెంట్ గేట్‌వే ద్వారా రూ.3వేలు చెల్లించాలి. అనంతరం రెండు గంటల్లో పాస్ యాక్టివేట్ అవుతుంది. మొబైల్‌కు ఎస్సెమ్మెస్ కూడా వస్తుంది.

# ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాలపైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధరించనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# కేటీఆర్‌కు మంత్రులు స్ట్రాంగ్ కౌంటర్..




హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. థర్డ్ గ్రేడ్ ప్రభుత్వం అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండిపడ్డారు థర్డ్ గ్రేడ్ ప్రభుత్వం అంటే ఏంటో కేటీఆర్ చెప్పాలన్నారు. థర్డ్ గ్రేడ్ అంటే కేటీఆర్ చేసిన అవినీతినా..? ఆయన అహంకారమా? అనేది చెప్పాలన్నారు. థర్డ్ గ్రేడ్ అంటే తమ ముఖ్యమంత్రినా? ప్రభుత్వమా? అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ది డర్టీ మైండ్ అని.. ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు ఇంట్లో పంచాయితీ తట్టుకోలేక డైవర్ట్ చేయడం కోసం పిచ్చి పిచ్చి కామెంట్స్ చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కేటీఆర్‌ను సొంత చెల్లినే వ్యతిరేకిస్తోందని.. దాంతో ఆయన మైండ్ కరాబైందని ఎద్దేవా చేశారామె. బీఆర్ఎస్-బీజేపీ రాజకీయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. హెలికాప్టర్ వేసుకుని థర్డ్ ఫ్రంట్ అని తిరిగారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ దృష్టిలో ఫస్ట్ గ్రేడ్ అంటే ఏంటో? థర్డ్ గ్రేడ్ ఏంటో చెప్పాలన్నారు. కేటీఆర్ ముందు కవిత చేస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సమాధానం చెప్పాలని చురకలంటించారు మంత్రి సీతక్క.

**కేటీఆర్‌పై పొన్నం ఫైర్..** ఇదే సమయంలో కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్.. కేటీఆర్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ బండారం సెప్టెంబర్ 9న బయట పడుతుందన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ దోస్తానా ఉందో లేదో ఆ రోజు తేలిపోతుందని వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగు బిడ్డకు మద్దతుగా నిలబడతావా? లేదా? అని కేటీఆర్‌ను మంత్రి పొన్నం ప్రశ్నించారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణం అని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ కృత్రిమ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. యూరియా ఇచ్చేది రాష్ట్రమా? కేంద్రమా? కేటీఆర్ చెప్పాలన్నారు. యూరియా ఎవరిస్తారో వారికే మద్దతు అంటే అర్థం ఏంటి? అని కేటీఆర్‌ను మంత్రి పొన్నం ప్రశ్నించారు. బీఆర్ఎస్.. బీజేపీ అభ్యర్థికే మద్దతు ఇస్తుందని కేటీఆర్ కామెంట్స్‌ను బట్టి అర్థం చేసుకోవాల్సి వస్తోందన్నారు.

# పీపీపీ ద్వారా వాహనాలు సమకూరిస్తే మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం: సీవీ ఆనంద్

హైదరాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్ని వాహనాలు ఇచ్చినా పోలీస్‌శాఖకు సరిపోవని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. అందుకే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా వాహనాలను కేటాయిస్తే ఇంకా మెరుగ్గా సర్వీసులు అందించగలుగుతామన్నారు. హైదరాబాద్‌లో 650 జంక్షన్‌లు ఉన్నాయని.. రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోందని చెప్పారు. నగరంలో సగటువేగం 18కి.మీ నుంచి 23కి.మీకి పెరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్‌లో నియమించామన్నారు. "ట్రాఫిక్ మార్షల్స్ సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్సైల పర్యవేక్షణలో పని చేస్తారు. చాలా ఆలోచించిన తర్వాతే ట్రాఫిక్ సిబ్బందికి డ్రెస్‌లు ఇచ్చాం. రాబోయే రోజుల్లో 500 మంది వరకు ట్రాఫిక్ మార్షల్స్ పెరుగుతారని అనుకుంటున్నాం. వీళ్లంతా చాలా బాధ్యతగా వ్యవహరించాలి. ట్రాఫిక్ విభాగానికి, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లకు డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేశాం. బైక్ నడుపుతున్న వారికి బాడీవేర్ కెమెరా ఉంటుంది." అని సీపీ వివరించారు.






హైదరాబాద్: సింగరేణి బొగ్గు గని కార్మికులకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాశారు. టీవీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. " రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది. సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీవీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు" అని కవిత తెలిపారు.

# ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే: పొన్నం ప్రభాకర్



కరీంనగర్: తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. రైతులకు జవాబు చెప్పాల్సిన బాధ్యత బండి సంజయ్‌పై ఉంది. ఎరువుల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించి భారత రాష్ట్ర సమితి నేతలు రాక్షసానందం పొందుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువుల్లో 60 శాతం మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది. అందువల్లే కొంత ఇబ్బంది కలుగుతోంది. రాష్ట్రం నుంచి ఏదైనా సమస్య వస్తే బాధ్యత వహించడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే.. కాంగ్రెస్ లక్ష్యం

ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి కారణం రాష్ట్ర ప్రజల ఫలితమే అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన ఇవాళ(గురువారం) తిరుమలాయపాలెం మండలంలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని ఎక్కడ తగ్గనివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేతలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుభరోసా రూ.10 వేలు ఇస్తే.. తమ ప్రభుత్వం రూ.12 వేల చొప్పున 9 రోజుల్లో 9 వేల కోట్లు ఇచ్చిందని తెలిపారు. పేదలకు గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని, ఈ ప్రభుత్వం 7 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని పొంగులేటి స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో కోళ్ల ఫారాల్లో, రైస్ మిల్లుల్లో హాస్టల్స్ నిర్వహిస్తే.. ఈ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతును రాజు చేసే పనిలో.. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుటుందని వివరించారు.



# కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సాధారణం.. కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సర్వసాధారణమని పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సాధారణ వర్గ విభేదాలను ప్రతిపక్షలు తప్పుడు కోణంలో చూస్తూ.. తప్పడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏ పార్టీలో అయిన వర్గ విభేదాలు ఉంటాయని, సమయాన్ని బట్టి అవి బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఇవాళ(గురువారం) ఏబీఎన్‌తో మాట్లాడారు. వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ముంపునకు గురవుతుండడానికి నాలాల ఆక్రమణే కారణమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి %ణ్యా=% సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఉద్యమానికి భారీ స్పందన వస్తోందని తెలిపారు. దొంగ ఓట్లతోనే అన్ని రాష్ట్రాల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీకి మొదటి నుంచి తెలంగాణ అంటే ఇష్టం లేదని.. అందుకోసమే రాష్ట్రానికి యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం నివేదికతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు బట్టబయలయ్యాయని మంత్రి సురేఖ విమర్శించారు. నివేదికలో మాజీ సీఎం కేసీఆరే.. ప్రధాన సూత్రధారిగా తేలిందని ఆరోపించారు. నివేదికలో నిజాలు బయటపడ్డ బీఆర్ఎస్ నేతలు ప్రజలకు కళ్ళబుల్లి మాటలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు విష ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు ఉన్న కేంద్రం నుంచి యూరియా తేలేకపోయారని విమర్శించారు. తెలంగాణలో మోదీ భజన చేయడంలో ఉన్న శ్రద్ధ వారికి రైతుల మీద లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు తమ వైపే ఉన్నారని కొండా సురేఖ స్పష్టం చేశారు.



# రాచకొండ సీపీ ఎదుట లొంగిపోయిన సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు

హైదరాబాద్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట ఇద్దరు సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు కాకరాల సునీత సీపీ ఎదుట లొంగిపోయారు. ఆమె తండ్రి, ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఇందుకు సంబంధించిన వివరాలును సీపీ వెల్లడించారు. "వరవరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వారి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారు. ఆమె 1986లో పీపుల్స్ వార్ పార్టీలో ఉన్నారు. 1986 ఆగస్టులో టీఎల్ఎన్ చలం గౌతమ్ అలియాస్ సుధాకర్‌ను వివాహం చేసుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1992లో నల్లమల అడవుల్లోకి వెళ్లారు. 2001లో ఏవోబీ ప్రాంతానికి, 2006లో దండకారణ్యానికి బదిలీ అయ్యారు. చెన్నూరి హరీశ్ అలియాస్ రమణ కూడా నేడు లొంగిపోయారు. ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడు ఏటూరునాగారం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మావోయిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. 2024లో ఏసీఎంగా పనిచేశారు. వీరిద్దరూ ఎన్నో ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నారు. జనజీవన స్రవంతిలో పాల్గొనడం మంచి పరిణామం" అని సీపీ తెలిపారు.

# ఆదరణ కరువైన తోలుబొమ్మలాట - ఆగస్టు 22... ప్రపంచ జానపద కళల దినోత్సవం

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసి పోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట. ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించ వచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్ధంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని




బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు. ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు. తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు. తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళ్ళు అని చెప్పడానికి వాటిని బ్రతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# గో వృషభ పూజా పర్వదినం... పోలాల అమావాస్య"

భిన్న సంస్కృతులు, భాషలు, ధర్మాలు, ప్రజల కేంద్రస్థానమై, అఖండ మరియు అవిభాజ్యమైన సంస్కృతికి మూలాధారమైన భారతావని ప్రాచీన కాలంనుండీ వ్యవసాయ ప్రధాన దేశం కావడం గ్రామీణులలో అధిక సంఖ్యాకులు రైతుల కావడం, ఎద్లు మరియు నాగళ్ళతో విడదీయరాని బంధం, అనుబంధాన్ని ఏర్పరచుకున్న రైతు వాటికి కృతజ్ఞతను ప్రకటించే వారసత్వ ఆచార క్రమంలో, ఏటా శ్రావణ మాస ముగింపు దినమైన అమావాస్యను 'పోలాల అమావాస్య'గా పండగ జరుపుకోవడం అనాదిగా వస్తున్న సత్సాంప్రదాయం. దీనిని గో, వృషభ ఉద్దిష్టమైన పర్వదినంగా భావిస్తారు. శ్రావణ కృష్ణ అమావాస్యను తెలుగు ప్రజలు ''పోలామావాస్య లేక పోలాలామావాస్య"గా వ్యవహరిస్తారు. "పోల' అనగా కడుపునిండా మేతమేసి నీరు త్రాగి పనిపాట లేకుండిన ఎద్దు అని అర్ధం. "అమా" అంటే అమావాస్య. పోలాలామావాస్య అంటే ఎద్దులను బాగా మేపే అమావాస్య అని అర్థం. పౌరాణిక గాథ ప్రకారం అంధకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి, అనేక వరాలు పొంది, వరగర్వం చేత ఒకసారి పార్వతిని కామించడం జరిగింది. శివుడు భూలోకానికి వెళ్ళిన వేళ కనిపెట్టి, అంధకాసురుడు పార్వతి వద్దకు వెళ్ళి తన దుష్టచింతను తెలిపాడు. అదిగాంచి వాకిట కావలిగల నంది అంధకునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇంతలో శివుడు వచ్చి వియయం తెలుసు కుని అంధకాసురిని సంహరించాడు. ఈసదర్భంలో నందికేశ్వరుడు చేసిన సాయానికి మెచ్చి శివుడు, నందిని ఏదైనా వరం కోరుకో మన్నాడు. శిలాదుడు పొలము కెక్కిరిస్తూండగా ఆది వృషభ రూపమున నేను, ఆయనకు దొరికిన రోజు శ్రావణ బహుళ అమావాస్య కనుక, ఆనాడు వృషభ పూజ చేస్తే ఫల ప్రదమయ్యేట్లు అనుగ్రహించ మమని వేడుకోగా శివుడు అనుగ్రహించాడని తెలుస్తున్నది. మాళవదేశంలో 'పోల' పండువగా, మహారాష్ట్రలో 'పిథోరి అమావాస్యగా, ఆంధ్రదేశంలో 'పోలాంబ' వ్రతాచరణలు ఆచరణలో ఉన్నాయి. అలాగే పోలాల అమావాస్యతో ముడివడియున్న "పోలాంబ లేక పోలకమ్మ, పోలేరమ్మ" పేరుతో దేవీ పూజలు ఆచరించే నేపథ్యంలో, పెళ్లయి చాలా కాలమయినా సంతానం కలుగని స్త్రీలు, సంతానవతులైన స్త్రీలు ఈ వ్రతాన్ని ఆచరించడం సాంప్రదాయమై ఉంది. పిల్లలకు అకాల మృత్యు భయముండ కుండా పూజలు నిర్వహిస్తారు. సంతానం ఆయురారోగ్యాలతో ఉండటానికి కారణమైన గ్రామ దేవతల కరుణా కటాక్షాలు ఉండాలని, అందుకే మన పెద్దలు గ్రామ దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి పండుగల రూపాలలో ఎన్నో అవకాశాలు కల్పించారు. మరి అటువంటి గ్రామ దేవతలలో పోలేరమ్మ ఒక ముఖ్యమైన దేవత. పోలాల అమావాస్య భక్తి శ్రద్ధలతో జరుపుకుని, అమ్మవారుగా కొలవబడే గౌరీదేవిని పూజించి, పిల్లలకు పసుపు కొమ్ము కట్టిన తోరములను కట్టే కార్యక్రమాలు ఆచరిస్తారు. పోలాల అమావాస్య వేడుకల నిర్వహణ సనాతన ఆచారంగా వస్తున్నది. పూజచేసే చోట ఆవుపేడతో అలికి, వరిపిండితో అందమైన ముగ్గువేసి, ఒక కందమొక్కను వుంచి, పసుపుకొమ్ము కట్టిన నాలుగు తోరాలను అక్కడ వుంచి, ముందుగా వినాయకుని పూజించి, తర్వాత ఆ కంద




మొక్కలోకి మంగళగౌరీ దేవిని, సంతానలక్ష్మీ దేవినిగాని ఆవాహనచేసి షోడశోపచారాలతో అర్చించి, తొమ్మిది పూర్ణం, బూరెలు, గారెలు, తొమ్మిది రకాల కూరగాయలతో చేసిన పులుసు ఆమెకు నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాత బహు సంతానవతి అయిన పెద్ద ముత్తయిదువును పూజించి, కొత్తచీర, రవికల గుడ్డ పెట్టి, నైవేద్యం పెట్టని తొమ్మిది పూర్ణంబూర్లు, ఒక తోరాన్ని అమ్మవారికి వాయనంగా సమర్పించి దీవెనలు అందుకుంటారు. ఇలా చేస్తే పిల్లలు మృత్యువాత పడకుండా కలరా, మలేరియా , మశూచి మొదలైన వ్యాధులు రాకుండా పోచక్క తల్లి పిల్లలను కాపాడుతుందని విశ్వాసం. పొలాల అమావాస్య నాడు వ్యవసాయం కలవారు ఎద్దులకు పూజ చేస్తారు. వ్యవసాయం లేనివారు ఎద్దు బొమ్మలు మట్టితో చేసి వాటికి పూజ చేస్తారు. ఏరువాక (జ్యేష్ట) పౌర్ణమి నుండి వ్యవసాయ పనులతో తీరిక ఉండని ఎద్దులకు ఆటవిడుపుగా, రైతులు ఎద్దుల నాలుకలకు ఉప్పురాచి, నాగలి కట్టక, వ్యవసాయ పనులకు తాత్కాలికంగా విశ్రాంతి నొసంగి, ఎడ్లను రంగు రంగులతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, అలంకరించి ,"వృషభోత్సవాన్ని" ఆనందోత్సాహాల మధ్య జరుపు కుంటారు. గ్రామదేవతను ఆరాధిస్తూ ... వ్యవసాయానికి సహకరించే పశువులను పూజించే పర్వదినం కనుక ఇది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తుంది. పోలాల అమావాస్య సందర్భంగా గృహిణులు మట్టితో ఎడ్లను, పశువుల కాపరి మృణ్మయ మూర్తులను తయారు చేసి, పూజలు నిర్వహిస్తారు. సర్వ బాధల, సకల రోగాల నివారణార్థం మరియు సర్వజనులు సుఖ శాంతులలో వర్ధిల్లాలని గ్రామ దేవతయైన పోచమ్మను ప్రార్థించి, ఆరాధించి, సువాసినులను తమ ఇళ్ళకు విందులకు ఆహ్వానించి, పోచమ్మతల్లి ప్రతిరూపా లాగా భావించి, కైమోడ్పులు, భోజన తాంబూల దక్షిణ, కట్నకానుకలతో సంతృప్తి పరచే ప్రత్యేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈసందర్భంగా ముత్తయిదువలు పోటీలుపడి వంటకాలు తయారు చేయడం సనాతన ఆచారంలో భాగం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# "తత్త్వం, తపన, త్యాగం" సమ్మిళిత వ్యక్తిత్వం...బి.ఎస్. రాములు

## సాహిత్యం నుంచి సమాజ పోరాటం వరకు - బి.ఎస్. రాములు జీవన గాథ"

## ఆగస్టు 23...సాహితీవేత్త బి ఎస్ జన్మదిన సందర్భంగా



తెలుగు సాహిత్య చరిత్రలో బి.ఎస్. రాములు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తత్త్వవేత్త, రచయిత, సామాజిక ఆలోచనా పరుడు. శతాధిక గ్రంథాలను రచించి, తన ఆలోచనల విప్లవాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించిన ఆయన రచనలు కేవలం పుస్తకాలలో మాత్రమే కాకుండా ప్రజల మనసుల్లో చైతన్యాన్ని నింపాయి. ఆయన సాహిత్యం తత్వశాస్త్రం, విప్లవాత్మక దృక్పథం, ఆధునికత, సామాజిక చైతన్యం అన్నీ కలిసిన ఒక ప్రవాహం. సమాజంలోని అన్యాయాలపై ఆయన నిరంతర పోరాటం, బలహీన వర్గాల పక్షాన తీసుకున్న ధృఢమైన వైఖరి ఆయన రచనలను జీవం ఉన్నవిగా నిలబెట్టాయి. బి.ఎస్. రాములు జననం తెలంగాణ ప్రాంతంలోని విప్లవాల పురిటిగడ్డ జగిత్యాలలో ఒక సాధారణ వెనకబడిన కుటుంబంలో జరిగింది. చిన్ననాటి నుంచే ఆయనకు శాస్త్రం, తత్త్వం, ఆధ్యాత్మిక గ్రంథాలపై ఆసక్తి ఎక్కువ. ధర్మపురి క్షేత్రంలో సంస్కృతాంధ్ర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో సాంప్రదాయ విద్యాభ్యాసం...సంస్కృత వేదాధ్యయనం, తెలుగు సాహిత్య పఠనం, ఆంగ్లంలో పాశ్చాత్య తత్త్వవేత్తల రచనల అధ్యయనం – ఈ మూడు మానసిక ఆహారాలుగా మారాయి. బాల్యం నుండే జ్ఞాన పిపాసతో, ఆధ్యాత్మిక వేదాంతాలపై ఆసక్తితో పెరిగిన రాములు గారు, తూర్పు-పాశ్చాత్య తత్త్వాల మధ్య సంధానాన్ని చూపుతూ తన గ్రంథాలను రచించారు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బౌద్ధ-జైన తత్త్వాలు, క్రైస్తవ-ఇస్లామిక్ ఆధ్యాత్మిక దార్శనికత, ఆధునిక తర్కశాస్త్రం, విజ్ఞానశాస్త్రం – అన్నింటిని సమన్వయంగా పరిశీలిస్తూ ఆయన తత్త్వ రచనలు కొనసాగాయి. గ్రామీణ నేపథ్యంతో పెరిగిన రాములు చిన్న వయస్సులోనే అన్యాయం, అసమానతల స్వరూపాన్ని గమనించాడు. ఆయన విద్యాభ్యాసం తత్త్వ విజ్ఞానంలో లోతైన పునాది వేసి, తన రచనలకు ఒక విశ్వ దృష్టిని ప్రసాదించింది. మార్క్సిస్టు భావజాలం, అంబేడ్కర్ ఆలోచనలు, జ్యోతిరావు ఫూలే పోరాట స్ఫూర్తి ఆయనలో ఒక నూతన ఆలోచనా ప్రక్రియను మేల్కొలిపాయి. సాహిత్యం ఒక సమాజ మార్పు సాధనమని నమ్మిన ఆయన దానిని ఒక ఆయుధంలా ఉపయోగించాడు. రాములు శతాధిక గ్రంథాలను రచించడం ఆయన అశేషమైన తపనకు నిదర్శనం. అందులో తత్త్వ చింతన, సమాజ విశ్లేషణ, రాజకీయ దృక్పథం, కవిత్వం, కథలు, వ్యాసాలు అన్నీ చోటు చేసుకున్నాయి. ఆయన తత్త్వవేత్తగా మానవ సమానత్వం, సాంఘిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణపై స్పష్టమైన వ్యాఖ్యానాలు చేశాడు. విప్లవాత్మకుడిగా ఆయన సాహిత్యం అణగారిన వర్గాల గళంగా మారింది. ఆధునికతను ఆలింగనం చేసుకున్న రచనలలో ఆయన విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ప్రపంచీకరణ వంటి అంశాలపై కూడా స్పందించాడు. కేవలం తత్త్వ గ్రంథాలకే పరిమితం కాకుండా, సామాజిక సమస్యలపై కూడా ఆయన గొంతు విప్పారు. కులవ్యవస్థ, అసమానతలు, మూఢనమ్మకాలు, ఆధునిక సమాజంలో విలువల ప్రాధాన్యత, రాజకీయ అవినీతి వంటి అంశాలపై ఆయన రచనలు మేలుకొలుపు కర్రలుగా నిలిచాయి. ఆయన శైలిలో బోధనా రీతితో పాటు, పాఠకుని ఆత్మ పరిశీలనకు నడిపించే విశ్లేషణ కనిపిస్తుంది. దళిత, బహుజన, బిసి వర్గాల సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బిసి నాయకత్వాన్ని పెంపొందించేందుకు, సామాజిక శక్తుల ఐక్యతకు ఆయన బహుళ వేదికలను ఏర్పాటు చేశాడు. ముఖ్యంగా దళిత రచయితలు, కవులు, కళాకారులు, మేధావులను ఒక వేదికపై చేరి సాహిత్య కృషి ద్వారా సమాజ మార్పుకు దారితీసే ప్రయత్నం ఆయన ఆధ్వర్యంలోనే రూపుదిద్దుకుంది. ఆ వేదిక ద్వారా దళిత సాహిత్యం ఒక ఏకగళం సంపాదించి, సామాజిక న్యాయ పోరాటానికి చిహ్నమైంది. ఆయన సమాజ సేవ సాహిత్యానికే పరిమితం కాలేదు. పేద విద్యార్థులకు సహాయం చేయడం, సామాజిక సంస్థలకు మార్గనిర్దేశనం చేయడం, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం న్యాయ పోరాటాలు చేయడం ఆయన జీవితం నిండా కొనసాగిన అంశాలు. బిసి నాయకత్వాన్ని బలపరిచే క్రమంలో ఆయన నిర్వహించిన సమావేశాలు, సదస్సులు అనేక కొత్త తరం నాయకులను వెలికి తీశాయి. ఆయన సాహిత్యంలో ఒక వైపు కవిత్వం ద్వారా హృదయాలను తాకగా, మరోవైపు తత్త్వ గ్రంథాలు ఆలోచనలకు లోతు నింపాయి. ఆయన కథలు, వ్యాసాలు సామాజిక వాస్తవాలను నిశితంగా చిత్రించాయి. ఈ కారణంగానే ఆయన రచనలు కేవలం పాఠకులకు మాత్రమే కాక, ఉద్యమకారులకు, చింతకులకు, విధానకర్తలకు కూడా ప్రేరణగా మారాయి. బి.ఎస్. రాములు జీవితం, సాహిత్యం, తత్త్వం అన్నీ ఒకే దారిలో నడిచాయి. ఆయన ఆలోచనల విప్లవం పుస్తక పుటలకే పరిమితం కాకుండా ప్రజా జీవితంలో ప్రతిధ్వనించింది. దళిత, బిసి వర్గాల ఐక్యత, సమాజ సమానత్వం, సాంఘిక న్యాయం అన్నీ ఆయన రచనల్లో మంత్రాల్లా ప్రతిధ్వనించాయి. తెలుగు సాహిత్య లోకంలో ఆయన పేరు కేవలం ఒక రచయిత పేరు కాదు, అది ఒక సాహిత్య తపస్వి జీవన గాథ, ఒక విప్లవాత్మక ఆలోచనల సంకేతం. తన వయో వృద్ధాప్యంలో కూడా ఆయన కలం ఆగడం లేదు. జ్ఞాన దాహం, తత్త్వ పిపాస, రచనా నిరంతరతతో బి.ఎస్. రాములు తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించారు. శతగ్రంథ కర్తగా, తత్త్వవేత్తగా ఆయన చేసిన కృషి భవిష్యత్ తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఈ బిల్లు పాస్ అయితే చంద్రబాబు రేవంత్ సీఎం పదవి పోతుందా ?



ఒక కీలకమైన బిల్లుని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులోని ముఖ్యాంశాలు చూస్తే చాలానే ఉన్నాయి. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉండే సందర్భంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తమ పదవిని కోల్పోయేలా ఈ బిల్లుని రూపొంచారు ఈ బిల్లుని అనేకమైన నిబంధనలతో రూపొందించారు. అయితే కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టడంతోనే మొత్తంగా విపక్షాలు వ్యతిరేకించాయి.

**ఇంతకీ ఏముంది ఆ బిల్లులో :** ఇది ఒక ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని ఇబ్బంది పెట్టే బిల్లు అని విపక్షాలు అంటున్నాయి. ఈ బిల్లు కనుక చట్టం అయితే కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి ఆ మీదట అరెస్టయి నెల రోజులు కస్టడీలో ఉంటే చాలు 31వ రోజున వారు మాజీ అయినట్లే. వారి సమ్మతి లేకపోయినా వారి పదవి ఊడినట్లే. అలా ఆటోమేటిక్ గా పదవి పోయేలా కీలకమైన నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. ఇక కొంతమంది అయితే తాము పదవులకు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం దానికదే వర్తిస్తుంది. దాంతో పదవిని వెంటనే కోల్పోతారు. అందుకే దీనిని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

**ద్వజమెత్తిన ప్రియాంకా గాంధీ :** ఇక ఈ బిల్లు కనుక అమలులోకి వస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తన దర్యాప్తు సంస్థలతో అక్రమ అరెస్టులు చేయించి వారిని జైలు పాలు చేస్తే చాలు 31న రోజున పదవి కోల్పోతారు అని విమర్శించారు. ఈ విధంగా విపక్షాల ముఖ్యమంత్రులు మంత్రులను తొలగించే విధంగా ఈ బిల్లు ఉందని ఆమె ఫైర్ అయ్యారు. ఇది ప్రజాస్వామిక మూలాలను దెబ్బ తీసేదిగా ఆమె అభివర్ణించారు.

**విపక్షం మూకుమ్మడిగా :** ఈ బిల్లుని అసలు ప్రవేశపెట్టే ఆలోచననే ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు కనుక చట్టం అయితే మాత్రం కార్యనిర్వాహక సంస్థలే జడ్జీ స్థానంలోకి వస్తాయని వారే శిక్ష అమలు చేసే వారుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక వారికి అపరిమిత అధికారాలు లభిస్తాయని అదే విధంగా విపక్షంలో ఉండే ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయవచ్చునని ఆయన విమర్శించారు.

**బాబు రేవంత్ లకు ముప్పేనా :** ఏపీలో చంద్రబాబు 2023లో అరెస్టు అయ్యారు. ఆయన ఏకంగా 53 రోజుల పాటు జైలులో ఉన్నారు. మరి ఈ బిల్లు ప్రకారం చూస్తే 30 రోజులు జైలులో ఉంటే చాలు ఇక వారి పదవి ఊడినట్లే. ఆ విధంగా చంద్రబాబుకు కూడా ఈ బిల్లు వల్ల ఇబ్బందే అంటున్నారు. అంతే కాదు తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి కూడా గతంలో అరెస్టు అయి చాలా కాలం జైలులో ఉన్నారు. అది కూడా 30 రోజుల పై మాటే. మరి ఆయన సంగతి కూడా ఇంతేనా అని చర్చించుకుంటున్నారు.

**జగన్ సైతం అదే విధంగా :** ఇక వైసీపీ అధినేత జగన్ గతంలో పదహారు నెలలు ఏకంగా జైలులో ఉన్నారు. ఇక ఆయన మీద కొత్తగా కేసులు పెట్టడానికి కూటమి ప్రభుత్వం చూస్తోంది. ఈ నేపథ్యంలో ముప్పయి రోజులు జైలులో ఉంటే చాలు పదవీ భ్రష్టత్వం అంటే ఇక జగన్ సీఎం అయ్యే చాన్స్ ఉందా లేదా అన్నది మరో చర్చగా ఉంది. మొత్తం మీద చూస్తే ఈ బిల్లు విపక్షాల మీద ప్రయోగించిన అస్త్రంగా కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు తీఎవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**బీజేపీ కూడా కార్నర్ :** ఈ రోజు బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. రేపటి రోజున విపక్షంలోకి వస్తే అపుడు ఇదే బిల్లు ఆ పార్టీకి కూడా ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. మరి బీజేపీ ఏమి ఆశించి ఈ బిల్లుని తెచ్చిందో తెలియదు కానీ అన్ని పార్టీలు విపక్షంలో వ్యతిరేకిస్తున్నాయి. అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో సైతం దీని మీద చర్చ సాగుతోంది. ఒక వ్యక్తి మీద కేసు నమోదు అయినపుడు కానీ అతను జైలులో ఉన్నపుడు కానీ నిందితుడు మాత్రమే అవుతారు అన్నది నిపుణులు చెప్పే మాట. నేరం రుజువు అయితే అపుడు అతను నేరస్థుడు అవుతారు. అలా కాకుండా ముందే పదవికి ఎసరు వస్తుందని కలవరపడుతున్నారు. మరి బీజేపీ వ్యూహం ఏమిటి అన్నది అయితే అర్థం కావడం లేదనే అంటున్నారు.

చురకలు

## సంపాదకీయం

# బీహార్ లో బీజేపీ ఓడితే మోడీ సర్కార్ కూలుతుందా ?

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికి మూడు దఫాలుగా అధికారంలో ఉంటూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో మాత్రం సొంతంగా మెజారిటీ అయితే రాలేదు. బీజపీకి 240 ఎంపీ సీట్లు మాత్రమే వచ్చాయి. దాంతో ఏపీ నుంచి తెలుగుదేశం బీహార్ లో ఉన్న జేడీయూ మద్దతు అనే రెండు ఊతకర్రలతో ముందుకు సాగుతోంది. ఇక బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భవిష్యత్తు బీహార్ ఎన్నికల ఫలితాల మీద ఉందా అన్న చర్చ సాగుతోంది.

**గ్రాఫ్ తగ్గుతున్న వేళ :**ఇక చూస్తే బీజేపీకి గ్రాఫ్ మెల్లగా తగ్గుతోంది అని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ ఆపరేషన్ సింధూర్ విషయంలో వ్యవహరించిన తీరు ట్రంప్ పదే పదే భారత్ ని తానే యుద్ధం ఆపించాను అని చెప్పడం దానికి ధీటుగా బదులు ఇవ్వలేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మీద జనంలో అయితే సందేహాలు అలాగే ఉన్నాయి. ఒక ఈ మధ్యలో ఓట్ల చోరీ అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అతి పెద్ద ప్రచారం స్టార్ట్ చేశారు. ఆయన జనంలోకి వెళ్ళి ఈసీ మీద బీజేపీ మీద బలమైన ఆరోపణలు చేస్తున్నారు. అవి బాగానే చర్చకు వస్తున్నాయి. ఇక బీహార్ లో చూస్తే రాహుల్ ఓటు అధికార్ యాత్ర పేరుతో చేస్తున్న పర్యటనలకు మంచి స్పందన లభిస్తోంది అని అంటున్నారు.


**బీహార్ లో ఎదురు గాలి వీస్తే :** ఈ నేపథ్యంలో బీహార్ లో కాంగ్రెస్ నాయకులు జనంలోకి వెళ్ళి చాలానే ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భవితవ్యం బీహార్ ఓటర్లు ఇచ్చే తీర్పు మీదనే ఉంది అని వారు అంటున్నారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు అల్కా లాంబా అయితే కాస్తా ముందుకు వెళ్ళి బీహార్ నుంచి బీజేపీని తరిమి కొట్టండి దేశంలోనే ఆ పార్టీ గద్దె దిగుతుంది అని ప్రచారం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి విచ్చిన్నం అవుతుందని ఆ విధంగా మోడీ గద్దె దిగుతారు అని కూడా ఆమె గంభీరమైన ప్రకటనలు చేస్తున్నారు.

**బాబు నితీష్ ఇద్దరూ :** అదెలా సాధ్యమో ఆమె చెబుతున్నారు. బీహార్ లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కూలితే జేడీయూ నేత నితీష్ కుమార్ కూడా ఎన్డీయే నుంచి బయటకు వస్తారని ఆమె జోస్యం చెబుతున్నారు. అంతే కాదు ఏపీ నుంచి చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ కూడా ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తుందని ఆమె గట్టిగానే చెబుతున్నారు. ఈ రెండు పార్టీల మద్దతు పోతే కనుక ఎన్డీయే సర్కార్ కేంద్రంలో కూలుతుందని ఆ విధంగా ప్రజలకు బీజేపీ ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

**ఇది సాధ్యమేనా :** ఏపీ నుంచి టీడీపీ బీహార్ నుంచి జేడీయూ ఎన్డీయే ప్రభుత్వం తో తెగదెంపులు చేసుకుంటారా అన్నది కూడా చర్చకు వస్తోంది. అసలు ఇది జరిగే పనేనా అని కూడా అంటున్నారు. అయితే రాజకీయాల్లో ఎపుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరని అంటున్నారు ఈ మధ్యనే జగన్ రాహుల్ గాంధీ బాబుల మధ్య హాట్ లైన్ నడుస్తోందని ఆరోపించారు. ఆ విషయం కూడా పెద్ద ఎత్తున జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. కానీ ఇపుడు కాంగ్రెస్ మహిళా నాయకురాలు అల్కా లాంబా దీని మీద చేస్తున్న ప్రకటనలు చెబుతున్న జోస్యాలు దేశంలో అతి పెద్ద చర్చకు ఆస్కారం ఇస్తున్నాయి. మొత్తం మీద చూస్తే బీహార్ కి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఏదో బంధం ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఇవన్నీ లెక్క తేలాలీ అంటే నవంబర్ వరకూ వేచి చూడాల్సిందే.

# అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్ - ఆగస్టు 22...షోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతి

పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణ ప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్దత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు. షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండి తనాన్ని ప్రదర్శించాడు. తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుండి షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకిత భావం, నిబద్దత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు. మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాద కుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది. నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించ డానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది. బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు. ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు. కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ద పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు. 1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని



పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నిజాం పాలనలో తొలి హిందూ పోలీస్ కమిషనర్ పింగళి - ఆగస్టు 22...పాశంవారి వెంకట రామారెడ్డి జయంతి

పింగళి వెంకట రామారెడ్డి. నేటి తరానికి చెందిన చాలా మందికి ఎక్కువగా అపరిచితమైన పేరు. భాగ్యనగరం చిత్రపటంపై చెరగని సంతకం ఆయనది. నిజాం ప్రభువుకు విశ్వాస పాత్రులై, హైదరాబాద్ నగరంపై తనదయిన ముద్ర వేసుకుని, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి ప్రజా శ్రేయస్సే ఏకైక లక్ష్యంగా, అంకిత భావంతో సేవచేసి అపారమైన ప్రేమాభి మానలను చూరగొన్న ప్రజాబంధువు ఆయన. నిజాం రాజుల ఏడు తరాల రాజ్య పాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన ప్రప్రథమ హిందువుగా చరిత్రలో మిగిలి పోయారాయన. వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 – జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి. నిజాం ప్రభువు వద్ద తమకు గల పలుకుబడి వల్ల ఎన్నో సంస్థలను స్థాపించారు. ఎన్నింటికో సాయం అందించారు. విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ నెలకొల్పారు. ఆయన1869, ఆగష్టు 22 న వనపర్తి జిల్లా కొత్త కొండ మండలం ఒక చిన్న గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొద్ది సమయం లోనే తల్లి మరణించగా, తొమ్మిది సంవత్సరాల పాటు రాయణి పేటలో అమ్మమ్మ కిష్టమ్మ చెంత పోషణలో పెరిగారు. చిన్నప్పుడు ఖాన్గీ (ప్రైవేటు) బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువు కున్నారు. తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ, మరాఠీ భాషలు నేర్చుకున్నారు. నజర్ మహమ్మద్ సహాయంతో 1886లో ముదిగ్లు ఠాణాకు అమీను (సబ్ ఇన్స్పెక్టర్) గా నియమితులైనారు. తరువాత నిజాం సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేక అధికారిగా కొంత కాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్ధత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్ నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్‌లో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు గట్టి భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి



గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయం అందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతి గృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తి లోనూ, రాజకీయ చైతన్యం నింపడం లోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్‌ను ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగు చేశారు. తొలుత నగరంలో అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్‌లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది. మాతృభాష పట్ల జరుగుతున్న నిరాదరణను చూడలేక, 26 మే 1943 బుధవారం రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో నాటి ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశం నిర్వహించిన ఫలితంగా తెలుగు భాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సంస్థకు 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని పేరు పెట్టారు. పరిషత్తు ద్వితీయ మహాసభ ఓరుగల్లులో 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో వైభవంగా జరగగా, ఉదయ రాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు కాగా, కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా, మహాసభను రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1946 మార్చి 15, 16, 17 తేదీల్లో తృతీయ మహాసభలు జరిగాయి. లోకనంది శంకరనారాయణ రావు సభలకు అధ్యక్షత వహించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సభలను ప్రారంభించారు. నారాయణ గూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి మరణించే వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో ఆయన వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధన సహాయం చేశారు. ఈ క్రమంలోనే 1933లో రెడ్డి బాలికల హాస్టల్ (నారాయణ గూడ), 1954లో రెడ్డి మహిళా కళాశాల (నారాయణగూడ) లను ప్రారంభించారు. పింగళి సేవలకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో "రాజా బహద్దూర్" అనే గౌరవం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో ఆయనకు "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" గౌరవం ప్రదానం చేశారు. వెంకట రామారెడ్డి కాంస్య విగ్రహం హైదరాబాదులో నారాయణగూడ చౌరస్తాలో ప్రతిష్ఠించారు. వెంకట రామారెడ్డి పేరుతో హైదరాబాద్‌లో ఒక మహిళా కళాశాల స్థాపితమైంది. ఆయన పేరు మీద ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తున్నారు. పధ్నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి, గ్రామీణ విద్యార్థుల చదువు కోసం రెడ్డి హాస్టల్ స్థాపించి, ఎందరో తెలుగువారు వెలుగులోకి రావడానికి కారకుడైన మహానుభావుడు కొత్వాల్ వెంకటరామారెడ్డి జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమ పదించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని దోమలగుడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# బ్రిటీషర్లను గడగడ లాడించిన తెలుగు బిడ్డ అల్లూరి - ఆగస్టు 22... అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో తిరుగుబాటుకు శ్రీకారం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మై, చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. 1922 ఆగష్టు 22న మన్యంలో తిరుగు బాటు ప్రారంభం అయింది. రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై 300 మంది విప్లవ వీరులతో రాజు దాడిచేసి, రికార్డులను చింపివేసి, తుపాకులు, మందుగుండు సామాగ్రిని తీసుకు వెళ్ళారు. మొత్తం 11 తుపాకులు, 5 కత్తులు, 1390 తుపాకీ గుళ్ళు, 14 బాయొనెట్లు తీసుకువెళ్ళారు. ఏమేం తీసుకు వెళ్ళారో రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేసాడు. అదే ఉత్సాహంతో మరుసటి రోజే శరభన్నపాలెం వెళ్ళి, భోజనాలు చేసి ఆ రాత్రే ఆగష్టు 23న – కృష్ణదేవు పేట పోలీసు స్టేషనును ముట్టడించి, ఆయుధాలను తీసుకు వెళ్ళారు. ముందుగా పోలీసులను భయపెట్టి బయటకు పంపేశారు. 7 తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రం లభించాయి. ఆగష్టు 24న – వరుసగా మూడవ రోజు – రాజవొమ్మంగి పోలీసు స్టేషనుపై దాడి చేసారు. అయితే ఈసారి పోలీసుల నుండి కొద్దిపాటి ప్రతిఘటన ఎదురైంది. అక్కడ ఆయుధాలు దోచుకోవడమే కాక, అక్కడ బందీగా ఉన్న వీరయ్య దొరను కూడా విడిపించారు. ఈ మూడు దాడులలోను మొత్తం 26 తుపాకులు, 2500కు పైగా మందుగుండు సామాగ్రి వీరికి వశమయ్యాయి. రామరాజు పోరాటంలో అత్యంత సాహసో పేతమైనది అడ్డతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. అక్టోబర్ 19న రంపచోడవరం స్టేషనును పట్టపగలే ముట్టడించారు. 4మాసాల విరామం తర్వాత1923 ఏప్రిల్ 17న రాజు కొద్దిమంది అనుచరులతో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. రాజు బృందం స్టేషనుకు వెళ్ళారు. విప్లవకారులు 1923 జూన్ 10న ధారకొండ, కొండకంబేరు మీదుగా మల్కనగిరి వెళ్ళి పోలీసు స్టేషను, ట్రెజరీపై దాడి చేసారు .2-9-1923న రామవరం ప్రాంతానికి కమాండర్‌గా ఉన్న అండర్‌వుడ్ సైనికులకు, మన్యం వీరులకు భీకరమైన పోరాటం జరిగింది. సెప్టెంబర్ లో రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికి పోయాడు. సెప్టెంబరు 22న విప్లవ కారులు పాడేరు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అక్టోబరు 26న గూడెం సైనిక స్థావరంపై దాడి చేశారు. మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధలనుండి విముక్తి



ప్రసాదించడానికి తాను లొంగి పోవాలని నిశ్చయించు కున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టి ఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టి ఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయ జాలనని మునసబు తిరస్కరించాడు. తరువాత,1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపం నుండి, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పదేళ్లలో 18 మంది

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే బదిలీపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కె.వినోద్‌రెడ్డి బదిలీపై దేవాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న రాధాబాయి ఈ నెల 13న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

**మొదటి నుంచి ఇంతే..**

మొదటిసారిగా 1956లో ఆలయానికి కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 80 మంది ఈవోలుగా బాధ్యతలు నిర్వహించారు. కొందరు రెండు, మూడు దఫాలుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ వారు సైతం ఏడాదిలోపే బదిలీ అయ్యారు. 1956 నుంచి 1965 వరకు రూప్‌లాల్ ముంతాజియం ఒక్కరే పదేళ్లపాటు ఈవోగా బాధ్యతలు నిర్వహించారు.. మిగిలిన వారిలో ఏ ఒక్కరూ చాలాకాలం పని చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పదేళ్లలో 18 మంది ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో రాజేశ్వర్ 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. అనంతరం 2019 వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. కృష్ణప్రసాద్ 2020 నుంచి 2022 వరకు తిరిగి 2022 నుంచి 2024 బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత రామకృష్ణారావు కేవలం 36 రోజులు మాత్రమే ఈవోగా ఉన్నారు. ఆ తరువాత వినోద్ కుమార్ నెలపాటు విధులు నిర్వహించిన అనంతరం ఆగస్టు 2024 నుంచి 13 జూన్ 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. 17 జనవరి 2022 నుంచి 9 ఆగస్టు 2022 వరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించి ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

**పట్టు సాధించేలోపే..**

ఆలయ కార్యనిర్వహణాధికారుల బదిలీల వెనుక అనేక కారణాలున్నా



యని ప్రచారం జరుగుతోంది. పైస్థాయి అధికారుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లు, ఆలయంలో ప్రొటోకాల్ వివాదాలు, విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవకతవకలు వంటివి కారణంగా భావిస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆలయంలో అనేక సంస్కరణలు చేపట్టారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉన్న కొద్దికాలంలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేసి భక్తుల మన్ననలు పొందారు. సంస్కరణలు గిట్టని కొందరు ఆలయ ఉద్యోగులు, నాయకులు ఇక్కడి నుంచి సాగనంపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవోలుగా వచ్చిన వారు ఆలయంలోని వివిధ విభాగాలపై అవగాహనకు వచ్చి పట్టు సాధించేలోపే బదిలీ కావడంతో భక్తులకు మెరుగైన సేవలు అందలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్ పట్టు సాధించి సంస్కరణలు చేస్తున్న క్రమంలో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో వేలల్లో వచ్చే భక్తులకు ఏ మేరకు సేవలు అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఆలయానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలనే డిమాండ్ భక్తుల్లో, స్థానిక నాయకుల్లో వినిపిస్తోంది.

# చెరువులను చెరబట్టారు

పెద్దపల్లి: ఇటుక బట్టీ నిర్వాహకులు చెరువులను చెర బడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. చెరువుల్లో పూడిక తీస్తున్నారని నీటిపారుదలశాఖ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గనులశాఖ, గ్రామానికి చందాలిస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీలు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు రూపం కోల్పోతున్నాయి. యంత్రాలతో తోడటమే కాకుండా, జలాశయాల్లోని మట్టిని పూర్తిగా తరలించేందుకు చెరువుల మధ్యలో రోడ్లు నిర్మిస్తున్నారు. ఎక్కడ, ఎంత లోతులో తీయాలనే అంశాలేవి బట్టీ నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

**అంతటా అదే దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమకు సంబంధించి పెద్దపల్లి ప్రాంతంలో నాణ్యమైన చెరువు మట్టితోపాటు ఎన్టీపీసీ బూడిద అందుబాటులో ఉండటంతో.. ఈ ప్రాంతంలో 200కుపైగా ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. వీటికి అవసరమైన మట్టిని సమీప చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తరలింపు ప్రక్రియ తరుచూ వివాదాస్పదమవుతోంది. చెరువులో ఒక మీటరు కంటే ఎక్కువ లోతు మట్టి తీయొద్దనే నిబంధన ఎక్కడ అమలు కావడంలేదు. భారీ యంత్రాలతో తరలించడంతో కనీసం పది నుంచి 20 అడుగుల గుంతలు ఏర్పడుతున్నాయి.

**రెట్టింపు పరిమాణంలో తరలింపు**

తాజాగా పెద్దపల్లి మండలం బొంపల్లిలోని రాచర్లకుంటలో ఏకంగా రోడ్డును నిర్మించి, మట్టిని తరలిస్తున్నారు. వర్షం నీరు చెరువులోకి రాకుండా చుట్టూ కందకాలు తవ్వి, నీటిని బయటకు పంపించేందుకు కచ్చా కాలువలు తవ్వారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో చెరువుల నుంచి అనుమతించిన దాటికంటే రెట్టింపు పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో చెరువులతోపాటు మానేరు జలాశయం నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. గోదావరి ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి మట్టి తరలించడం వివాదానికి దారితీసింది.

**భారీగా వసూళ్లు**

బట్టీ నిర్వాహకుల బలహీనతను ఆసరా చేసుకొని మట్టి ధరను రెట్టింపు చేయడంపై ఉన్న దృష్టి చెరువు పరిరక్షణపై లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం మట్టి లేదా ఇసుకకు క్యూబిక్ మీటర్ చొప్పున రేటు నిర్ణయించి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో టిప్పర్(సుమారు 40 మెట్రిక్ టన్నులు)కు రూ.వెయ్యి వరకు చెల్లిస్తే సరిపోతుంది. అయితే పెద్దపల్లిలో మాత్రం దాదాపు రూ.2700 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు బావుల మాదిరిగా మారిపోయి, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. చెరువుల్లో మోటార్లు పెట్టుకొని రైతులు సాగు చేసే దుస్థితి వచ్చినా ఆశ్చర్యం కలగకపోవచ్చు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు



సిరిసిల్ల: ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట జ్యోతినగర్‌లోనిది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలుగా మారుతుండగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బురద కారణంగా అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమై ఏళ్ల గడిచినా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది సిరిసిల్ల నుంచి పెద్దబోనాల వెళ్లే రోడ్డు. ఈ దారిగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారుతుంది. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.సిరిసిల్ల మున్సిపాల్టీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన, లింకు, విలీన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడమే కాకుండా, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. విలీన గ్రామాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చంద్రంపేట, జ్యోతినగర్, ఇప్పలపల్లి, పెద్దూరు తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. బురద రోడ్ల మీదనే ప్రయాణాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బురదతో అవస్థలు**

చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురద రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ చంద్రంపేట

సీసీ నిర్మాణం చేపట్టాలిపట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లపై వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. బురద రోడ్లపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజు, 12వ వార్డు

సిరిసిల్ల పట్టణ స్వరూపం

| | |
|---|---|
| వార్డులు | : 39 |
| పట్టణ జనాభా | : 1,16,938 |
| పట్టణంలో రోడ్లు | : 276.91 కి.మీ |
| బీటీ రోడ్లు | : 40.33 కి.మీ |
| సీసీ రోడ్లు | : 137.44 కి.మీ |

# కిలో ధర రూ.కోటి



హైదరాబాద్: ఒక్కు గ్రాము రూ.10 వేలు.. కిలో ధర రూ.కోటి. ఇదేదో బంగారం అంతకంటే ఖరీదైన వస్తువు విలువ కాదు.. విదేశాల నుంచి తెస్తున్న కొత్త రకం గంజాయి ధర. రాజధానిలో ఇప్పటివరకూ గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతుండగా కొత్తగా హైడ్రోపోనిక్ గంజాయి దర్యాప్తు సంస్థలకు చిక్కుతోంది. మత్తు పదార్థాలకు పెరుగుతున్న డిమాండ్‌తో అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఈ మత్తు పదార్థాన్ని గుట్టుగా నగరానికి చేరవేస్తున్నాయి. ఇప్పటికే ఆంధ్రా-ఒడిశా సరిహద్దులు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి గంజాయి.. గోవా, బెంగళూరు, ముంబయి నుంచి డ్రగ్స్ రవాణా జరుగుతుండగా ఏకంగా విదేశాల నుంచి ప్రత్యేక గంజాయి రావడం ఆందోళన కలిగిస్తోంది. నెలరోజుల వ్యవధిలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.53 కోట్ల గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ), డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలను దాటుకుని వినియోగదారులకు చేరుతున్న సరకు అంతకు రెట్టింపు ఉంటుందని అధికారుల అంచనా.

**హైడ్రోపోనిక్ గంజాయి అంటే..?**

సాధారణంగా గంజాయి మొక్కల్ని మారుమూల ప్రాంతాల్లో నేలపై సాగు చేస్తుంటారు. పంట చేతికి రావడానికి 4నెలలు అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. హైడ్రోపోనిక్ గంజాయిని మట్టికి బదులు ప్రయోగశాలల్లో పెంచుతారు. రహస్య ప్రాంతాల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఉష్ణోగ్రతను నియంత్రించే విధానంలో సూక్ష్మ పోషకాలున్న ద్రవ పదార్థాలను మొక్కలకు అందిస్తుంటారు. దీనివల్ల మొక్క వేగంగా పెరిగి పంట చేతికొస్తుంది. ప్రత్యేక పద్ధతుల్లో పోషకాలు అందించడం ద్వారా ఇందులో మత్తు శాతం ఎక్కువగా ఉంటుంది. సాధారణ గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో 30శాతం మత్తు అధికంగా, కొకైన్‌తో సమానంగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

**విదేశాల నుంచి దిగుమతి**


ఈ కొత్త రకం మత్తు పదార్థం విదేశాల నుంచి.. ముఖ్యంగా థాయ్‌లాండ్ నుంచి వస్తోంది. ఇటీవల రెండుసార్లు పట్టుబడ్డ సరకు అక్కడి నుంచే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని దేశాల్లో నిషేధం లేకపోవడంతో సాగు చేయిస్తున్న స్మగ్లింగ్ ముఠాలు దాన్ని ముఖ్యంగా మహిళలతో భారత్‌కు రవాణా చేయిస్తున్నాయి.

ఇటీవల పట్టుబడిన ఉదంతాలు..

30 జులై 2025: శంషాబాద్ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ మహిళను అదుపులోకి తీసుకుని బ్యాగుల్ని తనిఖీ చేయగా 40కిలోల సరకు పట్టుబడింది.

12 ఆగస్టు 2025: విమానాశ్రయంలో ప్రయాణికురాలి లగేజీని తనిఖీ చేయగా రూ.13 కోట్ల 13 కిలోల సరకు లభించింది. దీన్ని బ్యాంకాక్‌నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించారు.

# నిరభ్యంతరం.. ఇక సులభతరం



హైదరాబాద్: ప్రొవిజనల్ ఎన్‌వోసీ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీని అగ్నిమాపకశాఖ సులభతరం చేసింది. వేర్వేరు దశల్లో ప్రాధాన్యత ప్రక్రియలో మార్పులు చేసింది. కొందరి అధికారులపైనే భారం వేయకుండా అనుమతుల జారీ ప్రక్రియలో పని విభజనను అవలంబిస్తుండటంతో తక్కువ సమయంలోనే సర్టిఫికెట్లు చేతికందుతున్నాయి.

**పకడ్బందీగా నిబంధనల అమలు**

నిర్మాణాలు ప్రారంభించే ముందు ప్రివిలేజ్ ఎన్‌వోసీ, నిర్మించిన తర్వాత డిజైన్ ఆధారంగా రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారా..? అని పరిశీలించిన అనంతరం అగ్నిమాపకశాఖ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేస్తోంది. ఈ క్రమంలో దరఖాస్తుల్లో వివరాల నమోదు సమయంలో ఏఏ ధ్రువపత్రాలు సమర్పించాలో, ఎన్‌బీసీ మార్గదర్శకాలు ఏమున్నాయో వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తున్నారు. గతంలో సమన్వయం లోపంతో ప్రక్రియ ఆలస్యమయ్యేది. ఉదాహరణకు..ఓ ఖాళీ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించాలనుకుంటే.. ముందుగా సైట్‌ప్లాన్, బేస్‌మెంట్ ఫ్లోర్‌ప్లాన్, గ్రౌండ్‌ఫ్లోర్ ప్లాన్, టెర్రస్‌ప్లాన్, సెక్షన్ ప్లాన్, ఎలివేషన్ ప్లాన్ తదితర వివరాలు, చిత్రాలను అప్‌లోడ్ చేసేలా నిబంధనలు మార్చారు. హైరైజ్ బిల్డింగులకు అయితే అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా మార్గం ఏర్పాటు తదితర నిబంధనలు పాటించాలి.

**నాలుగు దశలకు బదులుగా..**

గతంలో ఎన్‌వోసీ జారీ ప్రక్రియ ఆయా ప్రాంతాలకు కేంద్రీకృతంగానే జరిగేది.. కొందరి అధికారులపైనే భారం పడేది. ప్రస్తుతం అగ్నిజోన్లలోని అధికారులు ఎన్‌వోసీలు జారీ చేసేలా పని విభజన చేశారు. ఉదాహరణకు ఐటీ ప్రాంతంలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో నిర్దేశిత సమయంలో అధికారి పని పూర్తి చేయకపోతే.. మరో అధికారికి బదిలీ చేస్తారు. గతంలో నాలుగు దశల్లో ప్రాసెస్ చేసేవారు.. ఇప్పుడా విధానానికి స్వస్తి పలకడంతో సమయం ఆదా అవుతోంది.

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్ల గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది.సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పరాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం

సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎదురవుతున్న సమస్యలపై మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

చురకలు



## ఎవరో వస్తారని.. ఎదురుచూడక..!

చింతకాని ఎవరో వస్తారని.. సమస్య పరిష్కరిస్తారని.. ఎదురు చూడకుండా.. వారిద్దరూ తమకు చేతనయినంతవరకూ కృషిచేసి శభాష్ అనిపిస్తున్నారు చింతకాని మండలానికి చెందిన కిలారు నరసింహారావు, కోపూరి నవీన్.. తమ గ్రామాల వద్ద రెండు ప్రాంతాల్లో నెలకొన్న రహదారి సమస్యను సామాజిక స్పృహతో, ఎలాంటి లాభాపేక్ష లేకుండా పరిష్కరించేందుకు తమ వంతుగా వారు చేసిన పని స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. **వివరాలను పరిశీలిస్తే..**

ఖమ్మం- బోనకల్లు ప్రధాన రహదారిలో నాగులవంచ సమీపంలో నూతనంగా నిర్మించిన ర.భ.శాఖ వంతెన అనుసంధాన రహదారి ఇటీవలి వర్షాలకు పూర్తిగా గోతులమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. సమయంలో ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తున్న ఓ కారు ఆ ప్రాంతంలోని గోతులను గమనించకుండా వేగంగా ముందుకు



వెళ్లటంతో గుంతలోకి దిగి కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదాన్ని చూసిన నాగులవంచకు చెందిన కిలారు నరసింహారావు అనే రైతు తన ఎద్దుల బండితో సమీపంలోని కంకర, మొరాన్ని తీసుకొచ్చి ఆ గోతులను తానే స్వయంగా పూడ్చివేశారు. ఇప్పటికైనా ర.భ.శాఖ అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గోతులను పూడ్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

నాగులవంచ- పాతర్లపాడు మధ్య ఉన్న బండిరేవు వాగు పొంగటంతో మూడు రోజుల పాటు ఆ మార్గంలో రవాణాను అధికారులు నిలిపివేశారు. వరద తీవ్రతకు వాగు వద్ద మోరీ కుంగి పోయి గోతులు పడి ప్రమాదకరంగా ఉంది. కనీసం ఆ మార్గంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పరిస్థితిని గమనించిన రైల్వే కాలనీకి చెందిన కోపూరి నవీన్ అనే యువకుడు తన జేసీబీ, ట్రాక్టర్ సాయంతో ఆదివారం గుంతలను పూడ్చి వేయటంతో వాహనదారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## 'శుద్ధి' అబద్ధం

హైదరాబాద్ : పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి కీలకం. నగరంలో చాలా మంది శుద్ధి జలాల పేరుతో ఆర్వో ప్లాంట్లను నుంచి కొనుగోలు చేసి తాగుతున్నారు. నిబంధనలు పాటించకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న శుద్ధి జల కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంత సురక్షితం అనేది చర్చనీయాంశగా మారింది. పర్యవేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి నీటిని డబ్బాల్లో నింపేసి అమ్మేస్తున్నారు. ఆ జలాలను లక్షలమంది వినియోగిస్తున్నారు. చాలా కేంద్రాల్లో నిబంధనలు పాటించడం లేదు. బోరు నీటిని ఆర్వో ప్లాంట్లలో నుంచి క్యాన్లలో నింపేసి అమ్మేస్తున్నారు. నగరంలో ఇలాంటివి వేలల్లో ఉన్నాయి. మురుగు కాలువల పక్కనే బోర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. 20 లీటర్ల డబ్బా రూ.10 నుంచి రూ.20 దాకా విక్రయిస్తున్నారు. .

**శుభ్రత, నాణ్యత, ప్రమాణాలేవీ?**

ప్రతి డబ్బా(క్యాన్)పై లేబుల్ విధిగా ఉండాలి. నీటిశుద్ధి ప్రమాణాలు, సంస్థ వివరాలు కచ్చితంగా కనిపించాలి. ఇవి ఏ క్యాన్‌పైనా ఉండవు. ప్లాస్టిక్ క్యాన్లను కూడా ప్రమాణాల మేరకు ఉన్నవాటినే వినియోగించాలి. సరఫరా చేసే వాటిలో తాజా నీరే ఉండాలి. ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదు. దాన్ని ప్రత్యేక యంత్రాల సాయంతో అల్ట్రావైలెట్ కిరణాలతో పరీక్షించి బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసిన తర్వాతే నీటితో నింపాలి. విధిగా సీలు ఉండాలి. సహజంగా నీటిలో శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడే ఖనిజాలు ఉంటాయి. ఆర్వో ప్లాంట్లలో శుద్ధి ప్రక్రియలో పూర్తిగా ఖనిజాలు తొలగిపోతాయి.

**ఈ నిబంధనలుండాల్సిందే**

బోరు నీరు కోసం భూగర్భ జలవనరుల శాఖ అనుమతి, చిన్నతరహా పరిశ్రమ కోసం పరిశ్రమలశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి.

నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాట్లు ఉండాలి.

ప్రతి ప్లాంట్‌లో మైక్రోబయాలజిస్ట్, కెమిస్ట్ ఉండాలి.

పనిచేసే సిబ్బంది కూడా ఆరోగ్యవంతులై ఉండాలి. నిర్దేశించిన పరిమాణంలో ఖనిజాలను కలిపేందుకు ప్రత్యేక ఏర్పాటు ఉండాలి.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ఈపీఆర్

హైదరాబాద్ : ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత, భూమిలో కరిగే ప్లాస్టిక్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్స్ రెస్పాన్సిబులిటీ(ఈపీఆర్) లో నమోదు తప్పనిసరి చేసింది. నగరంలోని అనేక సంస్థలు మార్గదర్శకాలకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నాయి. జీడిమెట్ల, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక సంస్థలకు రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్దేశించినట్టు పీసీబీ అధికారులు వెల్లడించారు.

**ఈపీఆర్ అంటే..?**

ఇది ఒక పర్యావరణ విధానం, దీని ప్రకారం తయారీదారులు, దిగుమతి దారులు, బ్రాండ్ యజమానులు తమ ఉత్పత్తుల వ్యర్థ నిర్వహణకు పూర్తి బాధ్యత వహించాలి. పునర్వినియోగం, రీసైక్లింగ్, సురక్షితంగా పారేయడాన్ని పర్యవేక్షించాలి. ఇవి సాధారణంగా ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, బ్యాటరీ ఉత్పత్తులకు వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక కంపెనీ తయారు చేసిన ప్లాస్టిక్ బాటిల్‌ను రీసైక్లింగ్ చేయడం లేదా సరిగా పారేయడంపై పూర్తి బాధ్యత వారిపైనే ఉంటుంది.

**ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్స్..:** జీడిమెట్ల, కాచిగూడ, మెహిదీపట్నం, మల్లాపూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి రంగారెడ్డి జిల్లా కొత్తూరు, అబ్దుల్లాపూర్‌మెట్, ఇప్పలపల్లె, షాద్‌నగర్, బూర్గుల, కీసర, చౌపల్లె, చేగూరులో ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్ యూనిట్లు ఉన్నాయి.

భూమిలో కరిగే ప్లాస్టిక్ (కంపోస్టబుల్) ఉత్పత్తుల యూనిట్లు..: చర్లపల్లి, జీడిమెట్ల, తుక్కుగూడ, బాచుపల్లి, కూకట్‌పల్లి, బషీరాబాద్, నాచారం, మహేంద్రహిల్స్, అమీన్‌పూర్, హయత్‌నగర్, బాలాపూర్.

**పౌరుల భాగస్వామ్యం అవసరం..**

ఈపీఆర్ లక్ష్యాలు చేరుకోవడంలో పౌరుల భాగస్వామ్యం అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. తమ ఇళ్లలో లేదా కార్యాలయాల్లో పునర్వినియోగించే వ్యర్థాలను గుర్తించి వేరు చేసి రీసైక్లింగ్ యూనిట్లకు తరలించాలి. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవచ్చు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ)కు బదులుగా బయోడీగ్రేడబుల్ లేదా పునర్వినియోగ సామగ్రిని ఎంచుకోవాలి.

# ఆందోళన బాటలో 104 సిబ్బంది




ఖమ్మం : ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడంతో 104 సిబ్బంది పరిస్థితి అయోమయంగా మారింది. కాంట్రాక్టు ఉద్యోగాల కొనసాగింపు ఉత్తర్వులు, వేతనాలు విడుదలకు నోచుకోకపోవటంతో ఆందోళన బాట పడుతున్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ప్రజారోగ్య శాఖలో కీలక సేవలందిస్తున్న సిబ్బంది బలహీనపడితే ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో వైద్య సేవలకు ఇబ్బంది తప్పదు. 104 సిబ్బంది జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, సెక్యూరిటీ, డ్రైవరు, ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా సేవలందిస్తున్నారు. వీరందరూ సమస్యల పరిష్కార విషయంలో ఒత్తిడిలో ఉన్నారు.

ఉమ్మడి ఏపీలో 2008లో నాటి ప్రభుత్వం 104 సంచార వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒప్పంద పద్ధతిలో 1091మంది సర్కారు దవాఖానాల్లో పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రవేశపెట్టిన తర్వాత 2022, జూన్ నుంచి వాహన సేవలు నిలిపివేసింది. అప్పట్లోనే వాహనాలను వేలం వేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జనరల్ ఆస్పత్రులు, తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, ఎన్‌సీడీ క్లినిక్‌లలో సిబ్బందిని సర్దుబాటు చేశారు.

**ముందుకు సాగలే..** ఏటా సిబ్బంది కాంట్రాక్ట్ ఉత్తర్వులు పొడిగిస్తారు. ఈ ఏడాది ఇంకా ఉత్తర్వులు వెలువడలేదు. నాలుగు నెలల నుంచి వేతనాలు నిలిచిపోయాయి. సెక్యూరిటీ, డ్రైవర్లు, ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. భరోసా లభించినా ఆచరణలో ఈ ప్రక్రియ కూడా ముందుకు సాగలేదు.

**రాత పరీక్షలు, కోర్టు కేసులు**

ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024, సెప్టెంబరు, నవంబర్‌లో వేర్వేరుగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా ఉద్యోగాల్లో 104 సిబ్బందికి వెయిటేజ్ కల్పిస్తూ రాత పరీక్షలు నిర్వహించారు. కానీ తదుపరి ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. ల్యాబ్ టెక్నీషియన్ల ఫలితాలు విడుదల చేసినా నియామకాల్లేవు. ఈ ప్రక్రియ పూర్తయితే వెయిటేజ్ కారణంగా దాదాపు 60శాతం మంది ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. ఫార్మసిస్టుల పరీక్షలకు సంబంధించిన కేసు న్యాయస్థానంలో నడుస్తుంది.

**వేతనాలు చెల్లిస్తాం..: డా. చందూనాయక్, ప్రోగ్రాం అధికారి**

104 సిబ్బంది సమస్యలు, వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్‌తో చర్చించి వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాలో పనిచేస్తున్నవారు..

ల్యాబ్ టెక్నీషియన్లు-24

ఫార్మసిస్టులు-17 ః డ్రైవర్లు-13

డేటా ఎంట్రీ ఆపరేటర్లు-20

సెక్యూరిటీ గార్డులు-07

ఏఎన్ఎం-02.

# కార్యాలయం ఉంది.. కార్యవర్గమేది!




ఖమ్మం : పాఠశాల క్రీడా విభాగం విద్యాశాఖ పట్టింపునకు నోచుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏటా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యాశాఖాధికారి అధ్యక్షతన పాఠశాల క్రీడల నిర్వాహక కమిటీ ఏర్పాటు కావాలి. ఓ సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుణ్ని కార్యదర్శిగా, ఇద్దరు పీఈటీలను సహాయ కార్యదర్శులుగా, మరికొందరు సభ్యులుగా జిల్లా స్కూల్ గేమ్స్ నిర్వాహక కమిటీ ఏర్పాటు చేయాలి. ఆగస్టు పూర్తి కావస్తున్నా జిల్లాలో ఇంతవరకు ఈ కమిటీ ఊసేలేదు. రెండేళ్ల క్రితం నాటి కలెక్టర్, విద్యాశాఖాధికారి ఖమ్మం నగరంలో మూతబడిన ఓ ప్రభుత్వ పాఠశాలను పాఠశాల క్రీడా విభాగం కార్యాలయంగా మార్చారు. అనంతర కాలంలో కొందరు వ్యాయామ ఉపాధ్యాయులు ఈ భవనాన్ని తీర్చిదిద్ది కార్యాలయాన్ని సుందరంగా మార్చారు. ప్రతి విద్యా సంవత్సరం నూతనంగా కొలువుదీరే సమాఖ్య కార్యవర్గం, ఎస్‌జీఎఫ్ కార్యాలయం కేంద్రంగా ఏడాది క్రీడా ప్రణాళికను సిద్ధం చేయాలి. రాష్ట్ర స్కూల్ గేమ్స్ క్యాలెండర్ విడుదల కాకముందే జిల్లాలో చేపట్టాల్సిన క్రీడా పోటీల పనులు పూర్తి కావాలి. నిత్యం పాఠశాలలు, పరిపాలన పనుల్లో తలమునకలవుతున్న విద్యాశాఖ స్కూల్‌గేమ్స్‌ను ఓ గుదిబండలా భావిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటిదాకా స్కూల్‌గేమ్స్ కమిటీ కార్యవర్గం ఏర్పాటు చేయకపోవటంతో కార్యాలయం మూతపడింది. ఇటీవల జాతీయ స్కూల్‌గేమ్స్ సమాఖ్య అండర్-15 జాతీయ వాలీబాల్ జట్టును ఎంపిక చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఇందులో భాగంగా తొలుత జిల్లాల జట్లను ఎంపిక చేసి వారిని రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపాలి. హడావిడిగా ఓ పీఈటీకి చెప్పి జిల్లా జట్టు ఎంపికల తంతు పూర్తిచేశారు. పోటీల విషయం పాఠశాలలకు కనీస సమాచారం చేరవేయలేదని విమర్శలు వెల్లువెత్తాయి. స్కూల్‌గేమ్స్‌కు సంబంధించిన ఉత్తర్వులు వస్తే 'మీరు చూసుకోండ'ని అందుబాటులో ఉన్న పీఈటీకి కాగితం ఇచ్చేసి చేతులు దులుపుకొంటున్న తీరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతోందనే విమర్శలున్నాయి. ప్రత్యేక క్రీడా వ్యవస్థను ఏర్పాటు చేయకపోతే ప్రమాణాలు మరింత దిగజారుతాయని పూర్వ క్రీడాధికారులు అభిప్రాయపడుతున్నారు.

'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి ఫైల్‌ను కలెక్టర్‌కు నివేదించాం. తదుపరి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఒకరికి తాత్కాలిక బాధ్యతలప్పగించాం.'

నాగపద్మజ, ఇన్‌ఛార్జి డీఈవో

# కొద్ది నిర్లక్ష్యం.. కోలుకోని నష్టం..!

మిర్యాలగూడ : కొన్ని నెలల క్రితం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రాంతానికి చెందిన వ్యక్తి పురుగుమందు పిచికారీ చేసి అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఏడాది కిందట దామరచర్లకు చెందిన ఓ రైతు తన మిరప చేనుకు పురుగుమందు పిచికారీ చేసి మందు ఘాటు శరీరంలోకి వెళ్లి మృత్యువాత పడ్డాడు.

ప్రస్తుత రోజుల్లో వివిధ పంటలు సాగు చేసే రైతులు ఏ చిన్న రోగం వచ్చినా పురుగుమందులు పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. ఎంతో విషపూరితంగా ఉండే ఆ మందులతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతోపాటు... ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు క్యాన్సర్ వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు.

**ఇవి పాటిస్తే మేలు**

పురుగుమందు డబ్బాపై ఉండే లేబల్, వివరాల పత్రాలను తప్పనిసరిగా చదివి వాటిని పాటించాలి.

డబ్బాల మూతలను నోటితో అసలే తీయకూడదు.

పిచికారీ చేసే ముందు తప్పనిసరిగా చేతులకు రబ్బర్ గ్లౌజులు, ముఖానికి మాస్కులు, తలకు టోపీ పెట్టుకోవాలి.

శరీరమంతా కప్పే దుస్తులతో పాటు...కాళ్లకు బూట్లు ధరించాలి.

మందులను చేతితో కలపరాదు. **మందు డబ్బాలపై హెచ్చరికలు..** ఎరుపు రంగు: పురుగుమందు డబ్బాపై త్రిభుజాకారంలో ఉండే ఈ రంగు అత్యంత విషపూరితమైనది. ఇందులో విషప్రభావం 90శాతం ఉంటుంది. ఈ మందు పిచికారీ చేసే వారు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. పసుపు: ఇది 70 శాతం విషపూరితమై ఉంటుంది. ఈ మందును పిచికారీ చేసేటప్పుడు సైతం అన్ని రక్షణ చర్యలు పాటించాలి.

నీలం: ఈ డబ్బాలోని పురుగు మందు 50శాతం విషపూరితం. దీనికి కూడా జాగ్రత్తలు పాటిస్తేనే మంచిది.

ఆకుపచ్చ రంగు: ఈ డబ్బాలోని పురుగు మందు కొంత తక్కువ విషపూరితమై ఉంటుంది. దీనిలో 30శాతం విషప్రభావం ఉంటుంది.

**జాగ్రత్తలు తప్పనిసరి... :** డాక్టర్ కృష్ణచక్ర, క్రిటికల్ కేర్ నిపుణుడు,



మిర్యాలగూడ

రైతులు, కూలీలు పంటలకు గంటల కొద్దీ పురుగుమందులు పిచికారీ చేయొద్దు. దీంతో కళ్లు, ముక్కు, చెవులతో పాటు శరీరంపై మందు, మందు వాసన ఘాటు శరీరంలోకి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురవుతారు. విషప్రభావానికి గురైన వ్యక్తిని తక్షణమే ఆ మందు డబ్బాతో సహా ఆసుపత్రికి తరలించాలి. దీంతో మందు తీవ్రతబట్టి చికిత్స అందించవచ్చు.

**అవగాహన కల్పిస్తున్నాం : శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ**

పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో తీసుకునే జాగ్రత్తలపై తరచూ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అజాగ్రత్త, అవగాహన లోపంతో అనేక సమస్యలతోపాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన సైతం పడే ప్రమాదం ఉంది. అత్యంత విషపూరిత రసాయనాలున్న మందులకు బదులుగా తక్కువ ప్రమాదం ఉండేవి వాడాలి. ఉమ్మడి జిల్లాలో సాగు భూములు: 12.68లక్షల ఎకరాలు రైతులు: 7.5లక్షలు

## వాగుకు అడ్డుగోడ..
## గ్రామాలకు ముంపు గండం

మొయినాబాద్ ఈసీ వాగు వరద ప్రవాహానికి ఆ 'ప్రహరీ' అడ్డుగా ఉండటంతో పక్కనేఉన్న గ్రామాలను ముంచెత్తుతోంది. వాటి పరిధిలో సాగైన వరి, పూలు, కూరగాయల పంటలు మునిగిపోతున్నాయి. మొయినాబాద్, శంషాబాద్ మండలాల శివారులోని అమ్డాపూర్, కేబీదొడ్డి వద్ద ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ.. అక్రమ లేఅవుట్ వేయడంతో పాటు ఈసీవాగు వరద అందులోకి రాకుండా ఏకంగా 25ఎకరాల మేర రిటైనింగ్ వాల్(గోడ) నిర్మించింది. ఎగువనుంచి వస్తున్న వరద ఆ గోడను తాకి.. దారి మళ్లుతుండటంతో సమీపంలోని అమ్డాపూర్, ఖాశీంబౌలి, బాకారంజాగీర్, కేబీదొడ్డి, సుల్తాన్‌పల్లి, నర్కూడ, కవ్వగూడ గ్రామాలకు ముంపు ముప్పు ఏర్పడింది. రెండేళ్లుగా ఈ లేఅవుట్ పనులు సాగుతున్నా నీటిపారుదల శాఖ, పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. సమస్యను విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. అంచెమడుగుకు చెందిన వాగును కూడా పూడ్చివేశారన్నారు.



మోస్తరు వర్షానికే పొంగుతున్న మ్యాన్‌హోళ్లు

నగరంలో చాలాచోట్ల మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని కొనసాగించిన ప్రాంతాల్లో సమస్య తక్కువగా ఉన్నా మిగతాచోట్ల తీవ్రంగా ఉంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షానికే రహదారులపై వరద నిలుస్తోంది. ఈ క్రమంలోనే సమీప దుకాణదారులు, ఇళ్ల యజమానులు మ్యాన్‌హోళ్ల మూతలను తీస్తున్నారు. దీంతో అప్పటికప్పుడు వరద తగ్గినా ఘన వ్యర్థాలు మ్యాన్‌హోళ్లలో భారీగా చేరుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మ్యాన్‌హోళ్ల మూతలు తీయడం ప్రమాదకరమని హెచ్చరించినా ఫలితం లేదని, ఇకపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జలమండలి ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**నీట మునిగిన చిన్నగోల్కొండ ఓఆర్ఆర్ అండర్ పాస్**

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి అనుసంధానంగా చిన్నగోల్కొండలో ఉన్న ఓఆర్ఆర్ వెహికల్ అండర్ పాస్ నీట మునిగింది. రాకపోకలు ఆపివేశారు. అధికారుల ఉదాసీనతతో.. ఓ స్థిరాస్తివ్యాపారి వరదకాలువను పూడ్చి వేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు.

## ఖాతా నిర్వహణ..
## పథకాలకు ఆలంబన

మిర్యాలగూడ : ప్రభుత్వ అందించే అనేక పథకాలకు బ్యాంకు ఖాతాల అవసరం ఏర్పడుతోంది. అనేక మంది వివిధ బ్యాంకు ల్లో ఖాతాలు తెరుస్తున్నారు. ఏదైనా పథకం కోసం ఖాతా తెరిచిన అనేక మంది ఆ తర్వాత ఆ ఖాతా నిర్వహణను వదిలేస్తున్నారు. కొన్నేళ్ల తర్వాత మరేదైనా పథకానికి అదే ఖాతా సంఖ్య ఇవ్వడంతో అది పనిచేయక.. రావాల్సిన లబ్ధి నిలిచిపోతుంది. అప్పుడు ఉరుకులు పరుగుల మీద బ్యాంకుకు వెళ్లి అధికారులకు మొర పెట్టుకోవాల్సి వస్తోంది.

**ఆరు నెలలు ఆగితే అంతే...**

బ్యాంకు ఖాతాలను ఆరు నెలల పాటు ఎలాంటి లావాదేవీలు జరపకపోతే ఇన్ ఆపరేటివ్‌గా మారిపోతుంది. ఈ స్థితిలోకి మారడానికి కొద్దిరోజుల వరకు ఖాతాదారుడికి సంక్షిప్త సందేశాలు వస్తాయి. వీటికి స్పందించకపోతే ఖాతా పూర్తిగా నిలిచిపోతుంది. ఖాతా పని చేయకుంటే తక్షణమే సంబంధిత బ్యాంకు శాఖను సంప్రదించి..సరిపడా పత్రాలతో ఈకేవైసీ చేయించుకోవాలి. దీనికి ప్రత్యేకంగా ఒక ఫారం నింపి అధికారులకు అందిస్తే ఈకేవైసీ పూర్తి చేసి ఖాతాను పునరుద్ధరిస్తారు.

**లావాదేవీలు నిర్వహించాలి..**

బ్యాంకు ఖాతా తెరిచిన తర్వాత కనీసం నెలకోసారైనా లావాదేవీలు




నిర్వహించడం మంచిది. దీని కోసం బ్యాంకుకు వెళ్లి లైన్లలో నిలబడాల్సిన అవసరం లేదు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలతో పాటు ఏటీఎంలోనైనా బ్యాంకు ఖాతా సంఖ్యకు కొంత నగదు జమ చేస్తే సరిపోతుంది. దీని వల్ల బ్యాంకు ఖాతా ఆగిపోకుండా..ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా...**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన సుమారు 543 శాఖలు ఉన్నాయి. వీటిలో కొన్నేళ్ల క్రితం అనేక వేలాది మంది జీరో బ్యాలెన్స్‌తో పాటు వివిధ ఖాతాలను తెరిచారు. తీరా వీటిని నగదు జమ చేస్తూ నిర్వహించకపోవడంతో అనేక ఖాతాలు నిలిచిపోయాయి. దీంతో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలకు అవరోధంగా నిలుస్తున్నాయి. లబ్ధిదారుడిగా ప్రభుత్వం గుర్తించినప్పటికీ ఇన్ ఆపరేటివ్ ఖాతా సమస్యతో చివరి నిమిషంలో ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల బ్యాంకు సమయం సైతం వృథా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

**నిర్వహిస్తే మేలు**

శ్రామిక్, లీడ్ బ్యాంకు మేనేజర్, నల్గొండ.

ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరిస్తే తప్పనిసరిగా ఆ ఖాతాను నిబంధనల ప్రకారం నిర్వహించాలి. ఇటీవల కాలంలో అన్ని బ్యాంకుల్లో ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ సేవలతో పాటు యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. అన్ని బ్యాంకులకు ప్రత్యేక మొబైల్ యాప్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించడం సైతం అంత కష్టమేమీ కాదు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ..బ్యాంకు ఖాతాను అంతరాయం లేకుండా నిర్వహించుకోవచ్చు.

చురకలు

శుక్రవారం 22 ఆగష్టు 2025

# అలక వీడు చినుకమ్మ.. కంటతడితో రైతన్న

పెద్దపల్లి : జిల్లాలో సాగునీటి వనరులు వెలవెలబోతున్నాయి. నీటి పరవళ్లతో తొణికిసలాడాల్సిన చెరువులు, కుంటలు వర్షాలు లేక బోసిపోతున్నాయి. కొన్నేళ్లుగా జులైలో మత్తడి దూకిన చెరువులు నేడు సాగుకు నీరందని స్థితికి చేరాయి. దీంతో నీటి వనరుల కింద పోసిన నారు మడులు ఎండిపోతుండటంతో అన్నదాత దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆగస్టుపైనే ఆశలు పెంచుకొని ముందుకెళుతున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణుల ప్రకటన ఊరించిన ప్పటికి ముఖం చాటేయడంతో ఆయోమయం నెలకొంది.

**కళ తప్పిన నీటి వనరులు**

జిల్లాలో 1,017 చెరువులు, కుంటలున్నాయి. వీటిలో కనీసం పావలా వంతు కూడా నీరు రాలేదు. యాసంగిలో ఎస్సారెస్పీ నీటి విడుదలతో వేసవిలో నీరు సమృద్ధిగా ఉన్న చెరువులు తప్ప మిగిలిన చోట్ల కళ తప్పాయి. జిల్లా వ్యాప్తంగా వేసవిలో ఉన్న 6 చెరువులు మాత్రమే మత్తడి దూకినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు పెద్దగా భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు నెర్రలు బారుతున్నాయి.



మానేరు, హుస్సేన్‌మియా వాగుల అనుసంధానంతో ఉన్న చెరువుల్లోనూ నీరు లేదు.

**సగంలోపే సాగు**

జిల్లాలో వానాకాలంలో 2.76 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయని ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటివరకు 93,380 ఎకరాల్లో వరి, 47,455 ఎకరాల్లో పత్తి, 18 ఎకరాల్లో కందులు, 241 ఎకరాల్లో మొక్కజొన్న, 9 ఎకరాల్లో ఇతర పంటలు కలుపుకొని మొత్తం 1,41,103 ఎకరాల్లో సాగయ్యాయి.

బోర్ల కింద తప్ప చెరువులు, కుంటల పరిధిలో వరి నాట్లు వేయడంలేదు. వారం రోజులుగా అక్కడక్కడ ముసురు తప్ప పెద్ద వర్షాలు కురవలేదు. మరోవైపు ఎస్సారెస్పీ నీరు విడుదల కాకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

చెరువుల్లో నీటి నిల్వలు ఇలా

మొత్తం: 1,017

25 శాతంలోపు: 451

50 శాతంలోపు: 388

75 శాతంలోపు: 130

100 శాతంలోపు: 42

మత్తడి పడినవి: 6

# చోటు.. కాటు.. చేటు


ఖమ్మం నగరంలో మూడేళ్ల నుంచి ఏటా రూ.10లక్షలు ఖర్చుచేసి రోజూ 10-12 కుక్కలకు కు.ని.శస్త్రచికిత్స చేస్తున్నారు. మిగతా చోట్ల నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. పిల్లి కాటుకు 396, పాము కాటుకు 170, ఇతర జీవాల కాటుకు 479 మంది గురయ్యారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పల్లెలు, పట్టణాల్లో కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. శునకాల దాడిలో గాయపడి టీకా తీసుకున్నా.. రేబిస్ వ్యాధి ముదిరి చనిపోయినవారూ ఉన్నారు. శివారు ప్రాంతాలు, పండ్ల చెట్లు, తోటల పెంపకం చేపట్టే పరిసరాల్లో వానరాలు తిష్ఠవేస్తున్నాయి. వీటితో పాటు పిల్లులు, పాములు, ఎలుకలు, ఇతర జంతువులు దాడి చేయటంతో ఈఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఉభయ జిల్లాల్లో 19,463 మంది గాయపడి సర్కారు దవాఖానాల్లో టీకాలు వేసుకున్నారు. వీరిలో 17,765 మంది వానరాలు, శునకాల దాడికి గురయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇవీ ప్రభుత్వ ఆసుపత్రుల లెక్కలు మాత్రమే. 'ప్రైవేటు'కు వెళ్లినవారు మరో పదిశాతం మంది ఉంటారని అంచనా.

**ఖమ్మం జిల్లాలో..**

ఖమ్మం జిల్లాలో కోతులు 2,952 మందిపై దాడిచేశాయి. ఖమ్మం నగరంలోని కొత్తగూడెం, దానవాయిగూడెం, అల్లీపురం, రాపర్తినగర్, బీసీకాలనీలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఒక ప్రాంతంలో వానరాలు పట్టుకుంటే.. మరో కాలనీ నుంచి ఇక్కడికి చేరుతుండటంతో సమస్య మొదటికొస్తుంది. జిల్లాలో 10,895 మంది కుక్కకాటు బారినపడ్డారు.

**కూరగాయల సాగుపై ప్రభావం**

వివిధ పంటల సాగుకు వానరాలు ప్రతిబంధకంగా మారాయి. కోతుల



భయానికి పండ్లు, కూరగాయలు సాగుచేయటానికి రైతులు జంకుతున్నారు. వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా.. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 60 ఎకరాలకే కూరగాయలు, 33 ఎకరాలకే వేరుసెనగ సాగు విస్తీర్ణం పరిమితమైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**భద్రాద్రి జిల్లాలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈఏడాది తొలి ఆరు మాసాల్లో వివిధ జంతువుల దాడిలో 4,571 మంది గాయపడ్డారు. వీరిలో కుక్కకాటుకు 1,968 మంది, కోతుల దాడికి 1,950, పాము కాటుకు 32, పిల్లి, ఎలుక, ఇతర జీవాల కాటుకు 621 మంది గురయ్యారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో గంగాహుస్సేన్‌బస్తీ, ఫ్యాన్‌బస్తీ, బూడిదగడ్డ, హనుమాన్‌బస్తీ, రామవరంలోని నేతాజీబస్తీ, బర్మాక్యాంపు పరిసరాల్లో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. నాలుగేళ్లలో పదకొండు సార్లు కోతులను పట్టేందుకు ప్రత్యేక బృందాలను రప్పించారు. ఇందుకోసం కొత్తగూడెం పురపాలిక రూ.29లక్షలకు పైగా వెచ్చించింది. కుక్కల నియంత్రణకు పెద్దగా చర్యలు తీసుకోవటం లేదు. కొత్తగూడెంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ కు.ని.శస్త్రచికిత్సలు చేసి వదిలేస్తున్నారు. గత రెండేళ్లలో 2,876 శునకాలకు కు.ని.శస్త్రచికిత్స చేశారు.

# సమన్వయ లోపం.. ఆగిన నిర్మాణం



కోరుట్ల: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం అభివృద్ధి పనులకు శాపంగా మారింది.. అధికారుల్లో ముందుచూపు లేక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఆగమేఘాల మీద పనులు చేపట్టగా, స్థలానికి సంబంధించిన శాఖ నుంచి అనుమతి లేకపోవడంతో రెండేళ్లుగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. కోరుట్ల ఆదర్శనగర్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వివిధ పనులపై వెళ్లేవారికి వ్యయ ప్రయాసలు ఎదురవుతున్నాయి. సుమారు 23 ఏళ్లుగా ప్రజలు ఇబ్బంది పడుతుండగా పట్టణం మధ్యలోకి మారుస్తామన్న నేతల హామీ ఎన్నికలకే పరిమితమవుతోంది. ఎట్టకేలకు గత శాసనసభ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కల్లూర్‌రోడ్‌లోని ఎస్సారెస్పీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవనానికి నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. ఇందుకోసం 6.5 గుంటల స్థలాన్ని చదును చేయించి హద్దులు నిర్ణయించారు. అధునాతన వసతులతో ఒక అంతస్తుతో కూడిన భవన నిర్మాణానికి రూ.1.30 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు.

**15 రోజుల కిందట అనుమతులు**

తహసీల్దారు కార్యాలయ భవనానికి మొదటి విడతలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20 లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. 2023 జూన్ 14న భూమిపూజ చేయగా ఆరు నెలల తర్వాత గుత్తేదారు పనులు ప్రారంభించారు. ఇంతలో తమ శాఖ నుంచి అనుమతులు లేవంటూ నీటిపారుదల అధికారులు అభ్యంతరం చెప్పడంతో మధ్యలోనే నిలిపివేశారు.

అనంతరం జిల్లా స్థాయి అధికారుల సూచనతో గుత్తేదారు పనులు తిరిగి ప్రారంభించారు. పిల్లర్ల దశ వరకు రూ.20 లక్షల విలువైన పనులు జరిగాయి.

అయితే బిల్లుల చెల్లింపునకు స్థలం అనుమతి పత్రాలు కావాలని అధికారులు చెప్పడంతో మరోసారి పనులను నిలిపివేశారు. రాజకీయ ఒత్తిళ్లతోనే పనులు నిలిచిపోయాయని అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది.

ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు 15 రోజుల కిందట ఎస్సారెస్పీ స్థలాన్ని తహసీల్దారు భవనానికి కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఇప్పటికైనా పనుల్లో వేగం పుంజుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.

**త్వరలోనే ప్రారంభిస్తాం**

రూ.20 లక్షల విలువైన పనులు పూర్తి కాగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఇన్నాళ్లూ నీటిపారుదల శాఖ అనుమతుల కోసం ఎదురుచూడగా 15 రోజుల క్రితం లభించాయి. మిగిలిన రూ.30 లక్షల విలువైన పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. నిర్మాణ పనులు పూర్తి కావడానికి ఈ నిధులు సరిపోవు. మరిన్ని మంజూరు కావాల్సి ఉంది.సుచరితరావు, పంచాయతీరాజ్ ఏఈ

# సగటు నమోదు..!



సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లాపై మేఘాలు మురిపిస్తూ..వరుణుడు దోబూచులాడుతున్నాడు. వానాకాలం సీజన్ మొదలైన 52 రోజుల్లో ఈ మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. పత్తి మొక్కల మధ్యన కలుపు మొక్కలను తొలగిస్తూ..అడుగు మందుగా యూరియా వేస్తున్నారు. వరి నాట్లు వేసే వారు వేస్తుండగా..కొందరు పొలాలను దమ్ము చేసే పనిలో నిమగ్నమయ్యారు. ముమ్మర సాగుపనులతో పొలాల వద్ద రైతులు, కూలీలతో సందడి నెలకొంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) వివరాల ప్రకారం జూన్ 1 నుంచి జులై 22 నాటికి పడిన వానలతో యాద్రాది, నల్గొండలో సాధారణ, సూర్యాపేటలో లోటు వర్షపాతం నమోదైంది.

**గుట్టలో సాధారణం.. పేటకు లోటు...** సూర్యాపేట జిల్లాలో ఈ 52 రోజుల్లో 13 రోజులే వర్షం కురిసింది. సగటు సాధారణం కంటే 27 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 23 మండలాల్లో జాజిరెడ్డిగూడెం, మోతె, పెనుపహాడ్, మునగాల, కోదాడ, చిలుకూరు, మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో సాధారణం కాగా మిగిలిన 15 మండలాల్లో లోటు వర్షమే కురిసింది. కాగా సోమవారం ఉదయం 8:30 నుంచి మంగళవారం ఉదయం 8:30 వరకు 14.9 మి.మీటర్ల వర్షం కరిసింది.నల్గొండ జిల్లాలో 13 రోజులు వర్షం పడి సగటు సాధారణ వర్షపాతం నమోదైంది. 33 మండలాల్లో మర్రిగూడ, గుండ్లపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఏడు మండలాల్లో అధిక, 12 చోట్ల సాధారణ వాన కురిసింది. మిగిలిన 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మంగళవారం జిల్లాలో 29.7 మి.మీ. కురియగా అత్యధికంగా అడవిదేవులపల్లిలో 10.15 సెం.మీ., గుర్రంపోడులో 6.9 సెం.మీ, పెద్దవూరులో 6.7 సెం.మీ. వాన పడింది.

ఉమ్మడి జిల్లాలో 4 వేల చెరువులు, కుంటలున్నాయి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లో సాగు స్థిరీకరణకు దోహదపడుతున్నాయి.ఎన్ఎస్పీ కాలువ పరిధిలోని దాదాపు 20 మండలాల్లోని చిన్ననీటి వనరుల్లో ఆశించిన మేర నీటి నిల్వలున్నట్లు తెలిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఆయకట్టు సాగుకు, బావులు, బోర్లలో భూగర్భజలాల వృద్ధికి సరిపడా నీరు లేదని సమాచారం. ప్రస్తు తం కురుస్తున్న వర్షాలకు ఆ వనరుల్లోకి చేరిన వరద తక్కువేనని ఆయకట్టు రై తులు వాపోయారు.

# జోరుగా మార్కెట్ ఆధునికీకరణ

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు జోరందుకున్నాయి. నాలుగు నెలల్లో పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మార్కెట్ ఆధునికీకరణ పనుల కోసం సర్కారు రూ.155.30కోట్లు మంజూరు చేసింది. తొలి విడతలో రూ.114.36 కోట్లతో 21 పనులు, రెండో విడతలో రూ.40.94కోట్లతో రెండు పనులు చేపట్టాలని నిర్ణయించింది. నిర్మాణ పనులను 'ఎజిలిటీ అండ్ భూమి ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ సంస్థ'కు అప్పగించింది. పనులను వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచూ పర్యవేక్షిస్తున్నారు.

**ఆరు షెడ్ల నిర్మాణం**


మార్కెట్లో ఆరు పెద్ద షెడ్ల నిర్మాణం మొదలైంది. పునాదుల వరకు పనులు పూర్తయ్యాయి. నాలుగు నెలల్లో షెడ్లను నిర్మించాల్సి ఉంది. ఐదు షెడ్లలో పంటల క్రయవిక్రయాలు జరగనున్నాయి. ఆరో షెడ్డును రెండంతస్తుల్లో నిర్మిస్తారు. కింది భాగంలో లావాదేవీలు, మొదటి అంతస్తులో రైతు విశ్రాంతి భవనం, హమాలీలు, దడవాయిల కార్యాలయాలుగా వినియోగించనున్నారు.

**రెండో దశలో కమీషన్ కార్యాలయాలు**

పరిపాలన భవనాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. దీని పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్కెట్‌లో అగ్నిమాపక యంత్రాలు, నీటిసరఫరా వ్యవస్థ, హైమాస్క్ లైట్లు, అండర్‌గ్రౌండ్ సంపులు, ప్రహరీ, సెక్యూరిటీ గార్డుల గదులు, ఎంట్రీ గేట్లు నిర్మిస్తారు. రెండో దశలో రెండు కమీషన్ ఏజెంట్ల కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు.

**ఆధునిక హంగులతో..**

ఏడో షెడ్డులో ప్రత్యేకంగా శీతల గిడ్డంగిని నిర్మిస్తారు. ఇందులో రైతులు సుమారు లక్ష మిరప బస్తాలు నిల్వ చేసుకునే అవకాశముంటుంది.



ఏదైనా మార్కెట్ ప్రాంగణంలో ఏసీ గిడ్డంగి నిర్మించటం ఇదే ప్రథమం. వీటితో పాటు అధునాతన సౌకర్యాలతో మూడు శౌచాలయాలు నిర్మిస్తున్నారు. రైతులు, వ్యాపారులు, కార్మికుల దాహార్తి తీర్చేందుకు ఒక్కొక్కటి సుమారు 2వేల లీటర్ల సామర్థ్యంతో నాలుగు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. 5వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు, రెండు వే బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.

మార్కెట్ ఆధునికీకరణ పనులు పూర్తయితే రైతుల భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది ఉండదు. గతంలో మాదిరిగా తమ పంట ఉత్పత్తులను రోడ్లపై విక్రయించుకునే దుస్థితి తలెత్తదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం మార్కెట్ దేశానికి ఆదర్శంగా నిలవబోతోంది. శీతల గిడ్డంగిలో రైతులు నామమాత్రపు రుసుముతో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే వెసులుబాటు దొరుకుతుంది.

– యరగర్ల హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఖమ్మం

# సంఘాల ప్రగతికి సహకారం

నల్గొండ : ఐకమత్యమే మహాబలం అన్నది.. మనందరికీ తెలిసిందే. దీనిని పాటిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులను ఒకటి చేసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఎంపిక చేసిన పీఏసీఎస్ (ప్రాథమిక సహకార సంఘాలు)లను ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘం)గా మార్చనున్నారు. తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసినఎఫ్‌పీవోల నిర్వహణకు అవసరమయ్యే నిధులను ఆయా సంఘాలకు అందజేశారు. మొదటి విడతలో ఒక్కో సంఘానికి రూ.3.16 లక్షల చొప్పున కేటాయించారు. నల్గొండ జిల్లాలో 45 పీఏసీఎస్‌లు ఉండగా పనితీరు, సామర్థ్యాన్ని బట్టి 13 సంఘాలను ఎఫ్‌పీవోలగా అనుమతించారు.

**ఇలా ఉంటుంది..**

పీఏసీఎస్‌లో సభ్యులు ఎఫ్‌పీవోల్లోనూ చేరవచ్చు. సహకార సంఘాల మాదిరి ఎన్నికల నిర్వహణ ఉండదు. కాకపోతే అక్కడ సభ్యత్వ రుసుం బదులు ఇక్కడ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పెట్టుబడులన్నీ కలిపి ఒక ఎఫ్‌పీవో షేర్ క్యాపిటల్ రూ.15 లక్షలుగా ఉండాలి. దీనిక్జి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రూ.15 లక్షల నుంచి రూ.2కోట్ల వరకు రుణం అందిస్తుంది.

సీఈవో వేతనం రూ.25 వేలు, అకౌంటెంట్ జీతం రూ.10 వేలకు మించకుండా ఖర్చు చేయాలి.కంప్యూటర్, ప్రింటర్, ఇతర సామగ్రి



కొనుగోలుకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు వెచ్చించవచ్చు.

కార్యాలయం అద్దె కింద ఏడాదికి రూ.48 వేలు, విద్యుత్తు, టెలిఫోన్ ఛార్జీలు రూ.12 వేలు, ప్రయాణ, సమావేశ ఖర్చులు కింద రూ.18 వేలు, స్టేషనరీ ఇతర ఖర్చులు కింద రూ.12 వేలు మించకుండా ఖర్చు చేయాలి.

**ముఖ్య ఉద్దేశం..**

భూసార పరీక్షలు, విత్తన స్వావలంబన, సరైన ఎరువుల ఎంపిక-వాడకం, జలవనరుల సద్వినియోగం, సాంకేతిక వినియోగం, అధిక దిగుబడి(లాభసాటి వ్యవసాయం), మార్కెట్ సౌలభ్యం, సహజ, సేంద్రియ పంటలు-వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించటం, వ్యవసాయ ఆధారిత-వ్యవసాయేతర వ్యాపారాల నిర్వాహణ, రైతు సమగ్రాభివృద్ధికి దోహదపడటం, గ్రామీణ యువత, మహిళలు-వ్యవసాయేతర ఉత్పత్తుల వారికి సహాయపడటం, సంపద సృష్టి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం.

**మ్యాచింగ్ గ్రాంట్**

సభ్యులు ఒక్కొక్కరు రూ.25 వేలకు మించకుండా గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు మ్యాచింగ్ గ్రాంట్ పొందవచ్చు.

స్థిరమైన నమూనా ఆధారంగా ఏడాదిన్నర వ్యాపార ప్రణాళిక, బడ్జెట్ కలిగి ఉండాలి.సభ్యులు తమ వాటాలను పెంచుకోవడమే కాకుండా యాజమాన్య విషయంతో ప్రభుత్వం సహకరిస్తుంది.

యాజమాన్య బోర్డులో మహిళా రైతులు తగినంత ప్రాతినిధ్యం వహించాలి. తద్వారా ఎఫ్‌పీవో క్రెడిట్ విలువ పెరుగుతుంది.

**ఎంపికైన సంఘాలు**

గొల్లగూడ(నల్గొండ), కొత్తపల్లి, చండూరు, గుర్రంపోడు, కనగల్, కట్టంగూరు, వెలిమినేడు, దేవరకొండ, పెద్దవూర, తిప్పర్తి, శాలిగౌరారం, వేములపల్లి, దామరచర్ల.

**బలోపేతం చేయవచ్చు: పత్యానాయక్, డీసీవో, నల్గొండ**


రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకోవాలి. సంఘాలను బలోపేతం చేసి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడాలి.

# ఊరికి ఉపకారి.. ఆక్రమణలతో ఉరి!

సంగారెడ్డి : రాజధానికి సమీపంలో సంగారెడ్డి జిల్లా ఉండడం వల్ల ఇక్కడి వ్యవసాయ భూములపై స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడింది. భూములను కొంటూ, ప్లాట్లు చేస్తూ ఆ పక్కన నీటి వనరులను వదలడం లేదు. ఎఫ్‌టీఎల్, శిఖం, బఫర్ జోన్, అలుగు, కట్టలను కబ్జా చేస్తున్నారు. నాలాగా మార్చి ప్లాట్లు చేసి బేరం పెడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇలా**

సంగారెడ్డి పట్టణంలో చంద్రయ్య, దేవుని చెరువులు, బొబ్బిలికుంట, మహబూబ్ సాగర్, దూద్‌బాయి చెరువు, మాసాని కుంట ప్రభుత్వ ఐటీఐ పక్కన ఎర్రకుంట, రాజంపేటలోని ఎర్రకుంట, పోతిరెడ్డిపల్లిలోని కుక్కలకుంటలు ఆక్రమణకు గురయ్యాయి. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు సర్వే చేసి గుర్తించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని మల్లం చెరువు మరమ్మతుకు రూ.కోటి ఖర్చు చేశారు. ఇపుడు చెరువు అన్యాక్రాంతానికి గురయిందని స్థానికులు వాపోతున్నారు. కంది మండలంలోని పలు గ్రామాల్లో నీటి వనరులు కబ్జాకు గురయ్యాయి.జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం తామర చెరువులో కూడా ఎఫ్‌టీఎల్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా



ఎవరూ పట్టించుకోవడంలేదు. అందోలులో పెద్ద చెరువు, ఊర చెరువు ప్రాంతాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. సదాశివపేట పట్టణంలో ఊబ చెరువు శిఖంలో వాణిజ్య, వ్యాపార దుకాణాలు వెలిశాయి.

**సమన్వయం లేక**

నీటిపారుదల, రెవెన్యూ, పురపాలక, పంచాయతీల శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో నీటివనరులు కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే పల్లెలు, పట్టణాల్లో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ హద్దులపై సర్వే చేసి, హద్దులు గుర్తించారు. అయితే ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టలేదు. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా హైడ్రా వ్యవస్థను ఏర్పాట్లు చేసి, ఈ ఘటనలను అడ్డుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.**పరిశీలించి చర్యలు: జైభీం, ఈఈ, సంగారెడ్డి**

నీటి వనరులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం ఆయా ప్రాంతాలను పరిశీలిస్తాం. హైడ్రా అమలుల్లోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడ కూడా చెరువుల ఆక్రమణ కొంత తగ్గింది.

జిల్లాలో చెరువులు, కుంటలు: 1769

అన్యాక్రాంతమైనవి: 463

# అధనం ఇచ్చేయాల్సిందే

కర్నూలు : వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకు అనువుగాని ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలిచ్చారు. దీనికితోడు గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామని హడావుడి చేశారు. సాయం తక్కువగా ఉండటం.. స్థలాలు జనావాసాలకు దూరంగా ఉండటం.. ఎలాంటి వసతులు లేకపోవడంతో చాలామంది గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. కొంతమంది ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మధ్యలోనే ఆపేశారు.

**నగదు జమ చేసినా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున అదనపు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. వీరిలో చాలామంది గృహ నిర్మాణాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో 'నిర్మాణాలు చేపట్టండి.. లేదా అదనపు సాయం, అడ్వాన్స్ రూపంలో పొందిన మొత్తం చెల్లించండి' అంటూ గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు.

**రికవరీకి చర్యలు**

వివిధ దశల్లో ఆగిపోయిన పక్కా గృహాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద అదనపు సాయం ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం



నిర్ణయించింది. ఈ ఏడాది మార్చిలో ఉమ్మడి జిల్లాలో 8,021 మంది లబ్ధిదారులకు రూ.11.88 కోట్ల మేర సాయం మంజూరు చేసింది. వీరిలో 1,400 మంది నిర్మాణాలు చేపట్టారు. మిగిలినవారు మొదలు పెట్టలేదు. నగదు జమ చేసి ఐదు నెలలవుతున్నా నిర్మాణాల్లో కదలిక లేకపోవడం గమనార్హం.

ఈ క్రమంలో గృహ నిర్మాణాల్లో పురోగతి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అదనపు సాయం పొందినవారికి గృహ నిర్మాణ సంస్థ అధికారులు గత పది రోజులుగా తాఖీదులు జారీ చేస్తున్నారు. నగదు రికవరీకి చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఆప్షన్-1, 2 కింద ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన లబ్ధిదారులకు 2022-23లో రూ.10 వేలు, రూ.20 వేల చొప్పున నగదు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 5 వేల మందికిపైగా ఇలా నగదు తీసుకున్నారు. వీరంతా ఇళ్లు నిర్మించుకోవడం లేదు. వారి వద్ద నగదు అలాగే ఉండిపోయింది.

ఈ ఏడాది మార్చిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొచ్చిన లబ్ధిదారులకు అందించిన అదనపు సాయం (రూ.కోట్లలో)

# నానో.. లాభాలెన్నో

ఆత్మకూరు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. అధిక దిగుబడుల పేరుతో రైతులు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా పొలాలన్నీ నిస్సారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటి వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీ స్థానంలో ద్రవరూప నానో యూరియా, డీఏపీలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 6,27,788, రబీలో 3,42,792 హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ప్రధానంగా పత్తి, వరి, మిరప, మొక్కజొన్న, వేరుసెనగ, కంది తదితర పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఎకరా వరి పైరుకు సగటున 160 కిలోల యూరియా వాడాలి. కానీ 400 కిలోల నుంచి 500 కిలోలు వాడుతున్నట్లు వ్యవసాయాధికారుల పరిశీలనలో తేలుతోంది. మోతాదుకు మించి వినియోగిస్తుండటంతో పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా సోకుతోంది.

**ప్రయోజనం ఎంతో..**

బస్తా యూరియా ధర రూ.266 కాగా.. బయట దుకాణాల్లో అదనంగా వసూలు చేస్తున్నారు. నారో యూరియా 500 మి.లీ. డబ్బా రూ.225కే లభిస్తుంది. డీఏపీ బస్తా కొత్త ధర రూ.1,400. నానో డీఏపీ సీసా రూ.600 మాత్రమే. ఎకరాకు అర లీటరు ద్రావణం సరిపోతుంది.

**అవగాహన కరవవడంతో..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నానో యూరియా, డీఏపీలను ఒక్క శాతం మంది రైతులు కూడా వినియోగించట్లేదని అధికారులు చెబుతున్నారు. వీటిని ప్రభుత్వం రెండేళ్ల కిందటే మార్కెట్‌లో అందుబాటులోకి




తీసుకొచ్చింది. అవగాహన లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

**రికార్డుస్థాయిలో వినియోగం**

రసాయన ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రికార్డు సృష్టించింది. 2024-25లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో, దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్రమే ప్రకటించింది. నంద్యాల జిల్లాలో ప్రధానంగా వరి సాగు అధికం. ఎకరా సాగుకు 3 బస్తాల యూరియా వేయాల్సి ఉండగా సుమారు 10 బస్తాల వరకు వినియోగిస్తున్నారు. 2024-25లో యూరియా, డీఏపీ, ఎంవోపీ తదితర 3.75 లక్షల టన్నుల ఎరువులను రికార్డు స్థాయిలో వినియోగించారు. 2.38 లక్షల మెట్రిక్ టన్నుల వినియోగంతో కర్నూలు జిల్లా ఐదో స్థానంలో నిలిచింది.

# ఆయకట్ట భద్రమేనా



ఆలూరు : జిల్లాలో దిగువకాల్వ కింద ఖరీఫ్, రబీ సీజన్ల కింద 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. జిల్లాలో 135 కి.మీ. నుంచి 250 కి.మీ. వరకు కాలువ ఉంది. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల మీదుగా కాలువ ప్రవహిస్తూ ప్రజల అవసరాలను తీరుస్తోంది. పశ్చిమ ప్రాంతంలో 32 తాగునీటి కుంటలు ఉండగా 120 గ్రామాలకు నీరు అందుతోంది. ఈసారి జలాశయం గేట్ల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వ అధికంగా ఉంచకుండా ఖరీఫ్ పంటలకు సాగు నీరు అందిస్తున్నారు. జిల్లా ప్రజలకు తుంగభద్ర జలాశయమే ఆధారం. అలాంటి కీలకమైన ప్రాజెక్టుకు సంబంధించిన గేట్లు మొరాయిస్తుండటంతో రైతులు, ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులోకి వరద నీరు అధికంగా చేరడంతో 19వ గేటు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మరో ఏడు గేట్లు ప్రమాదంలో ఉన్నట్లు తేలింది. గేట్లు పైకి ఎత్తడం, దించడంలో సమస్యలు తలెత్తితే మిగిలిన గేట్ల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అంతేగాకుండా దిగువ, ఎగువ కాలువలకు సైతం నీటిని ఎక్కువగా విడుదల చేసే అవకాశం ఉంటుంది.

**సాగుదారుల్లో ఆందోళన**

ప్రస్తుతం పశ్చిమ ప్రాంతంలో ఎల్లెల్సీ కింద రైతులు పంటలు సాగు చేశారు. తుంగభద్ర జలాశయం నిండడంతో పంటలు పండించుకునే అవకాశముందని భావించారు. ప్రస్తుతం తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదకరంగా ఉండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు కిందకు వదిలేస్తే పంటలన్నీ దెబ్బతింటాయని పేర్కొంటున్నారు. రబీ పంటలకు సాగు నీరు అందించేదిలేదని బోర్డు అధికారులు ముందుగానే తెలియజేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్ల పరిస్థితి నేపథ్యంలో ఖరీఫ్ రైతులు ఆవేదనలో మునిగిపోయారు.

**లైనింగ్ పనుల్లో అక్రమాలు**

గతేడాది దిగువ కాలువకు లైనింగ్ పనులు చేపట్టారు. పనులు నాసిరకంగా చేయడంతో చాలా ప్రాంతాల్లో నీరు లీకైంది. గతేడాది 120 కి.మీ. వద్ద కర్ణాటక రాష్ట్రం బరదనహళ్లి సమీపంలో కాలువకు రంధ్రం పడింది. కర్నూలు జిల్లా పరిధిలోని 158 కి.మీ. బాపురం పరిధిలో లీకేజీ ఏర్పడింది. లైనింగ్ పనులను గుత్తేదారులు నాసిరకంగా పనులు చేయడంతో ఈ సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం కాలువకు అధిక నీరు విడుదల చేస్తే ఆ ప్రవాహాన్ని తట్టుకుని కాల్వ గట్లు నిలబడతాయా? అన్నది సందేహంగా మారింది.

# మట్టి తవ్వేయ్.. చూడరు అమ్మేయ్



ఎమ్మిగనూరు: ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వందల ఎకరాల్లో భూములతోపాటు కొండలను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో దాదాపు రెండు వందల ఎకరాల్లో పలువురు అక్రమార్కులు ఎర్రమట్టి తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనూ దందా అలానే కొనసాగుతోంది. మాసుమాన్‌దొడ్డి కొండ సమీపంలో ఎడమ వైపు ప్రాంతంలో ఎర్రమట్టిని పెద్దఎత్తున ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఎమ్మిగనూరులో ప్రాంతంలో వేసిన నాన్ లేఅవుట్లలో రహదారులు నిర్మించేందుకుగాను దీనిని ఉపయోగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టిని ఇతరులకు రూ.1000కు అమ్ముతున్నారు. ప్రతిరోజూ ట్రాక్టర్లలో పెద్దఎత్తున మట్టి తరలుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ,. పోలీసు అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

**బనవాసి ఫారంలోనూ ఇదే తంతు** బనవాసి ఫారంలో దాదాపు 1,500 ఎకరాల భూములున్నాయి. వీటిల్లో వేప, టేకు, ఎర్రచందనం, ఇతర చెట్లను పెద్దఎత్తున పెంచారు. ప్రస్తుతం నవోదయ సమీపంలో ఉన్న చెట్ల ప్రాంతంలో ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్నారు. పశువైద్య కార్యాలయం, రాగిమాన్‌దొడ్డి రహదారిలోని టేకు, నీలగిరి చెట్ల ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ఫారం వెనుక భాగంలోని భూముల్లో 6 ఎకరాల్లో తవ్వేశారు.

**సొమ్ము చేసుకుంటూ..** బనవాసి ఫారం భూముల్లో 22 ఏళ్ల కిందట అప్పట్లో రూ.2.50 కోట్లు వెచ్చించి అటవీ శాఖ ఆధ్వర్యంలో కానుగ, చింత, వేప, తుమ్మ, ఇతర మొక్కలు నాటారు. ఫారం భూములు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నాయి. ఈ ప్రాంతంలో విలువైన చెట్లను ధ్వంసం చేసి మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ ట్రాక్టరు ఎర్రమట్టిని రూ.1,800 వరకు అమ్ముకుంటున్నారు. రాగిమాన్‌దొడ్డి ప్రాంతంలోని కొండలో సుమారు 17 ఎకరాల్లో ఎర్రమట్టిని తరలించి చదును చేసేయడం గమనార్హం. హనుమాపురం వద్ద 14 ఎకరాల్లో ఎర్రమట్టిని తవ్వి తరలించారు. ఇకనైనా అధికారులు స్పందించి విస్తృతంగా దాడులు జరిపి ఎర్రమట్టి తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

# బాధ్యతలు పెంచి.. పర్యవేక్షణ మరిచి



ఆళ్లగడ్డ: ఉమ్మడి జిల్లాలోబీసీ వసతిగృహాలకు వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో హాస్టల్‌లో వందల మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒక్కో అధికారికి రెండు మూడు వసతిగృహాల బాధ్యతలు అప్పగించడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కరవవుతోంది. కర్నూలు జిల్లాలో 47 బీసీ వసతిగృహాలుండగా సుమారు 30 మంది సంక్షేమాధికారులు మాత్రమే ఉన్నారు. నంద్యాల జిల్లా పరిధిలో 33 హాస్టళ్లు ఉండగా.. 21 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంకనూ 29 మంది సిబ్బంది కొరత ఉంది. ఫలితంగా పలువురికి రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎవరు ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కరవైంది. **ఎవరూ దృష్టి సారించక**

ఉమ్మడి జిల్లాలో ఒక్కొక్కరు కనీసం రెండు వసతిగృహాల బాధ్యతలు చూసుకోవాల్సి వస్తోంది. ఒక వసతిగృహ బాధ్యతలు చూసుకోవడమే కష్టంగా మారిన నేపథ్యంలో రెండు, మూడు బాధ్యతలు అప్పగించడంతో వారు న్యాయం చేయలేకపోతున్నారు. ఆ ప్రభావం విద్యార్థుల చదువుపైనా పడుతోంది. మెనూ సక్రమంగా అమలుకావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో కొందరు పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**దూరాభారమే** చాగలమర్రి మండలం చిన్నవంగలిలోని రెగ్యులర్ వార్డెన్‌కు ఉయ్యాలవాడ వసతిగృహ బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు గ్రామాల మధ్య 35 కి.మీ. దూరం ఉంది. ఫలితంగా ఈ రెండింటిని చూసుకోవడం కష్టంగా మారింది.కర్నూలు నగర పరిధిలో బీసీ వసతిగృహ బాధ్యతలు చూసుకునే సంక్షేమాధికారికి 50 కి.మీ. దూరంలో ఉన్న సి.బెళగల్‌లోని వసతిగృహ బాధ్యతలు అదనంగా అప్పగించారు. నందికొట్కూరు బీసీ వసతిగృహ బాధ్యతలు చూసుకునే వార్డెన్‌కు కి.మీ. దూరంలో.. 170 మంది విద్యార్థులున్న కొత్తపల్లి బీసీ వసతి గృహ బాధ్యతలు సైతం చూసుకోవాల్సి ఉంటుంది. కొత్తపల్లి-నందికొట్కూరు మధ్య దూరం 45 కి.మీ. దూరం ఉంది. నిత్యం రాకపోకలు సాగించాలంటే అవస్థలే.ఆదోని మండలం పెద్దహరివాణం అధికారికి హొళగుంద మండలం ఇంగతహాల్ హాస్టల్ బాధ్యతలను అప్పగించారు.

# దశ తిరిగిన దద్దణాల

బనగానపల్లి : మండల పరిధిలోని దద్దణాల చెరువు నిండుకుంది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక తక్కువ నీటి నిల్వతో ఉండేది. చెరువు దుస్థితిపై ప్రచురితమైన వరుస కథనాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. మంత్రి రూ.27లక్షల సొంత నిధులు వెచ్చించి ఎత్తిపోతల పథకం పునఃప్రారంభించారు. దీంతో బనగానపల్లి సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ వద్ద రూ.20 కోట్లతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులోకి నీటిని మళ్లించారు. వర్షం నీటితోపాటు ఎత్తిపోతల నీరు చెరువులోకి రావడంతో ప్రస్తుతం పుష్కలంగా నీరు ఉండి నిండుకుండను తలపిస్తోంది. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో చెరువులో నీరు ఉండటంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా పాలనలో నిర్లక్ష్యం**

వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చెరువు అభివృద్ధికి నోచుకోలేదు.



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ఆరు నెలలకు పైగా సాగునీరు వస్తుంది. వర్షం నీటితో పాటు ఎత్తిపోతల నుంచి చెరువుకు నీరు చేకూరడంతో వచ్చే రబీ పంటలకు ఉపయోగపడనుంది. చెరువు కింద ఈ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, వరి, కంది, పత్తి పంటలు సాగు చేశారు.

**ప్రయోజనం ఇలా..**

దద్దణాల చెరువులో పుష్కలంగా నీరంటే 1,550 ఎకరాలకు సాగునీరు అందుతుంది. సమీపంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. సుమారు 5 వేల మంది రైతులు ప్రయోజనం పొందుతారు. పాతపాడు, జోలాపురం, మీరాపురం, సాధుకొట్టం, మాదాసుపల్లె, యాగంటిపల్లె, పెద్దరాజుపాలెం, చిన్నరాజుపాలెం, కృష్ణగిరి, చెర్లోకొత్తూరు, పసుపుల తదితర గ్రామాలకు వేసవిలో సైతం తాగునీటి ఇబ్బందులు తీరుతాయి. బనగానపల్లి పట్టణానికి సైతం వేసవిలో తాగు నీటి ఇబ్బందులు తొలగిపోతాయి.

# బతుకులు కూలిపోతాయ్

బనగానపల్లి: మండల పరిధిలోని యాగంటి ఆలయం నుంచి కటికవానికుంట మీదుగా మద్దిలేటి స్వామి ఆలయానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. మద్దిలేటి స్వామి ఆలయం వెళ్లాలంటే దగ్గరి దారి కావడం.. 10 కి.మీ. ఉండటంతో జనం నిత్యం వెళుతుంటారు. ప్రతి శుక్ర, శనివారాల్లో రద్దీ తీవ్రంగా ఉంటుంది. చాలామంది యాగంటి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత బేతంచెర్ల మండలం.. ఆర్ఎస్ రంగాపురం పరిధిలోని మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్తుంటారు. యాగంటి కొండల్లో 3 కి.మీ. మేర మలుపుల ప్రాంతం ఉంది. రక్షణ గోడ నిర్మించినప్పటికీ



కొన్ని ప్రాంతాల్లో దెబ్బతింది. ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పలువురు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

**ఎవరూ పట్టించుకోక..** మూడు నెలల కొందట ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ముందే మలుపులు.. దీనికితోడు రక్షణ గోడ అక్కడక్కడా దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. అయినప్పటికీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ మార్గంలో పలువురు వాహనదారులు వేగంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే అదుపు తప్పి లోయలో పడిపోయే పరిస్థితి. రక్షణ గోడలు కూలిపోయిన చోట రాళ్లు పెట్టి చేతులు దులిపేసుకోవడం గమనార్హం. దీనికితోడు వీధి దీపాలు కరవయ్యాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించేలా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ఫ్యూజు పోయినా చుక్కలే!

ఒంగోలు : విద్యుత్తు శాఖలో సిబ్బంది కొరత కారణంగా సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. చిన్నపాటి ఫిర్యాదుల పరిష్కారానికీ రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తప్పని నిరీక్షణ...** సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు మినహా గత పదేళ్లుగా ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరు విద్యుత్తు స్తంభం ఎక్కి మరమ్మతులు చేపట్టేందుకు వీల్లేదు. దీంతో




ఏ సమస్య తలెత్తినా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్ల కోసం నిరీక్షించక తప్పడం లేదు. సిబ్బంది కొరత కారణంగా వీరికి రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించారు. దీంతో వినియోగదారుల నుంచే వచ్చే ఫిర్యాదులను సరిగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఎనర్జీ అసిస్టెంట్లు సైతం పనిచేసే చోట నివాసం ఉండకపోవడంతో పల్లెల్లో రాత్రివేళ ఫ్యూజు పోయినా వేసేవారు కరవయ్యారు.

# మట్టిని మింగేస్తున్నారు!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. కొందరు నాయకుల అండతో చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ... నిత్యం వందలాది లారీల్లో తరలిస్తున్నారు. ఎవరైనా స్థానికులు అభ్యంతరం తెలిపితే దాడులకు తెగబడుతున్నారు. వై.పాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో ఈ దందా సాగుతోంది.

**ఆయకట్టుకు ముప్పు...**

పుల్లలచెరువు మండలం మల్లపాలెంలో నరజాముల తండా మధ్యలోని భీమలదిన్నె చెరువులో మూడు భారీ జేసీబీలను ఏర్పాటు చేసి... రోజుకు 300 నుంచి 350 ట్రిప్పర్ల మట్టిని అడ్డగోలుగా ఓ రహదారి నిర్మాణానికి తరలిస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఈ దోపిడీ సాగుతున్నా, స్థానికులు



అభ్యంతరం తెలుపుతున్నా అధికారులు మాత్రం ఇటుగా కన్నెత్తి చూడడం లేదు. ఈ వ్యవహారంలో మండల స్థాయి నాయకుడొకరు అంతా తానై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువు కింద దాదాపు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుత తవ్వకాలతో నీరు నిలవక సేద్యం సాగించలేని దుస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్కరూ పట్టించుకోరు...**

త్రిపురాంతకం, వై.పాలెంలోని పెద్ద చెరువులతో పాటు మురారిపల్లె, మరికొన్ని గ్రామాల్లోని జల వనరుల్లోనూ మట్టి దోపిడీ సాగుతోంది. ఆయా శాఖల వారీగా మామూళ్లు వెళ్తుండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ రాంబాబును సంప్రదించగా... జేఈతో పరిశీలన చేయించి మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రిస్తామని తెలిపారు.

# ఎట్టకేలకు కాలువలకు కొత్త కళ

ఒంగోలు : ఎన్నో ఏళ్ల రైతుల ఎదురుచూపులు ఫలించాయి. ఎట్టకేలకు సాగర్ కాలువల కట్టలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో కనీసం చిల్ల చెట్లు కూడా తొలగించకపోవడంతో కట్టలు రూపురేఖలు కోల్పోయాయి.ఒంగోలు బ్రాంచి ప్రధాన కాలువతో పాటు వివిధ మేజర్, మైనర్ కాలువల పరిధిలో ప్రస్తుతం చురుగ్గా పనులు జరుగుతున్నాయి. 2024లో కొత్త ప్రభుత్వం సాగర్ అద్దంకి బ్రాంచి తదితర మేజర్ కాలువల మరమ్మతులు నిర్వహించింది. అయితే అప్పట్లో సకాలంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపకపోవడంతో ఓబీసీ పరిధిలో పనులు చేపట్టలేదు. దీనిపై పలు వార్తలు ప్రచురితం కావడంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. **రూ.5.2 కోట్లతో..** : ఓబీసీ పరిధిలో దర్శి, చీమకుర్తి, సంతనూతల పాడు, ఒంగోలు సబ్ డివిజన్ల పరిధిలో సుమారుగా రూ.5.2 కోట్లతో 89 పనులు ప్రతిపాదించి కాలువల



కట్టలపై చిల్ల చెట్లు, కాలువల్లో పూడిక తొలగింపు చేపడుతున్నారు. ఓబీసీ పరిధిలో చీమకుర్తి నుంచి రామతీర్థం జలాశయం వరకు కొద్ది నెలల కిందట ప్రవాస భారతీయు లు నల్లూరి శేషయ్య సహకారంతో ఒకవైపు కట్టపై చిల్లచెట్లు తొలగిం చారు. ప్రస్తుతం రెండోవైపు కట్టపైన వ్యర్థాలు, చిల్లకంప తొలగిస్తున్నా రు. ఒంగోలు బ్రాంచి కాలువ, చీమకుర్తి ఒకటి, రెండు, కారుమంచి మేజర్ కాలువ కట్టలపై గ్రానైట్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో పనుల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. త్వరలో రామతీర్థం నుంచి దిగువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేశారు.

# ప్లాట్లు.. ఇవేం పాట్లు..!

సర్పవరం : కాకినాడ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెకానిక్ షెడ్‌లను తరలించేందుకు నాటి ప్రభుత్వం 1993లో ఏపీఐఐసీ ద్వారా సర్పవరంలో 18 ఎకరాల భూమి సేకరించి ంది. 2000లో ఏపీఐఐసీ నుంచి ప్లాట్ల యజమానులు కొనుగోలు చేసిన భూమిలో ఆటోనగర్ ఏర్పడింది. 2016 నుంచి సుమారు 7.62 ఎకరాల భూమిని దేవాదాయశాఖ 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు నిలిపివేశారు. అప్పట్నుంచి ఆస్తులున్నా.. ఇక్కడి వారంతా పేదలుగానే మిగిలిపోయారు.

**వేర్వేరు సర్వేనంబర్ల నమోదుతో ఇబ్బందులు**

ఈ భూములకు రెవెన్యూశాఖ సర్వే నంబరును 104/2 గా నమోదు చేయగా, ఏపీఐఐసీ ఆటోనగర్ యజమానులకు అమ్మినప్పుడు సర్వే నంబరును 104–పార్టుగా నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయడంతో వివాదం మొదలైంది. సర్వే నంబరు 104 దేవాదాయశాఖ నిషేధిత జాబితాలో ఉండడంతో 2016 నుంచి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి, 7.62 ఎకరాల్లో సుమారు 60 మంది వాహనాల మరమ్మతుల షెడ్లు, స్పేర్ పార్టులు, చిన్నపాటి పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ప్లాట్లు అమ్ముకునేందుకు, బ్యాంకు రుణాల తాకట్టుకు పనికిరావడం లేదని వాపోతున్నారు. ఇక్కడే సర్పవరం భావనారాయణస్వామి ఆలయానికి చెందిన భూములు కూడా ఉండడం వివాదానికి కారణమైంది. సర్వే నంబరు 104లో 8.05 ఎకరాలు, 122లో 5.5 ఎకరాలు, 105/4లో 0.38 ఎకరాలు ఉన్నాయి.**అప్పు పుట్టడం లేదు..** – పెమ్మాడి శ్రీనివాసకుమార్‌మాకు ఇచ్చిన ప్లాట్లున్న భూమిని 2016లో దేవాదాయశాఖ నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. భూహక్కులేక బ్యాంకు రుణాలూ పుట్టడం లేదు. వ్యాపారాలు సరిగా లేవని ప్లాట్లను అమ్ముదామన్నా కుదరడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం ఉండడం లేదు. **సంయుక్త సర్వేతో పరిష్కారం**– ఎ.రమణారెడ్డి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, కాకినాడ ఆటోనగర్ భూములను దేవాదాయశాఖ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని లేఖలు రాశాం. రెవెన్యూ, ఏపీఐఐసీ, దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేయించాలని కలెక్టర్ కోరారు. త్వరలోనే పరిష్కారం చూపుతాం.

# చవితి వేడుకలు ఎలా స్వామి?



అయినవిల్లి : అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఏటా జిల్లానుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. వీరికి తగిన సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నెల 27 నుంచి చవితి వేడుకలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు దర్శనానికి వచ్చే వారికి అనుగుణంగా సరైన ఏర్పాట్లపై సందేహం వ్యక్తమవుతోంది. ఆలయ ఏసీ సత్యనారాయణరాజు గత నెలలో సెలవుపై వెళ్లారు. ద్రాక్షారామ ఆలయ ఏసీ వెంకటదుర్గాభవాని ఇన్‌ఛార్జ్ బాధ్యతలు తీసుకున్నా పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది.

**ఇవీ సమస్యలు**

క్యూలైన్లు ఇరుగ్గా ఉన్న కారణంగా సాధారణ రోజుల్లోనే దర్శనానికి గంటల తరబడి సమయం పడుతుంది. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

దూరప్రాంతాల నుంచి వచ్చేవారు తమ వాహనాలను ప్రధాన రహదారిపైన నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. చిరువ్యాపారులు రహదారి అంచులు ఆక్రమించి కొబ్బరికాయలు, ఇతర పూజా సామగ్రి విక్రయాలు సాగిస్తున్నారు.

ఆటోలు సైతం అక్కడే నిలిపివేయడంతో రహదారి మరింత ఇరుగ్గా మారింది. సమీపంలో బైపాస్ ఉన్నప్పటికీ భారీ వాహనాలను అటువైపు మళ్లించే ప్రయత్నాలు చేయకపోవడంతో సమస్యకు కారణమవుతుంది.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేగనియంత్రికలు ఎత్తుగా ఉన్న కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుతం ఉన్న పార్కింగ్ స్థలం వర్షం వస్తే బురదగా మారి అడుగేయలేని పరిస్థితి.

# గుమ్మం దాటితే గుండెల్లో దడదడ..



రాజమహేంద్రవరం జిల్లాలోని పురపాలికల్లో వీధి కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా రోడ్డుపై కనిపించిన వారందరిపై దాడులకు దిగుతున్నాయి. అర్బన్ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీసం రోజుకు 10 నుంచి 15 మంది వరకూ బాధితులు రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏకంగా 30 నుంచి 40 కుక్క కాటు కేసులు వస్తున్నాయి. వీరిలో పిచ్చికుక్కల బారినపడిన వారూ ఉంటున్నారు. గత ఐదేళ్లతో పోలిస్తే ప్రస్తుతం వీధి కుక్కల సంఖ్య రెట్టింపు పెరిగినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వంలో వీటి నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్ర చికిత్సల విషయంలోనూ ముందుకెళ్లలేదు. వీటితోపాటు వ్యాక్సినేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా సైతం విడుదల చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. ఇటీవల జిల్లాలో ఏబీసీ శస్త్ర చికిత్సల నిమిత్తం 19,218 వీధి కుక్కలను గుర్తించగా, వాటిలో 6635 వాటికి మాత్రమే ఆపరేషన్లు పూర్తి చేశారు. కనీసం జిల్లాలో 30 శాతం మేర పైబడి ఆపరేషన్లు జరగని పరిస్థితి ఏర్పడింది.

**కోర్టు సూచనలతో..**

అర్బన్ ప్రాంతాల్లో వీధి కుక్కల నియంత్రణలో చర్యలు తీసుకోవాలని తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను విడుదల చేయాల్సి ఉంది. వాస్తవానికి జంతు రక్షణ విభాగం ద్వారా పురపాలికల్లో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిత్యం ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఏబీసీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు విడుదల చేయాలి. ప్రస్తుతం కొత్త మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, నియంత్రణపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. కేంద్రం పూర్తిస్థాయిలో స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# సంతేబిదనూరులో 'ఆయుష్' తీశారు



హిందూపురం : ప్రాచీన ఆయుర్వేద వైద్యానికి ఇటీవల కాలంలో ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అందులో భాగంగా లక్షలాది రూపాయలతో వెచ్చించి హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను నిర్మించారు. పంచకర్మ వంటి చికిత్సలు అవసరమైన పరికరాలను, ఇతరత్రా వస్తువులను కొనుగోలు చేసి ఆసుపత్రికి సరఫరా చేశారు. ఆసుపత్రిలో వీటి ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షలు వెచ్చించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చొరవ చూపడంతో ఆసుపత్రి సుందరంగా రూపుదిద్దుకొంది. ఎలాంటి ప్రచారం లేకపోయినా వైద్యం పొంది, ఉపశమనం పొందిన వారిలో ఒకరి నుంచి మరొకరికి ఇలా ఇక్కడి వైద్య సేవలు గురించి తెలియడంతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరిగింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఏడాదికి ఆసుపత్రికి రూ.12 లక్షలు విలువైన మందులు సరఫరా అవుతున్నాయి. ఇక్కడి వైద్యం, సౌకర్యాల కారణంగా రాయలసీమలోనే సంతేబిదనూరు ఏకైక ఆయుర్వేద వైద్యశాలగా తలమానికంగా మారింది. ఇక్కడే గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన అధికారితో పాటు అనేక మంది అధికారులు, ప్రముఖులు వైద్యం చేయించుకొన్నారంటే ఇక్కడ ఎలాంటి వైద్య సేవలు అందాయి అనడానికి ఉదాహరణగా నిలుస్తాయి.

**డిస్పెన్సరీలకు పది లోపే రోగులు**

వైకాపా ప్రభుత్వం హయాంలో ఆయుష్ వైద్యుల నియమాకాలు చేపట్టలేదు. దీంతో జిల్లాలో వైద్యులు లేక అనేక ఆయుర్వేద డిస్పెన్సరీలు ఖాళీగా ఉన్నాయి. సాధారణంగా డిస్పెన్సరీలకు 10 మంది లోపు రోగులే వైద్యానికి వస్తారు. ఇవేమి ఆలోచించకుండా, ఏమీ పట్టించుకోకుండా ఆయుష్ విభాగంలో పని చేసే వైద్యులను, సిబ్బంది బదిలీలలను ఉన్నతాధికారులు జూన్‌లో నిర్వహించారు. దీంతో ఇక్కడ పనిచేసే వైద్యురాలు సైతం చిన్న సెంటర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులకు సేవలు దూరమయ్యాయి. తమ ఆసుపత్రికి వైద్యులను నియమించడం లేదా, బదిలీ అయిన వైద్యురాలిని డిప్యూటేషన్‌పై పంపాలని స్థానికులు, రోగులు ఆందోళనకు దిగినా వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు.

**వైద్యురాలి బదిలీ కావడంతో..**

ఈ ఆయుర్వేద వైద్యశాలలో ఒక్క వైద్యురాలు, కాంపౌండర్, ఇద్దరు థెరపిస్టులు, ఇద్దరు యోగా శిక్షకులు పని చేసేవారు. అయితే వైద్యురాలు, కాంపౌండర్ రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. దీంతో వైద్యం చేసేవారు, మందులు అందించే వారు లేక ఒక్కసారిగా వైద్య సేవలు నిలిచిపోయాయి.

**వెనుదిరిగిపోతున్నా..**

– జయసుధ, మడకశిర

నేను రుమాటాయిడ్ అర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నా. అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొన్నా నయం కాకపోవడంతో కొన్నేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాను. మంచి చికిత్సలు చేశారు. మళ్లీ చికిత్స కోసం వస్తే డాక్టర్ లేరని చెప్పారు. వెనుదిరిగి వెళ్తున్నాను. వెంటనే డాక్టర్‌ను నియమిస్తే బాగుంటుంది.

# వైకాపా కక్ష.. కూటమి రక్ష



కాకినాడ : తెదేపా ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన వివిధ పనులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కక్షకట్టింది. పూర్తయిన పనులకు బిల్లులు ఆన్‌లైన్‌లో పొందుపర్చినా తీసేసింది. తెదేపా ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకూడదనే దురుద్దేశంతో ఆపేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రానీయకుండా చిన్న గుత్తేదారులను ఇబ్బందుల పాలు చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే ఈ బిల్లులపై దృష్టిసారించింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సారథ్యంలో గత తెదేపా ప్రభుత్వంలో పూర్తయిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించడానికి మార్గం సుగమం చేసింది. డ్వామా అధికారుల ద్వారా అప్పట్లో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను తయారు చేయించి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయించారు. త్వరలో వీటిని చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. **6,818 పనులు పూర్తయినా..** కాకినాడ జిల్లాలో 2014–19 మధ్య జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో 6,818 పనులు పూర్తి చేశారు. ఆరు నియోజకవర్గాలు, మూడు మండలాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, సంపద సృష్టికేంద్రాలు, పశువుల షెడ్లు, వర్మీకంపోస్టు యార్డులు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి పనులు పూర్తి చేశారు. వీటికి సంబంధించి రూ.5,01,76,704 బిల్లులు చెల్లించలేదు. గుత్తేదారులు గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. చాలా మంది అప్పులు పాలయ్యారు. కూటమి చొరవతో వీరందరికీ త్వరలో బిల్లులు నేరుగా చెల్లించనున్నారు.

# దుర్గం టు బిహార్

కళ్యాణదుర్గం: కొందరు అక్రమార్కులు కలపను యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వృక్ష సంపదను సంరక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలు రకాల చెట్లకు సంబంధించి కలప లారీల్లో బిహార్‌లోని పేపర్ మిల్లులు, ఇతర పరిశ్రమలకు లారీల్లో తరలిపోతోంది. కొందరు దీన్నే ఆదాయ వనరుగా మార్చుకుని దందా కొనసాగిస్తుండటం గమనార్హం. కళ్యాణదుర్గం నుంచి బిహార్‌కు 1,970 కిలోమీటర్ల దూరం.. సుమారు 32 నుంచి 38 గంటల సమయంలో చేరుకొంటారు. కళ్యాణదుర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు ఏడు లారీల్లో కలపను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇక్కడి వాటికి గిరాకీ

స్థానిక కలపకు ఇతర రాష్ట్రాల్లో గిరాకీ ఉండడంతో అనుమతులు లేకుండా కొందరు అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తున్నారు. ఇతర



రాష్ట్రాల వ్యాపారులతో ఉన్న ఒప్పందాల మేరకు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకొని... స్థానికంగా కొనుగోలు చేసిన దుంగలను కళ్యాణదుర్గంలోని వ్యాపారులకు చేరుస్తారు. వాటిని కొన్నాళ్లపాటు నిల్వచేసి ఒక్కో లారీలో 20 నుంచి 25 టన్నుల మేరకు లోడ్‌చేసి తరలిస్తున్నారు. చెట్ల రకాలు, దుంగల బరువు, సైజును బట్టి ధర నిర్ణయిస్తారు. టన్నుకు రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతోంది.

**అనుమతులు లేకుండానే...**

చెట్లు నరకాలంటే తహసీల్దారు, అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి, ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు టన్నుకు కొంత మొత్తం ప్రభుత్వానికి చెల్లించాకే అనుమతులు జారీ అవుతాయి. వ్యాపారులు నిబంధనలు పట్టించుకోకుండా యథేచ్ఛగా చెట్లను నరికి అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

**పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం**

– రామచంద్రుడు, ఇన్‌ఛార్జి రేంజర్, అటవీశాఖ

వ్యవసాయ క్షేత్రాలు, పట్టా భూముల్లో చెట్లు నరకాలన్నా.. సదరు రైతు పట్టాదారు పాసుపుస్తకం తీసుకొచ్చి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అటవీ, రెవెన్యూ శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. ఎవరైనా వాటిని అతిక్రమించి చెట్లను నరికినా, ఇష్టానుసారంగా వ్యవహరించినా కఠినచర్యలు తప్పవు. కలప అక్రయ వ్యాపారం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఆక్రమణలు.. ఊర చెరువంత!

ఒంగోలు: ఒంగోలు నగరం నడిబొడ్డున రూ.వందల కోట్ల విలువైన స్థలం ఆక్రమణలో ఉన్నా అధికార యంత్రాంగం కిమ్మనడం లేదు. ఎకరాల మేర భూమి పరాధీనమైనా పట్టించుకోవడం లేదు. పేదలు పాకలు వేసుకుని తలదాచుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ... కొందరు బడాబాబులు దుకాణాలు నిర్మించి రూ.వేలకు వేలు అద్దెలు వసూలు చేస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు, కొందరు అధికారులు, వ్యాపారులు ఇందులో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమాలు నిగ్గుతేల్చినా...**

అప్పట్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ఊరచెరువు కాలక్రమంలో ఆక్రమణలకు గురైంది. ఏళ్ల క్రితం కొందరు పేదలు ఇక్కడ తలదాచుకోవడంతో అప్పట్లో పట్టాలు ఇచ్చారు. ఈ క్రమంలో పేదల మాటున కొందరు పెద్దలు ఆక్రమణలకు తెరలేపారు. పట్టా ఇచ్చిన స్థలానికి రెండు మూడింతల ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించారు. నగరం నడికూడలిగా మారడంతో ఇతర పట్టా స్థలాలను సైతం కొనుగోలు చేసి వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వాటిని



అద్దెలకు ఇచ్చి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. వాస్తవానికి పట్టా స్థలంలో నిర్మాణానికి నగర పాలక సంస్థ అనుమతులు ఉండవు. దీంతో ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. ఆక్రమణలు తారస్థాయికి చేరడంతో పదేళ్ల క్రితమే అవినీతి నిరోధక శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఉన్న భవనాలు, ఆక్రమణలెన్ని తదితర అంశాలను విచారించి నివేదిక అందజేశారు. అప్పట్లోనే 108 అనధికార నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించి... చర్యలకు సిఫారసు చేశారు. పట్టాలిచ్చిన స్థలం కంటే రెండింతలు ఆక్రమణదారుల చెరలో ఉంది. ఈ విషయమై కొందరు కోర్టులను సైతం ఆశ్రయించారు.

**పైసా ఆదాయం లేదు...**

పట్టా స్థలంలో భారీ భవంతులు నిర్మించినా... నిర్మాణ పనుల రూపేణా నగర పాలక సంస్థకు రూపాయి ఆదాయం వచ్చింది లేదు. రేకుల షెడ్లుగా చూపి సాధారణ పన్నులు సైతం అరకొరగానే చెల్లిస్తున్నారు. మరోవైపు అద్దెలు మాత్రం భారీగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఊర చెరువులో ఖాళీగా ఉన్న స్థలాన్ని క్రీడా మైదానంగా వినియోగించేందుకు ఓ అడుగు ముందుకు పడింది. పరాధీనమైన భూముల పరిరక్షణకూ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కష్టాలే వసతి.. కన్నీళ్లే గతి

నంద్యాల : పెచ్చులూడుతున్న భవనాలు.. ఒక్కో గదిలో లెక్కకు మించి 'వసతి'.. కటిక నేలపై నిద్ర.. కాలకృత్యాలకు అవస్థలు.. ఆరుబయట స్నానాలు.. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోవడంతో విద్యార్థుల వసతికి గ్రహణం పట్టింది.. దీన్ని గమనించిన 'కూటమి' ప్రభుత్వం మార్చిలో నిధులిచ్చింది. సంక్షేమ వసతి గృహాలు (గిరిజన, ఎస్సీ, బీసీ) కలిపి 31 వరకు ఉన్నాయి. వీటి ఆధునికీకరణకు ప్రభుత్వం రూ. 8.21 కోట్లు విడుదల చేసింది. వీటితో మరుగుదొడ్లకు మరమ్మతులు, నీటి సౌకర్యం, గదుల్లో దీపాలు, పంకాలు బిగించడం, దోమలు రాకుండా కిటికీలకు జాలీలు, తలుపులకు మరమ్మతులు, పైకప్పు, ఫ్లోరింగ్‌ను బాగు చేయాల్సి ఉంది. బాలికల వసతి గృహాలకు ప్రహరీలు కచ్చితంగా నిర్మించారు. నిధులున్నా అధికారులు పర్యవేక్షణ కొరవడింది.. గుత్తేదారులు పనులు వేగవంతం చేయడం లేదు. ఇప్పటి వరకు 60 శాతమే పూర్తి చేశారు.. దీంతో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చిన్న గది.. 12 మంది జిల్లా కేంద్రంలో బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉంటున్నారు. రేకుల షెడ్డుతో కూడిన ఈ గదిలో 12 మందికి వసతి కల్పించారు. చోటు చాలక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మూడే మరుగుదొడ్లు ఉన్నాయి. ఆరుబయటే స్నానం చేస్తున్నారు. గదుల్లో పైకప్పు పెచ్చులూడి కింద పడుతోంది.

**మంచాలు మడతపెట్టేశారు**



మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో 60 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ నాలుగు గదులే ఉన్నాయి. చోటు చాలక 70 మంచాలు పక్కన పడేశారు. అవన్నీ తుప్పుపట్టి పోతున్నాయి.

**విభజించి.. అప్పగించి**

2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా వసతి గృహాల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలాల వారీగా విభజించి వివిధ శాఖలకు పనులు అప్పగించారు. జిల్లాలోని 20 మండలాల్లోని 31 వసతి గృహాలను ఏపీఈడబ్ల్యూఐడీసీ, సమగ్రశిక్షా అభియాన్, ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ కట్టబెట్టింది.

మార్చిలో పనుల ప్రారంభించి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. గడువు దాటి నెల గడిచినా పనులు పూర్తి కాలేదు. నిధులు గత ఆర్థిక సంవత్సరం పద్దుల్లో చేర్చకపోవడంతో ఇబ్బంది తలెత్తింది.ప్రస్తుతం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి కేటాయింపులు చేసే విధంగా ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవడంతో ఇటీవల పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

పనుల్లో నాణ్యత కరవైంది. ప్రత్యేకించి మరుగుదొడ్లలో వేసిన కుళాయిలు నాసిరకంగా ఉన్నాయి.

# కూలిన ధ్వజస్తంభం.. ఆగిన స్వామి కల్యాణం

నంద్యాల : నల్లమలలో కొలువుదీరిన స్వయంభూ శ్రీచెంచు లక్ష్మీమహాలక్ష్మీ సమేత సర్వనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రతి నెలా పౌర్ణమి రోజున, స్వామి జన్మనక్షత్రమైన స్వాతి.. నాడు ఉత్సవాలు జరిపించడం ఆనవాయితీ. నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారిలో వెలసిన ఈ ఆలయానికి నంద్యాల, కర్నూలు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. 2018లో ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభం భారీ వర్షాలతో కూలిపోయింది. పునర్నిర్మించకపోవడంతో ప్రతి జరిగే స్వామి వారి కల్యాణం ఏడేళ్లుగా ఆగిపోయింది.

**మూలుగుతున్న రూ.1.80 కోట్లు**

మౌలిక వసతుల కల్పనకు దేవాదాయశాఖ రూ.20 లక్షలు విడుదల చేసింది. ఆలయం ముందుభాగంలో కూలిపోయిన రాతికట్టడం, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు తిరుమల తిరుపతి దేవాస్థానం రూ.1.6 కోట్లు మంజూరు చేసింది. ప్రహరీ, ఇతర నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో కొంతమేర రక్షణగోడ కూలింది. మూడేళ్లవుతున్నా పనులు అరకొరగానే చేపట్టారు. ప్రస్తుతం దేవస్థాన ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కానరావడం లేదు.



**రూ.23 లక్షల ఆదాయం**

శ్రీసర్వలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కేటగిరి6(బి)లో ఉంది. ఇక్కడ ఇద్దరు అర్చకులు, ఒక కాపలాదారు, పారిశుద్ధ్య కార్మికురాలు, ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. ఆలయ భూమి 19.41 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. దేవస్థానం మొత్తం ఆదాయం రూ.23.11 లక్షలు కాగా.. ఇందులో భూముల ద్వారా రూ.2.34 లక్షలు, హుండీల ద్వారా రూ.12.8లక్షలు, సేవా టికెట్స్ ద్వారా రూ.1.5 లక్షలు వస్తున్నాయి. ఇందులో దేవస్థాన సిబ్బంది జీతాలకు రూ.5.28లక్షలు చెల్లిస్తున్నారు. ఫిక్స్ డిపాజిట్లు 10 ఉండగా, వాటి విలువ రూ.35.95 లక్షలు , 113 గ్రాములకు పైగా బంగారు, 10 కిలోలకు పైగా వెండి ఉంది.

**అటవీ శాఖ అనుమతులిస్తే**

- నరసయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి

గతంలో దేవస్థానానికి సంబంధించిన డిజైన్ మార్చడంతో పనులు నెమ్మదించాయి. తర్వాత వేగవంతంగా జరుగుతున్న సందర్భంలో అటవీశాఖ ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధి పనులను ఆపాల్సి వచ్చింది. ప్రస్తుతం అటవీశాఖ ఉన్నతాధికారులకు విన్నవించాం. వారి నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తాం.

# వెనుకబడిన పర్యవేక్షణ



రోలుగుంట : జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆ ప్రభావం హాస్టళ్లలోని విద్యార్థులపై పడుతోంది. గత్యంతరం లేక రెండు, మూడు వసతిగృహాల పర్యవేక్షణు ఒకరే చూస్తున్నారు. ఈ కారణంగా వసతిగృహాలపై సమీక్షల మొదలుకుని పిల్లలపై విద్యాపరమైన పర్యవేక్షణ లోపిస్తోంది. రోజూ రాత్రి చదువులను కొనసాగించడం, పరీక్షల నిర్వహణ వంటి కార్యక్రమాలకు ఇబ్బంది తలెత్తుతోంది.

జిల్లాలో 39 ప్రీమెట్రిక్, 12 పోస్టుమెట్రిక్ వసతిగృహాలున్నాయి. నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, అనకాపల్లి, పాయకరావుపేట ప్రాంతాల్లో సహాయ బీసీ సంక్షేమాధికారులు వీటి బాధ్యతను చూస్తున్నారు. ఎక్కడా సరిపడా స్థాయిలో వార్డెన్లు లేరు. మాడుగుల, అప్పలరాజుపురం హాస్టళ్ల బాధ్యతలు ఒక్కరే చూస్తున్నారు. కె.కోటపాడు మండలం మల్లునాయుడుపాలెం, రాములమ్మపాలెంతోపాటు దేవరాపల్లి, కె.కోటపాడులోనూ ఇదే పరిస్థితి. కింతలి, కొరువాడ హాస్టళ్లకు రాజునాయుడు వార్డెన్‌గా వ్యవహరిస్తున్నారు.

పూడిమడక, అనకాపల్లిలోని ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు ఎస్.సత్యనారాయణ... చోడవరంలోని బాలికల పోస్టుమెట్రిక్, మాడుగుల వసతిగృహాలకు దేవి మేట్రిన్‌గా కొనసాగుతున్నారు. రావికమతం ప్రీ మెట్రిక్, చీడికాడ ఎస్సీ హాస్టల్ బాధ్యతలు ఒకరే చూస్తున్నారు.

గోవాడ, వడ్డాది, బుచ్చెయ్యపేట మూడింటికి వెంకటరమణ వార్డెన్‌గా... ఎస్.రాయవరం, ఎలమంచిలిలోని హాస్టళ్లకు అప్పలనాయుడు వార్డెన్‌గా కొనసాగుతున్నారు. నాతవరం, రోలుగుంట హాస్టళ్లను ఒక్కరే పర్యవేక్షిస్తున్నారు. ఇవి కాకుండా నర్సీపట్నం మండలం వేములపూడి, కోటవురట్ల, భీమిలి ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఉన్నాయి. నర్సీపట్నం, పాయకరావుపేట (బాలికల పోస్టు మెట్రిక్), పెద్దూరు రత్నంపేటలోని ప్రీమెట్రిక్ వసతిగృహాలను భవాని పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఒక్కో వార్డెన్, మేట్రిన్ రెండు, మూడు పర్యవేక్షించాల్సి వస్తోందని.. దీనివల్ల ఏ హాస్టల్‌కూ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డెన్ల పోస్టుల భర్తీలో కొనసాగుతున్న జాప్యం విద్యార్థుల పట్ల శాపంగా **మారుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఈవిషయమై అనకాపల్లి బీసీ సంక్షేమాధికారి శ్రీదేవితో మాట్లాడుతూ వార్డెన్ల కొరత సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందన్నారు. ఇటీవలే జిల్లాలో పర్యటించిన ప్రధాన కార్యదర్శికి ఈ సమస్య వివరించామని.. త్వరలోనే ఖాళీల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు.

# ఇక్కడ బోధన.. అక్కడ భోజనం



పి.గన్నవరం: గత వైకాపా ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. కొన్నిచోట్ల ఖాళీ అయిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ తదితర విభాగాలు ఏర్పాటుచేయడంతో 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల నుంచి తిరిగి యథాస్థానానికి వచ్చాయి. పి.గన్నవరం పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. పలువురు చిన్నారుల వెతలు కనిపించాయి.

పి.గన్నవరం బాలయోగికాలనీ సమీపంలో ఉన్న ఎంపీ ప్రాథమిక పాఠశాలకు సంబంధించి 3, 4, 5 తరగతులను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఇక్కడ 1, 2 తరగతులకు 24 మంది విద్యార్థులు మిగిలారు. తరగతి గదులు ఖాళీగా ఉండటంతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఏర్పాటు కావడంతో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 68 మంది చదువుతున్నారు. అయిదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గదుల కొరత కారణంగా రెండు అంగన్‌వాడీ కేంద్రాలను వరండాలో నిర్వహిస్తున్నారు. ఈ సమస్యలను ఎంఈవో కోన హెలీనా వద్ద ప్రస్తావించగా, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముంగండలోని ఎంపీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం కావడంతో ఒకటి, రెండు తరగతుల్లో 22 మంది విద్యార్థులు మిగిలారు. కూటమి ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలగా గుర్తించి 1 నుంచి 5 తరగతులకు అయిదుగురు ఉపాధ్యాయులను నియమించింది. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడున్న భవనంలోని ఒక గదిలో, వరండాలోనే వీరికి తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ప్రార్థన అనంతరం 3, 4, 5 తరగతుల విద్యార్థులను 200 మీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలకు తీసుకువెళ్లి బోధిస్తున్నారు. మళ్లీ మధ్యాహ్న భోజనం కోసం ప్రధానరహదారి మీదుగా ప్రాథమిక పాఠశాలకు తీసుకొస్తున్నారు. భోజనం అనంతరం మళ్లీ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లడం నిత్యకృత్యమైంది. రాష్ట్ర రహదారి కావడం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో విద్యార్థులను అటు, ఇటు తిప్పడానికి ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

# ఆ తరుగు ఎవరి ఖాతాల్లోకి!



అమలాపురం: చౌకధరల దుకాణాలకు పౌరసరఫరాల సంస్థ గోదాముల నుంచి సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో తరుగు వస్తోందని రేషన్ డీలర్లు వాపోతున్నారు. దీంతో ప్రతినెలా నష్టపోతున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

**వాస్తవానికి తేడా..**వాస్తవానికి 50 కిలోల బస్తా సంచితో కలుపుకొని 50.560 కిలోల బరువు ఉండాలి. కానీ 46.250, 47.600 కిలోలు ఉంటున్నాయి. గతంలో 50 కేజీల చొప్పున తూచి ఇచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టరుపై 50 బస్తాలు అంటే 2.5 మెట్రిక్ టన్నుల వరకు ఉంచి తూకం వేస్తున్నారు. మొత్తం మీద 30 నుంచి 40 కేజీల వరకు తరుగు సాధారణం అవుతోంది. దీనికి మించి ఒక్కోసారి 60 నుంచి 75 కేజీల వరకు తగ్గుతోంది. ఉండాల్సిన నిల్వల కన్నా తక్కువ ఉండటంతో వాటిని పక్కదారి పట్టించినట్లు అభియోగాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డీలర్లు వాపోతున్నారు.

**పలు ఆరోపణలు**

ప్రభుత్వ గోదాముల్లో పనిచేస్తున్న కొందరు కుమ్మక్కై మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఎంఎల్ఎస్( మండల లెవల్ స్టాక్ పాయింట్)లకు, అక్కడి నుంచి డీలర్లకు బియ్యం సరఫరా చేస్తున్నారు. కార్డుదారుడికి విడిగా తూకం వేసి ఇచ్చే సమయంలో ప్రతి బస్తాకు కిలో కచ్చితంగా తరుగు వస్తుంది. దీనిపై అధికారులు ఫిర్యాదు చేసినా తరువాత నెల సరఫరా చేస్తామని చెబుతున్నారే తప్ప ఇవ్వడం లేదని వాపోతున్నారు.

కోనసీమ జిల్లాలో ఇదీ లెక్క

రేషన్ దుకాణాలు : 926

కార్డుదారులు : 5,37,902

ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యం : 7 వేల మెట్రిక్ టన్నులు

ఎంఎల్ఎస్‌పీలు : 6

గోదాముల సంఖ్య : 9

తూకం వేసే ఇస్తున్నాం..: శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ప్రతినెలా మండల స్థాయి స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో తూకం వేసిన తరువాతే బియ్యం సరఫరా చేస్తున్నాం. కొత్తగా 3.5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న కంప్యూటర్ ఆధారిత బరువు యంత్రాన్ని ఏర్పాటు చేశాం. డీలర్‌కు అవసరమైన మొత్తం స్టాకు ఒకేసారి తూకం వేస్తున్నాం. దీంతో తరుగుకు అవకాశం ఉండదు.

# నాడు నిర్లక్ష్యపు నీడ.. నేడు ప్రగతి జాడ

విజయనగరం: పగిలిన గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. వర్షాకాలంలో లీకేజీలు.. నిర్వహణ లేని మరుగుదొడ్లు.. ఇదీ గత అయిదేళ్లుగా సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల దుస్థితి. వీటి నిర్వహణకు గత ప్రభుత్వం నిధులివ్వలేదు. శిథిల భవనాల్లో చదివేందు కు విద్యార్థులు నిత్యం భయపడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని 30 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 23 భవనాల మరమ్మతులకు రూ.4.67 కోట్లు మంజూరు కావడంతో మరమ్మతులు చేపడుతున్నారు.

**పురోగతిలో పనులు**

విజయనగరంలోని బాలుర కళాశాల వసతి గృహ ప్రధాన భవనం శిథిలావస్థకు చేరింది. పాత స్లాబు తొలగించి, కొత్త కిటికీలు, బోరు, తలుపులు, కిటికీల మరమ్మతులు, సెప్టిక్ ట్యాంకు, విద్యుత్తు తీగల మరమ్మతులకు రూ.27.30 లక్షలు విడుదల చేశారు. కలెక్టర్ రూ.75 వేలు అదనంగా మంజూరు చేశారు. 90 శాతం పని పూర్తయింది. విజయనగరంలోని కళాశాల బాలికల వసతి గృహం-3 మరమ్మతులకు రూ.23.10 లక్షలు, బాలిక వసతి గృహం-2కు రూ.22.30 లక్షలు మంజూరు చేశారు.



రామతీర్థం(బాలుర) హాస్టల్‌కు రూ.16.85 లక్షలు, గంట్యాడ(బాలుర)కు రూ.26.40 లక్షలు ఇచ్చారు.

గర్భాం బాలుర వసతి గృహం పనులు రూ.16.15 లక్షలతో పూర్తి చేశారు. గజపతినగరం బాలికల హాస్టల్ రూ.21.20 లక్షలతో, బొండపల్లిలో (బాలికలు)రూ.15.75 లక్షలతో, చీపురుపల్లి(బాలుర)లో రూ.18.25 లక్షలతో 80 శాతం పూర్తయ్యాయి. లోగిస ఐడబ్ల్యూహెచ్‌సీ వసతి గృహం పనులు రూ.20.35 లక్షలతో చేస్తున్నారు.

కొత్తవలసలో(బాలికలు) రూ.20.20 లక్షలు, (బాలుర) రూ.22.50 లక్షలు మంజూరు చేశారు. ఎల్.కోట (బాలుర)లో రూ.18.50 లక్షలతో, వియ్యంపేట(బాలుర)లో రూ.18.10 లక్షలతో పూర్తి చేశారు. సంతకవిటి మండలం గుల్ల సీతారామపురం (బాలుర)లో రూ.12.45 లక్షలతో, బొబ్బిలి (బాలుర)లో రూ.18.65 లక్షలు, (బాలికల)రూ. 14.65 లక్షలు, రామభద్రపురం ( బాలుర) రూ.18.15 లక్షలు, పెరుమాళి(బాలుర)కి రూ.22.65 లక్షలు మంజూరయ్యాయి.

నెలాఖరులోగా పూర్తి చేయిస్తాం..: అన్నపూర్ణ, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ తెర్లాం బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.24.15 లక్షలు మంజూరయ్యాయి. శిథిలావస్థలో ఉండటంతో పనులు చేసినా లాభం లేదని నిలిపివేశాం. రాజాం (బాలుర)కు రూ.38.80 లక్షలు, (బాలికల) రూ.17.35 లక్షలు, బాడంగి(బాలుర)కు రూ.22.15 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. ఈ నెలాఖరులోగా పూర్తి చేయిస్తాం.

# అద్దె కొంపే దిక్కు!

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలో పలు విభాగాలకు చెందిన కార్యాలయాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రధాన శాఖల్లో సైతం ఇదే పరిస్థితి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి చెందిన పక్కా భవనాలున్నా.. నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేసి వాటిని ఉపయోగించేందుకు వీలున్నా ఆ దిశగా చర్యల్లేవు. మరోవైపు చెల్లింపుల్లో వ్యత్యాసాలున్నాయనే ఆరోపణలున్నాయి.

**కేటాయించినా..**

నిరుద్యోగులకు అండగా ఉండే ఉపాధి కార్యాలయం తోటపాలెంలో ఉంది. 15 ఏళ్లుగా అద్దె చెల్లిస్తున్నారు. ఏటా రూ.1.90 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దీనిని మోడల్ కెరీర్ కేంద్రంగా మార్చారు. ఈమేరకు కొత్త భవనం సమకూర్చుకునేందుకు అప్పట్లో రూ.28 లక్షల వరకు కేటాయించింది. తొలుత కలెక్టరేట్‌లో ఇవ్వాలని భావించారు. అనంతరం పట్టించుకోకపోవడంతో పాత ప్రదేశంలోనే కొనసాగుతోంది. ప్రధాన కార్యాలయమైనా.. రెండు జిల్లాల్లో 13 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలున్నాయి. వీటిని పర్యవేక్షించే సమన్వయాధికారిణి కార్యాలయం కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ సమీపంలోని భవనంలో అద్దెకు నడుస్తోంది. ఈమేరకు నెలకు రూ.13 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇతర ఖర్చులు అదనం. కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ విభాగ కేంద్రాలదీ ఇదే పరిస్థితి.

**ఏళ్ల తరబడి అక్కడే..**

కార్మికశాఖ కార్యాలయం విజయనగరం కొత్తపేట రోడ్డులో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.2 లక్షలకు పైగానే వెచ్చిస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్, సహాయ డిప్యూటీ కమిషనర్, మరో అయిదుగురు సిబ్బంది ఉంటారు. మండల కేంద్రాల్లోని కొన్ని శాఖలు సైతం అద్దె కొంపల్లోనే మూలుగుతున్నాయి. ఉన్నతాధికారులకు లేఖలు రాసినా స్పందన లేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

**మరమ్మతుల్లేక..**

నగరంలోని మర్రిచెన్నారెడ్డి భవనంలో పలు గదులు నిరుపయోగంగా ఉన్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని అంబేడ్కర్ సామాజిక భవనం, రెడ్‌క్రాస్, సైనిక సంక్షేమ, కలెక్టరేట్ ఆవరణలో మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. వీటిని కేటాయిస్తే పెద్దఎత్తున నిధులు మిగులుతాయి.

# మార్కెట్లో జాడలేని అభివృద్ధి

పార్వతీపురం : పార్వతీపురం శివారు రాయగడ రోడ్డులోని మార్కెట్ కమిటీ కార్యాలయం శిథిలస్థితికి చేరింది. ఏళ్ల నాటి భవనం కావడంతో పెచ్చులూడుతోంది. గోడలు బీటలు వారాయి. వర్షాలు పడితే లోపలి గదుల్లో నీరు చేరుతోంది. కొత్త భవనం నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. 2022 జూన్‌లో శంకుస్థాపన చేశారు. అక్కడున్న పాత షెడ్లను తొలగించారు. యంత్రాలతో చదును చేసి, శిలాఫలకం వేశారు. అక్కడితో వదిలేశారు.

**రెండు సార్లు పిలిచినా..**మార్కెట్ కమిటీ ఆర్థికంగా ముందడుగు వేసేలా షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి పాలక వర్గం గతంలో తీర్మానం చేసింది. అందుకు సంబంధించిన నిర్మాణాల కోసం రూ.90 లక్షలు మంజూరు చేశారు. వైకాపా హయాంలో రెండు సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో కమిటీ ఆదాయం తగ్గిపోతోంది. ఆవరణలోని వేబ్రిడ్జి పాడై ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు కోసం చేసిన తీర్మానం కాగితాలకే పరిమితమైంది.

**ప్రతిపాదనలతో సరి..**

పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు ప్రాంతాల్లోని కమిటీలకు మార్కెట్ ఫీజు రూపంలో రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ప్రతిగా రైతులకు మెరుగైన సేవలు అందించాలి. సంతల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలి. రైతుల పొలాల నుంచి కల్లాలు, ఇతర ప్రాంతాలకు పంట ఉత్పత్తులను తరలించేందుకు రోడ్లు నిర్మించాలి. గత ప్రభుత్వ హయాంలో ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. ఆర్థికంగా ఆదుకోవడం సైతం గగనంగా మారింది.

గుత్తేదారులను పిలుస్తాం....గతంలో టెండరు పాడిన గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. అంచనా విలువలు మారే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఏఏ నిర్మాణాలు చేపట్టాలో అంచనాలు పంపిస్తాం.

# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు



తిరుపతి : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లాల్సిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఆదరణ కోల్పోయింది. గుత్తేదారులు పట్టించుకోకపోవడం.. వాహనాలు మరమ్మతుకు గురికావడం.. తక్కువ జీతాలకు చోదకులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వెళ్లే తల్లీబిడ్డలు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా అరవిందో సంస్థ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను నిర్వహిస్తోంది. ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డను ఇంటి వద్ద వదిలిపెడితే రూ. 859 చొప్పున గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం అందిస్తోంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో కొన్ని కొత్త వాహనాలను ప్రవేశపెట్టినా సరైన నిర్వహణ లేక మరమ్మతుకు గురయ్యాయి. కొన్నింటికి రోజువారీ మరమ్మతులు చేస్తేగాని కదలని దుస్థితి.

**నాలుగు నెలలుగా జీతాలందక**

తల్లీబిడ్డ వాహనాలను నడిపేందుకు చోదకులు ఎవరూ ముందుకు రావడం లేదు. నిర్వహణ సంస్థ నెలకు రూ. 7,870 వేతనం చెల్లిస్తోంది. వాటికి సక్రమంగా జమచేయకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటం తోడు ఉన్నవారిపై పనిభారం పెరిగింది.

**ఒకే వాహనంలో ఇద్దరేసి రోగుల తరలింపు**

తల్లీబిడ్డతోపాటు ఒక సహాయకురాలిని వాహనంలో తీసుకెళ్లాలి. కానీ ఒకే మార్గంలో ఇద్దరు రోగులు ఉంటే వారితోపాటు బిడ్డలు, సహాయకులను తరలిస్తున్నారు. చిన్నపాటి వ్యానులో ఆరేడుగురిని తరలించడం సురక్షితం కాదు. అయినా ఒకేసారి ఇద్దరిని తరలించి రెండు బిల్లులు ప్రభుత్వం నుంచి కాజేస్తున్నారు. రోగుల నుంచి చోదకులు అనధికార వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**మధ్యాహ్నంపైనే ఇంటికి**రోజువారీ 50-70 డిశ్చార్జులు జరుగుతుంటే.. అందరినీ మధ్యాహ్నం ఒంటి గంటపైనే బయటకు పంపుతున్నారు. ఆ సమయంలో అందరూ ఇళ్లకు పోయేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు లేక అవస్థలు పడుతూ.. ప్రైవేటు వాహనాలపై దృష్టి సారిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.**రెండు జిల్లాల్లో సేవలు ఇలా..**

మొత్తం వాహనాలు : 45 మూలనపడినవి : 13

-చోదకులు తిరుపతి 31 మందికిగాను 16 మంది

-చిత్తూరు జిల్లాలో 19 మందికి 14 మందే ఉన్నారు.

# అంతస్తులు తగ్గించి.. ఆదాయానికి గండి!

అనంతపురం : వైకాపా హయాంలో పుర అధికారులు ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో పనిచేశారు. నేతలు, వారి బంధువులకు చెందిన భవనాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. భవన నిర్మాణాలు పూర్తయినా అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించకుండా వదిలేశారు. మరికొందరి భవనాలకు సంబంధించి విస్తీర్ణం, అంతస్తులు తగ్గించి ఖజానాకు నష్టం చేకూర్చారు. ఉమ్మడి అనంత జిల్లాలోని 12 పురపాలికల పరిధిలో 1,736 నిర్మాణాలకు పన్ను నుంచి మినహా



యింపు ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో నిర్మాణాలు పూర్తయి ఆస్తి పన్ను కిందకు రాని భవనాలను అధికారులు గుర్తించారు. ఇందులో సగానికి పైగా భవనాలకు వైకాపా ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే ఆస్తి పన్ను విధించకుండా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**రూ.2.23 కోట్ల నష్టం**

భవన విస్తీర్ణం, అంతస్తులను తక్కువ చేసి చూపించి పన్ను విధించారు. దీంతోపాటు వందలాది వాణిజ్య భవనాలను నివాసాలుగా చూపి ఖజానాకు గండి కొట్టారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మున్సిపాలిటీల పరిధిలో 4,656 నిర్మాణాలకు విధించాల్సిన మొత్తం కంటే తక్కువ పన్ను వసూలు చేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 2.23 కోట్లు నష్టం వాటిల్లినట్లు సర్వేలో తేల్చారు.

**పన్నే లేకుండా..**

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 221 భవనాలకు ఆస్తి పన్ను విధించకుండా వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ధర్మవరం మున్సిపాలిటీలో 293 నిర్మాణాలకు పన్ను వేయలేదు. తాజాగా ఆయా భవనాలన్నింటికీ అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి వసూలు చేస్తున్నారు. 1,736 భవనాలకు కొత్తగా పన్ను విధించడం ద్వారా రూ. 71.47 లక్షలు అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

# కాళంగి ఉద్ధృతికి.. కట్టడేదీ?

సూళ్లూరుపేట: జిల్లాలో కీలకమైన నదుల్లో ఒకటైన కాళంగి తరచూ ఉగ్రరూపం దాల్చుతోంది. నదికి పలుచోట్ల గండ్లు పడగా శాశ్వత పనులు కరవయ్యాయి. తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు కోతకు గురవడంతో ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.కాళంగి పొర్లుకట్టలకు శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రభుత్వం 2008లో రూ. 58.47 కోట్లు మంజూరు చేయగా భూసేకరణ సమస్యలతో పనుల్లో జాప్యం జరిగింది. గుత్తేదారులు కొంతమేర పనులు చేసి వదిలేశారు. ఇప్పటికీ పూర్తికాక వర్షాకాలంలో వరద ప్రవాహం సూళ్లూరుపేట పట్టణంతోపాటు పరిసర గ్రామాలను ముంచెత్తుతోంది. సూళ్లూరుపేట ఎగువన నదిలో కలిసే నెర్రికాలువకు సైతం తరచూ గండ్లు పడుతున్నాయి. దీనికి కాంక్రీట్ లైనింగ్ కోసం గత వైకాపా ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసినా సకాలంలో చెల్లింపులు లేక గుత్తేదారులు చేతులెత్తేశారు. 2024 నవంబరు, డిసెంబరులో కురిసిన వర్షాలకు సూళ్లూరుపేటలోని లూథరన్ చర్చి వెనుక కాళంగి పొర్లుకట్టకు సుమారు 30 మీటర్ల మేర భారీ గండి పడింది. అప్పట్లో ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ కోతకు గురైంది. ప్రస్తుతం భారీ గండిపడి సూళ్లూరుపేటలోని మురుగునీరంతా నదిలో చేరుతోంది.

**నిధులకు ప్రతిపాదనలు**

సూళ్లూరుపేటలో చర్చి వెనుక పడిన గండిని పూడ్చి రివెట్‌మెంటుతోపాటు నెర్రికాలువకు తూర్పు వైపున 30 మీటర్ల మేర కాంక్రీటు గోడ నిర్మించేందుకు జలవనరుల శాఖ ఇంజినీర్లు రూ. 39 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదు. ఈశాన్య వర్షాలు ప్రారంభంకాక మునుపే నిధులు మంజూరు చేసి పనులు చేయాల్సిన అవసరముంది. గండ్లకు సంబంధించిన డీపీఆర్‌లు ప్రభుత్వానికి పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తామని డీఈఈ కస్తూరయ్య తెలిపారు.

# డిజిటల్ చెల్లింపులు.. సేవల్లో వేగం

చిత్తూరు : మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా వినియోగదారుల అవసరాలు తీర్చేలా తపాలా శాఖ నూతన హంగులు అద్దుకుంటోంది. అధునాతన సాంకేతికత 2.0 సేవల్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు డివిజన్ పరిధిలోని 427 తపాలా కార్యాలయాల్లో నవీకరణ పూర్తిచేశారు.



పొదుపు, బీమా సేవలు వేగవంతం, నూతన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. గ్రామాల్లోని తపాలా కార్యాలయాల నుంచి సులభంగా డిజిటల్ చెల్లింపులు జరిపేలా సంస్కరణలు తీసుకొచ్చారు. దీని కోసం 'డాక్ పే' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్‌తోపాటు యూపీఐ ఆధారిత చెల్లింపులకు దీనిని వినియోగించవచ్చు. ఇంటి నుంచే రిజిస్టర్, స్పీడ్ పోస్టు, వివిధ రకాల పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చు. పోస్ట్‌మెన్ ద్వారా పంపే వెసులుబాటు ఉంటుంది. దీనికి సేవా రుసుం ఉండదు. రూ. 500కు పైగా విలువ ఉన్నవాటికి నిర్దేశిత రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ మొబైల్ సేవలు యాప్ ద్వారా నామమాత్రపు చెల్లింపులతో పొందవచ్చు. ఓటీపీ ద్వారా బట్వాడా, సాధారణ ఉత్తరాలకు ట్రాకింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. లోపాలపై డాక్ సేవ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్ సేవలు పొందవచ్చు.

# అధికారం అండగా.. తవ్వకాలు దండిగా



అనకాపల్లి : ఎక్కడైనా అన్నిపార్టీల నేతలు ఒక్క తాటిపైకి రావడమంటే కాస్తంత అరుదే. అది ప్రజా సమస్యల పరిష్కారం కోసమైతే బాగుండేది. కానీ అందరూ ఒక్కటైంది.. ప్రభుత్వ భూములు, చెరువులు, కొండవాలు ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకునేందుకు. 'మీరు తవ్వుకోండి. ఏం జరిగినా మేముంటాం.. మాకు వాటాలివ్వండి' అంటూ అక్రమాలకు పాల్పడుతున్న వైకాపా నేతలకు అధికార పార్టీ నేతలే అండదండలందిస్తున్నారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. విశాఖ నగరానికి చేరువలో ఉండటంతో లేఅవుట్లు అధికంగా వెలుస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఈ పనులకు మట్టి, గ్రావెల్ అవసరం తీవ్రంగా ఉంది. దీన్ని అవకాశంగా చేసుకుని.. వైకాపా నేతలు గత ప్రభుత్వంలోనే ఓ ముఠాగా ఏర్పడి అక్రమాలు మొదలెట్టారు. ఇంటి పునాదుల పేరు చెప్పి చెరువులు, కొండవాలు ప్రాంతాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ తవ్వేయడం మొదలుపెట్టారు. ప్రభుత్వం మారింది కానీ వీరు తీరు మారలేదు. అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు వీరికి తెరవెనుక నుంచి మద్దతు ఇస్తున్నారు. రెవెన్యూ అధికారుల చేతులు తడుపుతుండటంతో వీరి ఆగడాలను ప్రశ్నించేవారే లేకుండాపోయారు. కొన్ని రోజుల క్రితం మండల ప్రజలు పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు దగ్గరకు వెళ్లి ప్రకృతి వనరులను మూకుమ్మడిగా ధ్వంసం చేస్తున్నారంటూ మొరపెట్టుకున్నారు. అయినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమీ మారలేదు.


**సహజ వనరులు ధ్వంసం**

సబ్బవరంలోని బాటజంగాలపాలెంలో చిక్కాలవానిచెరువు 60 ఎకరాల్లో విస్తరించి ఉంది. కొన్ని రోజులుగా 50కి పైగా టిప్పర్లు చెరువు మట్టిని స్థానికంగా వెలిసిన లేఅవుట్లకు తరలించేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతోపాటు.. అసకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపుర అగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గంగవరం కొండవాలు ప్రదేశంలోని పేదల ఇళ్లకు ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంలో భారీగా తవ్వకాలు చేస్తున్నారు. ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండ వద్ద కొద్ది రోజులుగా తవ్వకాలు జరుపుతున్నారు. అక్కడ నుంచి గ్రావెల్‌ను సమీపంలోని ప్రైవేటు వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ప్రభుత్వ స్థలంలో తవ్వితే కఠిన చర్యలు**

– శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి ప్రభుత్వ స్థలాలు, కొండవాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలను గుర్తించాం. రెవెన్యూ సిబ్బందిని పంపించి తరచూ తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేయడంతోపాటు అపరాధ రుసుం విధిస్తాం.

# భూసేకరణ పేరుతో దోచిపెట్టారు



విశాఖపట్నం: 'అన్ని వ్యవస్థల్లాగే గృహ నిర్మాణం (పేదల ఇళ్లు)ను ఆదాయ వ్యవస్థలా గత వైకాపా ప్రభుత్వం చూసింది. లబ్ధిదారుల గురించి ఏమాత్రం ఆలోచించలేదు. భూసేకరణ పేరుతో వైకాపా నేతలకు దోచిపెట్టారు' అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. భీమిలి నియోజకవర్గంలోని తంగుడుబిల్లిలో 690 ఎకరాల్లో చేపట్టిన 'మెగా హౌసింగ్ ప్రాజెక్టు'లో ఇళ్లను ఆయన పరిశీలించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ 'ఒక మంచి ప్రదేశం, వాతావరణంలో మున్సిపాల్టీకి సరిపడా ప్రజలు నివాసం ఉండాల్సిన తంగుడుబిల్లి టౌన్‌షిప్‌లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకుండా వైకాపా పాలకులు పూర్తిగా గాలికొదిలేశారు. భీమిలి పరిధిలో అర్హులున్నప్పటికీ, ఎక్కడో 30 కి.మీ. దూరంలో ఉన్న గాజువాక, నగర పరిధిలో ఉంటున్నవారికి ఇక్కడ ఇళ్లు కేటాయించడం విచిత్రంగా ఉంది. నాలుగేళ్ల క్రితం ప్రాజెక్టు ప్రారంభమైతే 16,996 ఇళ్లకు ఇప్పటికి కేవలం 2,036 పూర్తయ్యాయి'అని పేర్కొన్నారు.**గుత్తేదారు గైర్హాజరుపై ఆగ్రహం:** 'పేదలందరికీ ఇళ్లు' అనేది తెదేపా సంకల్పమని, కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని గంటా అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలు ఇవ్వనున్నామని తెలిపారు. తంగుడుబిల్లి పర్యటనలో గుత్తేదారు గైర్హాజరుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు పూర్తయిన జాబితా తీసుకుని ముగ్గురు లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో స్వయంగా మాట్లాడారు. 'మౌలిక సదుపాయాలు కల్పిస్తే వచ్చి ఇక్కడ ఉంటారా? నిర్మాణ పనులు నాణ్యతగా జరుగుతున్నాయా.. లేదా అని చూసుకున్నారా?' అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచే జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో మాట్లాడారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఈపీడీసీఎల్, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు, ప్రణాళికలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఏఈ శ్యామ్, ఎమ్మార్వో శ్రీనుబాబు తెదేపా నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, అప్పారావు, బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సందిగ్ధంలో పీజీ హోమియో విద్య

రాజమహేంద్రవరం : కేంద్ర ప్రభుత్వం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలోని హోమియో వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో హోమియో ప్రభుత్వ వైద్య కళాశాలలు మూడే ఉంటే.. అందులో రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి కళాశాల ప్రధానమైంది. ఇక్కడ 60కి పైగా యూజీ, 23 పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు ఉన్నారు. ఆచార్యుల కొరతతో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ సీట్లను మంజూరు చేయడానికి జాతీయ హోమియోపతి మండలి(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి) అనుమతులు నిరాకరించింది. ఎన్‌సీహెచ్ నిబంధనల ప్రకారం ప్రతి ప్రొఫెసర్ ముగ్గురు పీజీ విద్యార్థులకు మాత్రమే మార్గదర్శకం(గైడ్) చేయాల్సి ఉంది. ఇక్కడ సరిపడా ప్రొఫెసర్లు లేకపోవడంతో పీజీ విద్యకు తాత్కాలికంగా అనుమతులు నిలిపివేసింది. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వ కృషితో పీజీ వైద్య విద్యలో మూడు విభాగాలకు అనుమతులొచ్చాయి. గతేడాది ప్రొఫెసర్ల కొరత కారణంగా పీజీ సీట్లు నిలిపివేస్తామని ఎన్‌సీహెచ్ హెచ్చరించింది. ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి దిల్లీ వెళ్లి ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం



సీట్లు యథావిధిగా మంజూరయ్యాయి. కళాశాలలో మొత్తం 12 విభాగాలున్నాయి. ఒక్కోదానికీ ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ప్రొఫెసర్ల విభాగంలో మొత్తం అయిదుగురే సేవలందిస్తున్నారు.

**త్వరలోనే కౌన్సెలింగ్**

కొన్నేళ్లుగా ఇదే ప్రొఫెసర్ల సంఖ్యతో కళాశాలలో బోధన సాగినా జాతీయ హోమియోపతి మండలి పరిశీలనకు వచ్చినప్పుడు అతిథి ఆచార్యులను నియమించి, అనుమతులు కాపాడుకునేవారు. మళ్లీ ఆ దిశగా ప్రయత్నాలు చేయాల్సి ఉంది. త్వరలోనే హోమియో పీజీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో కళాశాలలో పీజీ విద్యకు అనుమతులొచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

# రేషన్ దందా.. కళ్లెం ఉందా?

కాకినాడ : ప్రభుత్వం మారినా.. సరకుల పంపిణీలో పద్ధతి మార్చినా రేషన్ మాఫియాకు కళ్లెం పడడం లేదు..వైకాపా సర్కారులో చక్రం తిప్పినవారు ఇప్పుడూ హవా కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల వారీ ముఠాలు ఏర్పాటుచేసుకుని దందాలు నడుపుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో 6ఏ కేసులు 83 నమోదయ్యాయంటే వీరు ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థమవుతోంది.

**ఎనిమిది నెలల్లో ఇదీ పరిస్థితి**

2024 డిసెంబరు నుంచి ఈ ఏడాది జులై 19 వరకు పట్టుబడిన బియ్యం నిల్వలు 47,148 టన్నులు. వాటి విలువ రూ. 220 కోట్లు. ఈ ఏడాది జనవరి నుంచి పట్టుబడినవారిలో డీలర్లు 20 మంది ఉంటే, అక్రమంగా నిల్వ చేసినవారు 20, అక్రమ రవాణా చేస్తున్నవారు 12 మంది ఉన్నారు.

**ఇక్కడే ఎక్కువ..**కాకినాడ నగరం, గ్రామీణం, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో పెద్దఎత్తున రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కార్డుదారుల నుంచి కేజీ రూ. 15 చొప్పున కొందరు డీలర్లు, హాకర్లు కొంటున్నారు. వీటిని మాఫియా కిలో రూ. 18కు కొనుగోలు చేస్తోంది.



ఈ ముఠా కొందరు మిల్లర్లు, ఎగుమతిదారులు, ఇతర వ్యక్తులకు రూ. 26 చొప్పున విక్రయిస్తోంది. ప్రస్తుతం కాకినాడ పోర్టులో పచ్చిబియ్యం ఎగుమతులు మందగించడంతో ఇతర ప్రాంతాల పోర్టులకు తరలిస్తున్నారు.

**ఈ నెలలో చిక్కారిలా..**

ఈనెల 3న కాకినాడ గ్రామీణ మండలంలో 1,100 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొర్లపాటి సూర్యభరత్, పాకలపాటి వెంకటేశ్వరరావుపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదుచేశారు.

8న తూరంగిలోని ఓ గోదాములో రూ. 5.27 లక్షల విలువైన 11 టన్నుల పేదల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తలారి వీరబాబు అనే వ్యక్తిపై 6ఏతో పాటు క్రిమినల్ కేసు కట్టారు.

ఈనెల 13న పెద్దాపురం మండలం గోరింటలో రాచంశెట్టి స్వామి ఇంటి వద్ద నిల్వ చేసిన 4.76 టన్నుల సరకు లభ్యమైంది.

అరకొర సిబ్బందితో పర్యవేక్షణ ఎలా..

జిల్లాలో 21 మండలాలకు గాను 11 సీఎస్‌డీటీ పోస్టులున్నాయి. వీరిలో 9 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరే ప్రతీనెలా రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా..పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలి. ఇంత తక్కువ మందితో సాధ్యమా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జగ్గంపేట, గండేపల్లి మండలాల సీఎస్‌డీటీ విధుల్లో చేరలేదు. పిఠాపురం, గొల్లప్రోలు అధికారి పాడా కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు.

**పట్టుబడితే క్రిమినల్ కేసులు**

రేషన్ బియ్యం కొన్నా, విక్రయించినా, అక్రమంగా తరలించినా క్రిమినల్ కేసులు నమోదుచేస్తున్నాం. పలుమార్లు అక్రమ నిల్వలు, తరలింపులో పట్టుబడినవారిపై మరిన్ని చర్యలకు సిద్ధమవుతున్నాం. ఎక్కడైనా ఇటువంటి నిల్వలు ఉంటే సమాచారం అందించాలి. ఆర్. సత్యనారాయణరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

## ట్రెడిషనల్ లుక్ లో హీట్ పెంచుతున్న పాయల్..నడుము వయ్యారాలతో!

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ వాడకం పెరిగిపోయిన తర్వాత ప్రతి ఒక్కరు కూడా తమ ఉనికిని చాటుకోవడానికి నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే జూనియర్లను మొదలుకొని సీనియర్ స్టార్ హీరోయిన్ల వరకు ప్రతి ఒక్కరు తమ అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఇలా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకొని అటు దర్శక నిర్మాతల దృష్టిలో పడుతున్నారని చెప్పవచ్చు.. ఈ క్రమంలోనే అవకాశాల కోసం మరో హీరోయిన్ ట్రెడిషనల్ లుక్ లో కనిపిస్తూనే తన అందాలతో హీట్ పెంచుతోంది. ఆమె ఎవరో కాదు పాయల్ రాజ్ పుత్.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ తో ఆకట్టుకునే ఈమె.. గత రెండు మూడు రోజులుగా ట్రెడిషనల్ లుక్కులో దర్శనమిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే తాజాగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన పింక్ కలర్ లెహంగా ధరించి.. దానికి కాంబినేషన్లో గోల్డెన్ కలర్ స్లీవ్ లెస్ డీప్ వీ నెక్ బ్లౌజ్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా బ్లౌజ్ లెహంగా మధ్య నడుమును హైలైట్ చేస్తూ ఫోటోలకు



ఫోజులు ఇచ్చిన తీరు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ట్రెడిషనల్ లుక్ అంటూనే హాట్ లుక్ లో అందాలను ఆరబోస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే పాయల్ షేర్ చేసిన ఈ ఫోటోలు మరింత వైరల్ గా మారుతున్నాయి. పాయల్ రాజ్ పుత్ విషయానికి వస్తే.. 1992 డిసెంబర్ 5న న్యూఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించారు. ఈమె తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇటీవలే పాయల్ తన తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం తల్లితో కలిసి ఉంటున్నారు. చిన్ననాటి నుండే నటనపై మక్కువ ఉండడంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సినీ రంగంలోకి అడుగు పెట్టింది. అలా పాయల్ హిందీ టెలివిజన్ సీరియల్ తో పాటు పంజాబీ సినిమా చన్నా మేరేయా (2017) సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది.. 2018లో తెలుగు సినిమా ఆర్ఎక్స్ 100 ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ప్రముఖ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో కార్తికేయ హీరోగా వచ్చిన ఈ సినిమాలో పాయల్ ఒకవైపు హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు విలన్ గా చేసి తన నటనతో అబ్బురపరిచింది. ఆర్ఎక్స్ 100 సినిమాతో భారీ క్రేజ్ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఒకవైపు పంజాబీ, హిందీ చిత్రాలలో నటిస్తూనే మరొకవైపు తెలుగులో ఎన్టీఆర్:కథానాయకుడు, సీత, ఆర్డిఎక్స్ లవ్, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, జిన్నా, మాయ పేటిక వంటి చిత్రాలలో నటించింది. ఇక చివరిగా మంగళవారం సినిమాలో నటించి ఒక్కసారిగా భయపెట్టేసింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం తమిళ్ లో కూడా సినిమాలు చేస్తున్నట్లు సమాచారం.

## రీఎంట్రీకి రెడీ అయిన మరో హీరోయిన్

ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎవరెప్పుడు ఎలా మెరిసి, ఎలా సడెన్ గా కనుమరుగైపోతారో చెప్పలేం. మరీ ముఖ్యంగా హీరోయిన్లు. కొందరు హీరోయిన్లకు సక్సెస్ వచ్చినప్పటికీ ఇండస్ట్రీలో కనిపించరు. దానికి ఎన్నో రకాల కారణాలుండొచ్చు. అలాంటి ఓ హీరోయినే నటి రేఖ. శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చి మొదటి సినిమా ఆనందంతో ఎంతో మందిని మెప్పించిన రేఖ తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయస్తురాలే.

**ఏ సపోర్ట్ లేకుండానే..** ఆనందం సినిమా సక్సెస్ తర్వాత తెలుగులో దొంగోడు, ఒకటో నెం. కుర్రాడు, జానకి వెడ్స్ శ్రీరామ్ లాంటి హిట్ సినిమాల్లో కనిపించిన రేఖ కొంతకాలానికి తెలుగు సినిమాకు దూరమై



లైమ్ లైట్ లో కనిపించకుండా పోయింది. కర్ణాటకకు చెందిన రేఖ చిన్న ఏజ్ లోనే సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండానే ఇండస్ట్రీలోకి వచ్చిన రేఖకు అదే టైమ్లో కన్నడ ఇండస్ట్రీ నుంచి కూడా ఆఫర్లు రావడం మొదలుపెట్టాయి.

**పర్సనల్ రీజన్స్ వల్ల ఇండస్ట్రీకి దూరం...** కానీ 2014 తర్వాత రేఖ పర్సనల్ రీజన్స్ మరియు హెల్త్ ఇష్యూస్ కారణంగా రెస్ట్ తీసుకోవాలని నిర్ణయించుకుని, సినీ ఇండస్ట్రీకి దూరమైంది. అలాంటి రేఖ ఇప్పుడు తిరిగి యాక్టింగ్ ను కంటిన్యూ చేయాలని డిసైడైంది. అందులో భాగంగానే టాలీవుడ్ లోకి కంబ్యాక్ ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. నటిగా తనను ఛాలెంజ్ చేసే పాత్రల కోసం రేఖ ఇప్పుడు వెతుకుతున్నట్టు సమాచారం. సినిమాల్లోనే కాకుండా ఓటీటీ షో లలో ఏదైనా పవర్‌ఫుల్ రోల్స్ ఉన్నా చేయడానికి రెడీ అంటోంది రేఖ. అందులో భాగంగానే రేఖ రీసెంట్ గా తన పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ను కూడా ఓపెన్ చేసి, దాని ద్వారా ఫ్యాన్స్ కు రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. అయితే ఇన్నేళ్ల తర్వాత కూడా రేఖ అంతే అందంతో కనిపిస్తూ అదే ఆకర్షణతో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేస్తోంది. మరి తను కోరుకున్న కంబ్యాక్ రేఖకు ఎప్పుడు దొరుకుతుందో చూడాలి.




## ఘాటీ ప్రపంచంలో 'దస్సోర దస్సోర'




టాలీవుడ్ క్వీన్ అనుష్క శెట్టిని బిగ్ స్క్రీన్ పై చూసి చాలా కాలమైంది. ఇక మరోసారి తన ప్రత్యేకమైన స్క్రిప్ట్ సెలెక్షన్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఘాటీ అనే యాక్షన్ డ్రామాలో ఆమె కీలక పాత్రలో నటిస్తోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రానికి క్రిష్ జగర్లమూడి దర్శకత్వం వహిస్తుండగా, యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి భారీ బడ్జెట్ పై నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్, ఫస్ట్ సాంగ్ సూపర్ రెస్పాన్స్ పొందాయి. సినిమా మీద అంచనాలు ఒక్కసారిగా పెంచేశాయి. తాజాగా దస్సోర దస్సోర అనే పవర్ ప్యాక్డ్ రాక్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ తో సినిమా చుట్టూ హైప్ మరింత పెరిగింది. ఈ పాటను సంగీత దర్శకుడు సాగర్ నాగవల్లి కంపోజ్ చేయగా, లిరిక్స్ ను ఈఎస్ మూర్తి రాశారు. లిరిక్స్ ఘాటీల జీవితంలో ఎదురయ్యే కష్టాలు, వాస్తవాన్ని హైలెట్ చేశాయి. రాక్ స్టైల్ మ్యూజిక్‌తో పాటను బలంగా నిలిపారు. గీతా మాధురి, సాకేత్ కోమందూరి, శ్రుతి రంజని తమ ఎనర్జిటిక్ వాయిస్ తో ఈ సాంగ్ ను మరింత పవర్‌ఫుల్ చేశారు. అదే సమయంలో పాటలో చూపించిన యాక్షన్ సీన్స్, బీటీఎస్ క్లిప్స్ సినిమాకు ఉన్న ఇంటెన్సిటీని స్పష్టంగా చూపించాయి. క్రిష్ జగర్లమూడి తన విజన్ తో, ప్యాషన్ తో తెరకెక్కిస్తున్న ఈ మూవీ, టెక్నికల్ విలువల పరంగా కూడా వేరే లెవెల్ లో కనిపిస్తోంది. ప్రతి ఫ్రేమ్ లో డీటైలింగ్ అద్భుతంగా ఉందని ఇప్పటికే టాక్.

అనుష్క శెట్టి స్క్రీన్ ప్రెజెన్స్ మరీ ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆమె బాడీ లాంగ్వేజ్, ఇంటెన్సిటీ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. విక్రమ్ ప్రభు మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తుండగా, హీరోయిన్ గా అనుష్క చేసే సీన్స్ సినిమాకు మేజర్ హైలైట్ అవుతాయని తెలుస్తోంది. ఘాటీ పాన్ ఇండియా స్థాయిలో, మల్టిపుల్ లాంగ్వేజెస్ లో సెప్టెంబర్ 5న విడుదల అవుతోంది. యాక్షన్ తో పాటు భావోద్వేగాలు కలిపి రూపొందించిన ఈ సినిమా ప్రేక్షకులను బలంగా కట్టిపడేస్తుందనే నమ్మకం క్రిష్ టీమ్ లో ఉంది. ఇప్పుడు రిలీజ్ చేసిన దస్సోర దస్సోర పాటతో ఆ అంచనాలు మరింత రెట్టింపు అయ్యాయి. ఇక సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అంచనాలను అందుకుంటుందో చూడాలి.

## ఒక్క రోజు తేడాతో... తగ్గాల్సింది ఎవరు?






కేజీఎఫ్ సినిమా తర్వాత యశ్ స్థాయి అమాంతం పెరిగింది. కేజీఎఫ్ 2 ఏకంగా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో యశ్ తదుపరి సినిమా అదే స్థాయిలో ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందుకే చాలా గ్యాప్ తీసుకుని యశ్ టాక్సిక్ సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా మేకింగ్‌కు చాలా ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగానే యశ్ సినిమాలు కాస్త ఎక్కువ సమయం తీసుకుంటారు అంటారు. ఇప్పుడు అంతకు మించి అన్నట్లుగా యశ్ టాక్సిక్ సినిమాకి తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొదట 2025లో సినిమా విడుదల చేయాలని మేకర్స్ బలంగా భావించారు. కానీ సినిమా మేకింగ్ ముందుగా అనుకున్నట్లుగా కాకుండా చాలా ఎక్కువ రోజులు తీసుకుంటుంది. అందుకే సినిమాను 2026 కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెల్సిందే.

**యశ్ టాక్సిక్ రిలీజ్ డేట్...** కన్నడ సినిమా వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం టాక్సిక్ సినిమాను ఖచ్చితంగా 2026 మార్చి 19న విడుదల చేయబోతున్నారు. ఆ తేదీని చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా షూటింగ్ మరో నెల రోజుల్లో పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆలస్యం అయితే మహా అయితే అక్టోబర్ వరకు పడుతుంది. ఆ తర్వాత వీఎఫ్ఎక్స్ వర్క్, ఇతర వర్క్ అంతా పూర్తి చేసి 2026 జనవరి చివరి వరకు ఫస్ట్ కాపీ రెడీ చేస్తారు. కనుక మార్చి లో సినిమాను విడుదల చేయడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు అనేది ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈ మధ్య కాలంలో టాక్సిక్ సినిమాకు సంబంధించి అంచనాలు పెరిగే విధంగా చిత్ర యూనిట్ సభ్యులు లీక్‌లు ఇస్తున్నారు. దాంతో పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెరిగాయి.

**బాలీవుడ్ మూవీకి పోటీగా...** ఒక వైపు కేజీఎఫ్ తో వచ్చిన స్టార్‌డంతో టాక్సిక్ సినిమాను ఓ రేంజ్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్న యశ్ కి పోటీగా బాలీవుడ్ మూవీ 'లవ్ అండ్ వార్' పోటీగా దిగే అవకాశాలు ఉన్నాయి. సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను రూపొందిస్తున్నాడు. దాదాపు నాలుగు ఏళ్ల తర్వాత ఆయన నుంచి రాబోతున్న సినిమా ఇది. సాధారణంగానే బాలీవుడ్‌తో పాటు అన్ని భాషల్లోనూ సంజయ్ లీలా భన్సాలీ సినిమా వస్తుంది అంటే ఒకరకమైన ఆసక్తి, అంచనాలు ఉంటాయి. అలాగే ఈ సినిమా విషయంలోనూ అదే స్థాయిలో ఆసక్తి ఉంది. ఇప్పుడు లవ్ అండ్ వార్ సినిమా విషయంలోనూ హిందీ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా సంజయ్ లీలా భన్సాలీ చాలా కాలం తర్వాత అత్యధికంగా ఈ సినిమాను విదేశాల్లో చిత్రీకరించడం, లవ్ అండ్ వార్ అంటూ విభిన్నమైన టైటిల్ ఉండటంతో అంచనాలు పెరిగి పోయాయి.

**సంజయ్ లీలా భన్సాలీ లవ్ అండ్ వార్...** లవ్ అండ్ వార్ సినిమాలో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్, ఆలియా భట్ లు నటించారు. ఇద్దరు హీరోలు నటించిన సినిమా కావడంతో ఆసక్తి మరింతగా పెరిగింది. ముగ్గురి మధ్య ప్రేమ కథగా ఈ సినిమా రూపొందుతున్నట్లు మొదటి నుంచి వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సినిమాలో యాక్షన్ సన్నివేశాలకు పెద్ద పీట వేశారని తెలుస్తోంది. మొత్తానికి ఈ బిగ్ మల్టీస్టారర్ మూవీ పై బాలీవుడ్ ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. రెండు సినిమాలు కూడా హోరా హోరీగా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు బాక్సాఫీస్ వద్ద పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. అయితే రెండు పెద్ద సినిమాలు ఒకే సారి విడుదల అయితే ఏం జరుగుతుంది అనేది కూలీ – వార్ 2 విషయంలో వెల్లడి అయింది. కనుక చివరి నిమిషంలో ఎవరో ఒకరు తగ్గితే బాగుంటుంది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.

## కేతిక శర్మ బోల్డ్ ఆఫర్ కి నో చెప్పిందా?

ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ కెరీర్ ప్రారంభించి ఐదేళ్లు అవుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి ఐదారు సినిమాలు చేసింది. కానీ వాటిలో హిట్ అయినవి ఎన్ని అంటే? కనిపించడం కష్టమే. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ మాత్రమే అమ్మడి కెరీర్ లో తొలి హిట్. ట్రయాంగిల్ లవ్ స్టోరీ లో కేతిక పాత్రకు మంచి మార్కు లే పడ్డాయి. చబ్బీ లుక్ లో యువతని ఆకట్టుకుంటుంది. నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతో అందరికీ కనెక్ట్ అయింది. దీంతో అమ్మడికి కొత్త అవకాశాలు ప్రారంభమైనట్లుకనిపిస్తుంది.ల ప్రస్తుతం రాజేష్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోంది. అలాగే కోలీవుడ్ లో కూడా ఛాన్సులొస్తున్నాయి. అందం, అభినయ గల నాయిక కావడంతో ప్రోత్సహించే వారు వెంట పడుతుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా టాలీవుడ్లో ఓ నిర్మాత అప్రోచ్ అయి ఓఛాన్స్ ఆఫర్ చేసాడుట. అయితే



అది బోల్డ్ కంటెంట్ ఉన్న చిత్రం కావడంతో కేతిక స్టోరీ విని రిజెక్ట్ చేసిందిట. కథలో కేతిక పాత్ర బాగా బోల్డ్ గా ఉంటుందని.. ద్వితియార్ధం కథలో మరింతగా బోల్డ్ నెస్ హైలైట్ అవుతుందన్న కారణంగా తిరస్కరించినట్లు తెలిసింది. కేతిక ఇమేజ్ ఆధారంగా రెడీ చేసిన కథ కావడంతో ఆమె ఒప్పుకుంటుందని నమ్మకంతో సదరు దర్శక నిర్మాత కాన్ఫిడెంట్ గా ముందుకెళ్లినా? ఊహించని సమాధానం చెప్పిందని సదరు దర్శక నిర్మాత బయట చెబుతున్నాడు. దీంతో ఇప్పుడాయన మరో నాయికను వెతుక్కునే పనిలో ఉన్నట్లు తెలిపాడు. ఆ హీరోయిన్ కూడా అచ్చంగా కేతిక లుక్ లోనే ఉండే వాళ్లనే ఎంపిక చేస్తానంటున్నాడు. అలాంటి భామ దొరికితే ఒకే లేదంటే? కథలో మళ్లీ మార్పులు చేసి కొత్త భామ కోసం ట్రై చేస్తానన్నాడు. హీరోయిన్లను గుడ్డిగా నమ్మి ముందుకెళ్తే ఇలా ఉంటుంది? అన్నది ఇదో అనుభవంగా చెప్పుకొచ్చాడు. ఏనటి అయినా పోషించే పాత్ర మనసుకు నచ్చితేనే అంగీకరిస్తారు. మనసు చంపుకుని నటించడానికి ఏ నటి సాహసించదన్నది గుర్తించడం అంతే అవసరం.

## శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ.. ఇది ఊహించని షాక్?

యంగ్ హీరోయిన్ శ్రీలీలకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అందం, అభినయం సమపాళ్లలో ఉన్న ఆమె.. టాలీవుడ్ లో తక్కువ టైమ్ లోనే ఎక్కువ స్టార్ డమ్ సంపాదించుకుంది. ఒక్కసారి సెన్సేషనల్ బ్యూటీగా మారిపోయింది. ఒకే ఏడాది దాదాపు అరడజనుకు పైగా సినిమాలు అనౌన్స్ చేసి షాక్ ఇచ్చిందనే చెప్పాలి. స్టార్ హీరోలతో వరుసగా ఛాన్స్ లు అందుకున్న అమ్మడు.. ఒక్కసారిగా ఫ్లాపులు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు బోల్తా కొట్టడంతో కాస్త అవకాశాలు తగ్గాయి. కానీ క్రేజ్ అలానే ఉంది. ఇప్పుడు మళ్లీ జోరు పెంచిన శ్రీలీల.. కంటెంట్, పాత్ర ప్రాధాన్యత చూసి సినిమాలు ఎంచుకోవాలని నిర్ణయించుకుందని క్లియర్ గా తెలుస్తోంది. అయితే త్వరలో బాలీవుడ్ లోకి శ్రీలీల అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ డెబ్యూ మూవీ దిలేర్ల తో తెరంగ్రేటం చేయనుంది అమ్మడు. మొదటి నుంచి డైరెక్షన్ పై ఫోకస్ చేసిన ఇబ్రహీం అలీ



ఖాన్.. ఇప్పుడు హీరోగా బిగ్ స్క్రీన్ పై సందడి చేస్తున్నారు. దిలేర్ చిత్రానికి కృణాల్ దేశ్?ముఖ్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ మాడాక్ ఫిల్మ్స్ సంస్థ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తోంది. ఇప్పటికే షూటింగ్ జరుగుతుండగా.. సరైన మూవీతో హిందీలో శ్రీలీల లాంచ్ అవుతుందని అంతా ఎక్స్పెక్ట్ చేశారు. కానీ ఇప్పుడు ఆ సినిమా థియేటర్స్ లోకి కాకుండా డైరెక్ట్ గా ఓటీటీలోకి రానుందని వినికిడి. అయితే అది శ్రీలీలకు ఇది పెద్ద ఎదురుదెబ్బనే చెప్పాలి. డెబ్యూ మూవీ ఓటీటీలోకి అంటే కాస్త ఆమోదించాల్సిన విషయం కాదు. పలు విషయాల వల్ల మేకర్స్ అలా చేస్తున్నారని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఆ విషయంలో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అమ్మడు మంచి ఛాన్స్ మిస్ అవుతుందని అంటున్నారు. అదే సమయంలో సినిమా రిజల్ట్ తేడా కొడితే డిజిటల్ విడుదల ఆమెను పరాజయం నుంచి కాపాడవచ్చని చెబుతున్నారు. అయితే దిలేర్ ఓటీటీ రిలీజ్ కన్ఫర్మ్ అయితే శ్రీలీల బాలీవుడ్ బిగ్ స్క్రీన్ లాంచ్ కార్తీక్ ఆర్యన్ తో ఆమె చేస్తున్న రొమాంటిక్ డ్రామాకు మారవచ్చు. ఇది కచ్చితంగా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఆ ప్రాజెక్ట్ తో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనుంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536